అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 15-8-2017

సమగ్ర తెలుగు దినపత్రిక




సంపుటి : 3 సంచిక : 228 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 14 + 48 పేజీలు వెల : 5.00





పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
నవతెలంగాణ
పంద్రాగస్టు
శుభాకాంక్షలు.
చీఫ్ జనరల్ మేనేజర్





గూగుల్ శోధనలో తెలుగు మాటలు

న్యూఢిల్లీ: 'గూగుల్ తన వాయిస్ సెర్చ్ సేవలను భారత్‌లో మరింత విస్తరించింది. ఇప్పటికే భారత్‌లో గూగుల్ వాయిస్ సెర్చ్ ఆప్షన్ ఇంగ్లిష్, హిందీ భాషల్లో అందుబాటులో ఉండగా.. ఇప్పుడు మరికొన్ని ప్రాంతీయ భాషలకు ఆ సేవలను విస్తరించింది. తెలుగు, బెంగాళీ, మలయాళంతోపాటు మొత్తం ఎనిమిది భాషల్లో ఇక నెటిజన్లు ఎలాంటి పదాలు టైప్ చేయకుండానే.. కేవలం నోటి మాటల ద్వారా కమాండ్లు అందించి గూగుల్‌లో దేని గురించైనా శోధించవచ్చు. అయితే తెలుగు మాటలు ప్రాంతాల వారీగా వేరుగా ఉన్నది మరి గూగుల్ వాయిస్ సెర్చ్ సేవలు ఏ ప్రామాణికంగా తీసుకుంటుందన్న దానిపై చర్చ నడుస్తున్నది. 'ప్రపంచవ్యాప్తంగా మేం 119 భాషలకు గూగుల్ సేవలు అందిస్తున్నది. తాజాగా సోమవారం, 30 కొత్త భాషలకు ఈ సేవను అందుబాటులోకి తెచ్చినట్టు ఆ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.

బంద్‌లపై మార్గదర్శకాల అమలుతీరుపై వివరణివ్వండి

- రాష్ట్రాలకు నాలుగు వారాల తుది గడువిచ్చిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: సమ్మెలు, బంద్‌ల వల్ల జరిగే నష్ట నివారణ కోసం తీసుకుంటున్న చర్యలపై వివరణ ఇచ్చేందుకు రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నాలుగు వారాల గడువిచ్చింది. ఇదే చివరి అవకాశమని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ అంశంపై ఆ తర్వాత తమ విచారణ కొనసాగిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాజకీయ పార్టీలు, వివిధ సంస్థలు నిర్వహించే సమ్మెలు, బంద్‌ల వల్ల ప్రభుత్వ ప్రయివేట్ ఆస్తులకు నష్టం జరుగుతోందంటూ కోశీకాంత్ అనే న్యాయవాది వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. ఇదే అంశంపై ఈ ఏడాది జులై 7న విచారణ సందర్భంగా కూడా నాలుగు వారాల్లోగా వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆందోళనల సందర్భంగా ఆస్తుల నష్టం జరగకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారో తెలపాలంటూ 2013, ఫిబ్రవరిలో రాష్ట్రాలతోపాటు కేంద్రానికి కూడా సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ అంశంపై 2007, 2009లో తామిచ్చిన మార్గదర్శకాలను ఎంతవరకు అమలు చేస్తున్నారో తెలపాలంటూ ఆ నోటీసుల్లో సుప్రీంకోర్టు ఆదేశించింది.

వరద ప్రాంతాలో మాణిక్ సర్కార్ పర్యటన



అగర్తల: త్రిపురలో వరద బాధిత ప్రాంతాలను రాష్ట్ర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ సందర్శించారు. భారీ వర్షాలు, వరదలకు గురైన ప్రాంతాల్లో సీపీఐ(ఎం) కార్యకర్తలు చేస్తున్న సహాయక కార్యక్రమాలను పరిశీలించారు. ప్రజల కోసం ప్రజలతో కలిసి పనిచేయడం ఒక్క సీపీఐ(ఎం)కు మాత్రమే సాధ్యమని మాణిక్ సర్కార్ అన్నారు.

3800 కోట్లు కరెంట్ బిల్లు

జంషెడ్‌పూర్: ఇండ్లలో వాడే కరెంట్ బిల్లు రూ. వందలు, వేలల్లో వస్తుంటుంది. జార్ఖండ్‌లోని ఓ వ్యక్తికి ఏకంగా రూ. 3800 కోట్లు బిల్లు రావటంతో షాక్‌కు గురయ్యాడు. జంషెడ్‌పూర్‌కు చెందిన బీఆర్ గుహ అనే వ్యక్తి విద్యుత్ బిల్లు బకాయి పద్దారంటూ ఆదివారం జార్ఖండ్ ఎలక్ట్రిసిటీ బోర్డు నుంచి నోటీసు వచ్చింది. బిల్లు చూసిన గుహ ఒక్కసారిగా కంగుతిన్నాడు. ఆయనకు వచ్చిన విద్యుత్ బిల్లు ఏకంగా రూ. 3800 కోట్లు. గుహ మాట్లాడుతూ.. 'నాకు చాలా ఆశ్చర్యంగా ఉన్నది. మా ఇంట్లో మూడు గదులుంటాయి. మేం మూడు ఫ్యాన్లు, మూడు లైట్లు ఉపయోగిస్తాం. అప్పుడప్పుడు టీవీ నడుస్తుంది. దీనికే ఇంత కరెంట్ బిల్లు ఎలా వస్తుంది?' అని అన్నారు. ఇది తమ పొరపాటేనని అధికారులు ఒప్పుకున్నారు.

ఓబీసీ రిజర్వేషన్‌లో.. సబ్‌కోటా యోచనలో మోడీ సర్కార్

న్యూఢిల్లీ: ఓబీసీ (ఇతర వెనుకబడిన తరగతులు) రిజర్వేషన్‌లో సబ్-కోటాను ప్రవేశపెట్టే యోచనలో మోడీ సర్కార్ ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు పార్లమెంట్ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టేందుకు పావులు కదుపుతున్నట్టు ఓ ఉన్నతాధికారి మీడియాతో చెప్పారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఫలాలు ఓబీసీలందరికీ దక్కాలన్నది మోడీ మనోగతమని అన్నారు. ఓబీసీ రిజర్వేషన్‌లో సబ్‌కోటా కోసం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ప్రస్తుతమున్న నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (ఎన్‌సీబీసీ) నియమ నిబంధనల్లో సవరణలు చేపట్టనున్నట్టు ఆ అధికారి చెప్పారు. ఎన్‌సీబీసీ నిబంధనల్లో సవరణలు చేపట్టాలనే బిల్లును ప్రతిపక్ష నేతలు వ్యతిరేకించినట్టయితే.. ప్రత్యేక కమిషన్ ఏర్పాటు కోసం మరో బిల్లును శీతాకాల సమావేశంలో ప్రవేశపెట్టాలని మోడీ సర్కార్ వ్యూహరచన చేస్తున్నట్టు ఆ అధికారి తెలిపారు.

స్వచ్ఛంద సంస్థల నియంత్రణ చట్టం రూపకల్పనపై.. కేంద్రాన్ని వివరణ కోరిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: స్వచ్ఛంద సంస్థల(ఎన్జీవోలు), వాటి నిధుల దుర్వినియోగంపై నియంత్రణ కోసం చట్టం రూపొందించే విషయంలో చేపట్టిన చర్యలపై కేంద్ర ప్రభుత్వ సంస్థయైన ప్రజాకార్యాచరణ పురోగతి,గ్రామీణ సాంకేతిక మండలి(సీఏపీఏఆర్‌టీ)ని సుప్రీంకోర్టు వివరణ కోరింది. గతంలో తామిచ్చిన ఆదేశాలపై ఎంతవరకు పురోగతి సాధించారని ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్, న్యాయమూర్తి డివై చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. తదుపరి విచారణను ఆగస్టు 17కు వాయిదా వేసింది. ఈలోగా అఫిడవిట్ సమర్పించాలని కేంద్ర సంస్థను ఆదేశించింది. కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ కింద పని చేసే సీఏపీఏఆర్‌టీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే స్వచ్ఛంద సంస్థలకు నిధులు మంజూరు చేస్తారు. స్వచ్ఛంద సంస్థలు నిధుల దుర్వినియోగానికి పాల్పడితే, వాటిపై విచారణ జరిపి చర్యలు చేపట్టేందుకు వీలుగా చట్టాన్ని తెచ్చే అవకాశాన్ని పరిశీలించాల్సిందిగా ఈ ఏడాది ఏప్రిల్ 26న కేంద్రాన్ని సుప్రీంకోర్టు కోరింది. రాజ్యాంగం ఏడో షెడ్యూల్‌లోని నిబంధనల ఆధారంగా ఎన్జీవో నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేయవచ్చు అని ఉన్నందున సుప్రీంకోర్టు సూచించింది.



మహా రైతుల చక్కాజామ్

'పూర్తి' రుణమాఫీ చేయాలని డిమాండ్

- అన్నదాతల రాష్ట్ర వ్యాప్త నిరసనలు
- స్తంభించిన రవాణ



ముంబయి: మహారాష్ట్రలో రైతులు మరోసారి రోడ్డెక్కారు. 'సంపూర్ణ' రుణమాఫీతోపాటు, తమ పంటకు గిట్టుబాటు ధరలను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 'చక్కా జామ్' నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో వాహనాలను అడ్డుకుని రవాణాను స్తంభింపచేశారు. నాసిక్ సమీపంలోని పాల్వేలో ఆందోళనకు దిగిన రైతులు... జాతీయ రహదారిని దిగ్బంధనం చేశారు. సతానా, త్రింబకేశ్వర్ ప్రాంతాలలోనూ ఆందోళన చేపట్టారు. ఔరంగాబాద్‌లోని క్రాంతి చౌక్ వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించి తమ నిరసనను వ్యక్తం చేశారు. పెద్దఎత్తున నినాదాలుచేశారు. రైతులను చెదరగొట్టేందుకు క్రాంతి చౌక్ వద్ద పోలీసులు లాఠీచార్జ్ చేశారు. బీడ్ జిల్లా ధరూర్ ప్రాంతంలో రైతులు రోడ్లపై బైఠాయించారు. అహ్మద్‌నగర్ జిల్లా పుంటంబ, రహురి ప్రాంతంలో ప్రదర్శనలు నిర్వహించారు. అన్నదాతలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వార్ధా జిల్లాలో రైతులు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ దిష్టిబొమ్మను తగులబెట్టారు. రాస్తారోకో నిర్వహించారు. ఎలాంటి షరతులూ లేకుండా సంపూర్ణ రుణమాఫీని ప్రభుత్వం ప్రకటించాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే... జిల్లా కేంద్రాల్లో మంత్రుల జాతీయ జెండా కార్యక్రమాలను అడ్డుకుంటామని వివిధ రైతు సంఘాల నాయకులతో కూడిన స్టీరింగ్ కమిటీ సభ్యులు శనివారం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 'బీజేపీ నేతృత్వంలో ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ లోపభూయిష్టంగా ఉంది' అని స్టీరింగ్ కమిటీ సభ్యులు రఘునాథ్ దాదా పాటిల్ ఆరోపించారు. రైతులకు సంపూర్ణ రుణ మాఫీ చేయాలి. అప్పుడే మేము మంత్రులను జాతీయ జెండా ఎగురవేసేందుకు అనుమతిస్తాం' అని పాటిల్ అన్నారు.

అన్నింటికీ సర్కారుకు లింకు పెట్టొద్దు

- ఆందోళనల పేరిట పాలు, కూరగాయలు పడేసే వారిని అన్నదాతలనలేం: లోక్‌సభ స్పీకర్



అమరావతి(మహారాష్ట్ర): పండించిన పంటకు గిట్టుబాటు ధర రాలేదనో.. పెరుగుతున్న ధరలకు కేంద్రాన్ని దోషిగా నిలబెట్టడం తగదని లోక్‌సభ స్పీకర్ సుమిత్రామహాజన్ అన్నారు. చట్టాలను రూపొందించటం, వాటిని అమలు చేయటం వరకే ప్రభుత్వ బాధ్యత అని కొత్త భాష్యం చెప్పారు. ఆదివారం రాజమాత అహ్లియాబాయి ఫౌండేషన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె పై విధంగా స్పందించారు. ఆందోళనలపేరిట రైతులు పాలు,కూరగాయలు రోడ్లపై పారేస్తున్నారు. అలాంటి వారిని అన్నదాతలుగా పరిగణించలేమని మహాజన్ చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీ డాక్టర్ వికాస్ మహాత్మేతో పాటు పలువురు హాజరయ్యారు. కాగా లోక్ సభ స్పీకర్ చేసిన వ్యాఖ్యలపై అటు అన్నదాతలు,ఇటు మహిళలు మండిపడుతున్నారు. తమకు అధికారం అప్పగించినపుడు అది చేస్తాం. అన్నీ చేస్తామంటూ గద్దెనెక్కారు. ఇప్పుడు మాత్రం పెరిగేధరలకు మమ్మల్ని బాధ్యుల్ని తగదని అంటున్నారు.

యోగి సర్కార్‌కు ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు

గోరఖ్‌పూర్ ఘటనపై వివరణ ఇవ్వాలని ఆదేశం



లక్నో : జీఆర్‌డీ ఆస్పత్రిలో చిన్నారుల మృతి ఘటనపై జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్సీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా ఈ ఘటనను సుమోటోగా స్వీకరించింది. ఈ ఘటనపై నాలుగు వారాల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని సీఎం యోగి ఆదిత్యానాథ్ సర్కార్‌ను ఆదేశించింది. బాధిత కుటుంబాల సహాయ పునరావాసం కోసం తీసుకున్న చర్యలు, దోషులపై తీసుకున్న చర్యలపై అఫిడవిట్ దాఖలు చేయాలని నోటీసులో పేర్కొంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇంత పెద్ద సంఖ్యలో శిశు మరణాలు సంభవించాయంటే ప్రజలకున్న జీవించే హక్కు, ఆరోగ్య హక్కును తీవ్రంగా ఉల్లంఘించడమేనని కమిషన్ ఛైర్మెన్ అభిప్రాయపడ్డారు.

ఆధిత్యనాథ్‌పై హత్యాభియోగాలు నమోదుచేయాలి : ఆప్

గోరఖ్‌పూర్ ఘటన నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆధిత్యనాథ్, వైద్యశాఖ ఉన్నతాధికారులపై హత్యాభియోగాలను నమోదు చేయాలని ఆప్ డిమాండ్ చేసింది. 'నేరపూరిత చర్య. ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యంవల్లే చిన్నారులు మృతిచెందారనడంలో ఎలాంటి సందేహం లేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆరోగ్యశాఖ మంత్రి, ఇతర ఉన్నతాధికారులపై ముందు కేసులు నమోదు చేయాలి' అని ఆప్ నేత సంజయ్ సింగ్ అన్నారు. బాకీ పడిన దాదాపు రూ.67 లక్షలు చెల్లించాలని ఆక్సిజన్ సరఫరా చేసే ఏజెన్సీ పదేపదే రిమైండర్లను పంపినా పట్టించుకోలేదని ఆరోపించారు. 'దేవాలయాలు, గోవులను అంబులెన్స్‌ల గురించి యూపీ ప్రభుత్వం మాట్లాడుతోంది. ప్రపంచంలో జరిగిన సంఘటనలపై ప్రధాని వెంటనే ట్వీట్లు చేస్తారు. గోరఖ్‌పూర్ ఘటనపై ఒక్క మాటైనా మాట్లాడటానికి మోడీకి తీరిక దొరకలేదు' అని సంజయ్ విమర్శించారు.

సుమోటోగా స్వీకరించలేం
అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాలని 'సుప్రీం' ఆదేశాలు

గోరఖ్‌పూర్‌లోని జీఆర్‌డీ ఆస్పత్రిలో చిన్నారుల మృతి ఘటనను సుమోటోగా స్వీకరించలేమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. బీఆర్‌డీ ఆస్పత్రిలో చిన్నారుల ఐసీయూ వార్డులో ఆక్సిజన్ సిలిండర్ల కొరత ఏర్పడటంతో సోమవారం నాటికి 73 మంది చిన్నారులు మృతి చెందారు. ఈ కేసును సుమోటోగా స్వీకరించి ప్రత్యేక దర్యాప్తు బృందంతో (సిట్) విచారణ జరిపించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థిస్తూ సుప్రీంకోర్టులో సోమవారం పిటిషన్ దాఖలైంది. భారత ప్రధాన న్యాయమూర్తి జేఎస్ ఖేహర్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం ఈ వ్యాజ్యంపై విచారణ చేపట్టింది. ' ఈ కేసు ఓ రాష్ట్రంలోని ఓ ఆస్పత్రికి సంబంధించినది. ఈ ఘటన జరిగిన తర్వాత ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు ఆస్పత్రిని సందర్శించినట్టు టీవీ ప్రసారాల్లో చూశాం. అలహాబాద్ హైకోర్టులో ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేయండి. దీనిపై మేం విచారణ చేపట్టలేం' అని జస్టిస్ జేఎస్ ఖేహర్ అన్నారు. పిటిషనర్ తరుఫున రాజశ్రీరెడ్డి వాదనలు వినిపించారు. జీఆర్‌డీ ఆస్పత్రిలో చిన్నారుల మృతి పట్ల సర్వోన్నత ధర్మాసనం స్పందించాలని సీజేను అభ్యర్థించారు. రాజశ్రీరెడ్డి వాదనలను సుప్రీంకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది. కాగా, ఈనెల7న బీఆర్‌డీ ఆస్పత్రిలోని చిన్నారుల వార్డులో ఆక్సిజన్ కొరత ఏర్పడింది. దీంతో, అభం శుభం తెలియని 73 మంది చిన్నారులు మృతి చెందారు.

ఈ ఘటన యావత్ దేశాన్ని తీవ్ర కలవరానికి గురిచేసింది. ప్రభుత్వం నుంచి ఆక్సిజన్ సిలిండర్ సరఫరాదారులకు అందాల్సిన డబ్బులు సకాలంలో అందకపోవడంతోనే సదరు గుత్తేదారు సిలిండర్ల సరఫరాను నిలిపివేశారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమేనని బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. అయితే, ప్రభుత్వం మాత్రం కంటితుడుపు చర్యగా బీఆర్‌డీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రాజీవ్ మిశ్రాను, ఆ వార్డు హెడ్ డాక్టర్ కఫీల్ అహ్మద్ ఖాన్‌లను విధుల నుంచి తొలగించి చేతులు దులుపుకున్నది. మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లిస్తామని ప్రకటించింది.

డాక్టర్ కఫీల్ ఖాన్‌ను బలిపశువును చేశారు..

ఎయిమ్స్ వైద్యులు

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ బీఆర్‌డీ ఆస్పత్రిలో చిన్నారుల మృతి ఘటనపై యూపీ ప్రభుత్వం ఆ ఆస్పత్రి డాక్టర్ కఫీల్ ఖాన్‌ను తొలగించడంపై వైద్యుల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే వైద్యులపై వేటు వేసిందని ఆరోపించారు. బీఆర్‌డీ ప్రభుత్వాస్పత్రిలో చిన్నపిల్లల వైద్య విభాగానికి నోడల్ ఆఫీసర్‌గా ఉన్న కఫీల్‌పై ప్రభుత్వం శనివారం వేటు వేసిన విషయం తెలిసిందే. 'ప్రభుత్వ వైఫల్యం, మౌలిక సదుపాయాల లోపానికి ఒక వైద్యుడిని బలిపశువును చేశారు. ఇది చాలా బాధకరం. ఇలాంటి ఘటనల్లో వైద్యులే బలిపశువులవుతున్నారు' అని ఎయిమ్స్‌లో రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు హర్జీత్ సింగ్ భట్టీ అన్నారు. ఖాన్‌ను తొలగించడాన్ని ఖండిస్తూ అసోసియేషన్ గుజరాత్ ప్రభుత్వానికి లేఖ రాసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వహించిందని లేఖలో ఆరోపించారు.

'ఆక్సిజన్, గ్లౌజ్‌లు, శస్త్రచికిత్స పరికరాలు, ప్రాథమిక మందులు వంటివి ఆస్పత్రిలో అందుబాటులో లేకపోతే బాధ్యులెవరు? ప్రభుత్వం ప్రకారం.. వైద్యులే బాధ్యులట. తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు నిందను వైద్యులపై మోపకండి.. రోగి.. వైద్యుడి మధ్య సంబంధాలను చెడగొట్టకండని రాజకీయ నాయకులను నేను విజ్ఞప్తి చేస్తున్నాను' అని భట్టీ తన లేఖలో పేర్కొన్నారు.

మలం తినిపించి.. చచ్చేదాకా కొట్టారు..

ప్రాణాలు విడిచిన దళిత మహిళ

- మంత్రగత్తెగా ముద్రవేసి కిరాతకం
- రాజస్థాన్‌లో వెలుగుచూసిన దారుణం



జైపూర్ : ఒక దళిత, వితంతురాలి (40)పై కిరాతకానికి పాల్పడిన దారుణ ఘటన బీజేపీ పాలిత రాష్ట్రం రాజస్థాన్‌లో చోటుచేసుకుంది. ఆమెను మంత్రగత్తెగా ముద్రవేశారు.. ఇంట్లో ఉన్న ఆమెను జుట్టుపట్టుకొని బయటకు ఈడ్చుకొచ్చారు. నగ్నంగా ఊరంతా తిప్పారు.. అనంతరం బలవంతంగా మలం తినిపించారు.. మురికినీళ్ళు తాపించారు. అంతటితో వారి దుర్మార్గం ఆగలేదు. చిత్రహింసలు పెట్టి దారుణంగా కొట్టారు... ఇనుపరాడ్లను కాల్చి చేతులు, కళ్ళు, శరీరంలోని ఇతర భాగాలపై వాతలుపెట్టారు. ఆ చిత్రహింసలు తాళలేక ఆ మహిళ మృతిచెందిన ఘటన రాజస్తాన్ అజ్మీర్‌లోని కాదేరా గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆమెకు ఇద్దరు పిల్లలు కూడా ఉండటం గమనార్హం. బాధితురాలి 15 ఏండ్ల కుమారుడు గ్రామస్తులను అడ్డుకునే ప్రయత్నం చేశాడు. 'నోరుమూసుకుని మౌనంగా చూస్తూ ఉండు. లేదంటూ నీ తల్లికి పట్టిన గతే నీకూ పడుతుంది' అంటూ అతడిని ఈడ్చి పడేశారు. నెల రోజుల క్రితమే అనారోగ్యంతో బాధితురాలి భర్త మృతిచెందాడు. ఈ దురాగతానికి ప్రత్యక్షసాక్షిగా నిలిచిన బాధితురాలు కన్యాదేవి కొడుకు చెప్పిన వివరాల ప్రకారం... తమ బంధువు, కన్యాదేవి స్నేహితురాలు ఈ నెల 2న వింతగా ప్రవర్తించారు. దైవాత్మ తమలో ప్రవేశించినట్టు వారు చెప్పారు. శివంగమెత్తుతూ... కన్యాదేవి మంత్రగత్తెగా ఆరోపించారు. ఆమెను బయటకు లాగి కొట్టడం ప్రారంభించారు. ఈ గొడవ విన్న చుట్టుపక్కలవారు 8-10 మంది గుమికూడారు. అందరూ కలిసి ఆమెను చిత్రహింసలు పెట్టారు. అనంతరం ఆమెను గుమ్మంముందు పడేసి వెళ్లిపోయారు. కొడుకు ఆమెను ఇంట్లోకి తీసుకెళ్ళాడు. మరుసటి రోజు.. అంటే ఈ నెల 3వ తేదీన స్థానిక కాంపౌండర్ ఉత్తమ్‌కుమార్ మీర్థాకు బాధితురాలి కొడుకు సమాచారమిచ్చారు. తన తల్లిని రక్షించాల్సిందిగా కోరాడు. 'ఆగస్టు 3 ఉదయం నన్ను పిలిచారు. కన్యాదేవి ఇంటికి నేను చేరుకునే సరికి... తీవ్రగాయాలతో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ వుంది. టీ కాస్తూ.. ఓవెన్ మీద పడిపోయిందని ఆమె భర్త సోదరుడు చెప్పాడు' అని ఉత్తమ్‌కుమార్ అన్నారు. ఆ దెబ్బల నుంచి కోలుకోలేని ఆమె అదే రోజు మృతిచెందింది. తల్లి మృతి చెందిన తర్వాతగానే ఆమె కూతురు మాయా రెగార్‌కు సమాచారం ఇవ్వలేదు. గ్రామ పెద్దలు హడావుడిగా అంత్యక్రియలను పూర్తి చేయించారు. తమ పాపాన్ని కడుక్కోవడానికి పుష్కర్ సరస్సులో మునిగి రావాల్సిందిగా కాప్ పంచాయితీ గ్రామస్తులను ఆదేశించింది. పూనకంతో డ్రామా మొదలుపెట్టిన ఇద్దరు మహిళలకు రూ. 2,500, ఒక ట్రాక్టరు నిండా గోవులు తినే పచ్చ గడ్డి, ఐదు ట్యాంకర్ల నీళ్లు, కొన్ని కూరగాయలు చెల్లించాల్సిందిగా జరిమానా విధించింది కాప్ పంచాయితి. ఈ ఘోర దురాగతానికి పాల్పడిన మరికొందరికి... ఇలాంటివే కొన్ని జరిమానాలు విధించి చేతులు దులుపుకుందని బాధితురాలి కొడుకు వాపోయాడు. ఇప్పుడు తాను అనాథనయ్యాయని రోదించాడు. కన్యాదేవి దూరపు బంధువు మహదేవ్ రెగార్.. ఈ దుర్మార్గ ఘటనపై పోలీసులు ఫిర్యాదుచేసినా.. వారు పట్టించుకోలేదు. 'ఆగస్టు 10న వారి బంధువు ఒకరు మాకు ఫిర్యాదుచేశారు. కానీ, మేము ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. బాధితురాలి సన్నిహిత బంధువులు కాకపోవడంతో మేము చర్య తీసుకోలేదు' అని కెక్రి పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి హరిరామ్ కుమావత్ చెప్పడం గమనార్హం.

కూతురి ఫిర్యాదుతో కదిలిన పోలీసులు

కన్యాదేవి కూతురు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. 13వ తేదీ ఆదివారం నలుగురు వ్యక్తులపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇందులో శివంగమాడిన ఇద్దరు మహిళలతోపాటు... ముగ్గురు వ్యక్తులు మహావీర్, చంద్రప్రకాశ్, మరో వ్యక్తి ఉన్నారు. వీరిపై 302 (హత్య), 201 (సాక్ష్యాలను నాశనం చేయడం) తదితర అభియోగాలను మోపారు. ఇద్దరు మహిళలు సహా ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందులో ప్రధాన నిందితుడు కన్యా మేనల్లుడు మహావీర్, మేనకోడలు పింకీ, పొరుగింటి వ్యక్తి సోనియా ఉన్నారు. గోపి, చంద్రప్రకాశ్‌లను కూడా నిందితులుగా గుర్తించారు. ఆమె మృతదేహానికి ఎలాంటి పోస్టుమార్టం నిర్వహించకుండా వెంటనే అంత్యక్రియలు పూర్తిచేశారు. చిత్రహింసలు పెట్టారని బాధితురాలి కొడుకు చెబుతున్న ఆరోపణలను నిరూపించడం చాలా కష్టం.. అని అజ్మీర్ పోలీసు సూపరింటెండెంట్ రాజేంద్ర సింగ్ చెప్పారు.

రూ 502 కోట్లు దారి మళ్లాయి

- బీజేపీ నేతలపై లాలూ విమర్శ
- సీబీఐ దర్యాప్తు తక్షణ అవసరం

భాగల్పూర్ (బీహార్): పట్టణాభివృద్ధికి కేటాయించిన వందలాది కోట్లలో బీజేపీ నేతల ప్రమేయంతో దాదాపు రూ. 502 కోట్లు దారిమళ్లాయని ఆర్‌జేడీ నేత లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఈ రకమైన అక్రమాలు జరిగి ఉంటాయని అనుమానం వ్యక్తం చేస్తూ మొత్తం కుంభకోణంపై సీబీఐ దర్యాప్తు ఆదేశించాలని ఆయన డిమాండ్ చేశారు. నిజానికి ఈ అంశంపై ఇప్పటికే స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ దర్యాప్తు చేస్తోంది. అయిదుగురిపై కేసులు నమోదు కూడా చేశారు. వారిలో బ్యాంకు ఉద్యోగులతో పాటు ఒక స్వచ్ఛంద సంస్థ కార్యనిర్వాహకులు ఉన్నారు. ముఖ్యమంత్రి నగర్ వికాస్ యోజన కింద మంజూరు చేసిన నిధుల నుంచి పెద్ద మొత్తం శ్రీజన మహిళా వికాస్ సహయోగ్ సమితికి మళ్లించినట్టు ఆరోపణలు రావడంతో దర్యాప్తు జరుగుతోంది. ఈ నేపథ్యంలో బ్యాంకులలో జమ అయి ఉన్న ప్రభుత్వ నిధులకు సంబంధించిన పూర్తి సమాచారం అందించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు కూడా జారీచేసింది. ఇప్పటివరకూ జరిగిన దర్యాప్తులో ముఖ్యమంత్రి నగర్ వికాస్ యోజన కింద భూ సేకరణకు గాను విడుదల చేసిన నిధులను జాతీయ బ్యాంకులలో జమచేస్తూ వచ్చారు. వాటిలో ఎక్కువ భాగం శ్రీజన్ మహిళా వికాస్ సహయోగ్ సమితి సంస్థ ఖాతాల్లోకి మళ్లించినట్టు ఎస్ఐటీ నిర్ధారణ కావడంతో ఎఫ్ఐఆర్ నమోదు అయింది. భాగల్పూర్ జిల్లాలో కేంద్ర కార్యాలయం ఉన్న ఈ సంస్థ నిర్వాహకురాలు మనోరమా దేవి మహిళలకు శిక్షణ ఇచ్చే పేరుతో నిధులు దక్కించుకున్నారని, ఇప్పటికే ఆమె ఆధ్వర్యంలో సహకార బ్యాంకు ఒకటి నడుస్తోందనీ, ఇది చాలకు బ్యాంక్ ఏర్పాటుకు అనుమతి కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఆమె అర్జీ పెట్టుకున్నారని పోలీసులు గుర్తించారు. ఈ అంశం ప్రస్తావిస్తూ మనోరమాదేవి (ఈమె గత ఏప్రిల్‌లో మరణించారు) తో బీజేపీ నేతలు షా నవాజ్ హుస్సేన్, గిరిరాజ్ సింగ్‌లకు సన్నిహిత సంబంధాలున్నాయని లాలూ ఆరోపించారు. అయితే ఆయన తన ఆరోపణలకు ఎలాటి ఆధారాలను పత్రికలవారికి చూపించలేదు. నిధులు దారి మళ్లాయన్న విషయంలో ఎవరికీ అనుమానం లేదు. ఇందులో బ్యాంకులకు భాగస్వామ్యం ఉండవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే దర్యాప్తులో పూర్తి వివరాలు బయట పడకపోవచ్చునని లాలూ అంటూ సీబీఐ దర్యాప్తు చేయించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ అంశంపై బీజేపీ నేత షా నవాజ్ మాట్లాడుతూ మనోరమాదేవితో పరిచయం ఉన్న మాట వాస్తవమేనని, అయితే ఈ అక్రమ కార్యకలాపంతో తనకేమీ తెలియదని వివరణ ఇచ్చారు.

అసోం, బీహార్ రాష్ట్రాల్లో వరదల బీభత్సం

న్యూఢిల్లీ: అసోం, బీహార్ రాష్ట్రాలను వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. అస్సాంలోని 33 జిల్లాల్లో 21 జిల్లాలపై వరద ప్రభావం కొనసాగుతోంది. వరదల్లో కొట్టుకునిపోయి 10మంది ప్రాణాలు కోల్పోయారు. బ్రహ్మపుత్ర నది అనేకచోట్ల ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తుండటంతో సహాయచర్యల్లో పాల్గొనేందుకు సైన్యం రంగంలోకి దిగింది. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆదివారం అస్సాం ముఖ్యమంత్రి శర్వానంద సోనోవాల్‌తో ఫోన్‌లో మాట్లాడి తాజా పరిస్థితిని తెలుసుకున్నారు. కేంద్రం నుంచి అవసరమైన సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. వరదల కారణంగా దూరప్రాంత రైళ్లన్నింటినీ రద్దు చేశారు. వరదల ప్రభావంతో రాష్ట్రంలోని 20 లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కుందిల్ నది పొంగిపొర్లడంతో పంచ్‌మైల్, లక్ష్మీగావ్, బోగోరిబరీ ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు.

బీహార్‌లోనూ వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో 12 జిల్లాలు అతలాకుతలం అవుతున్నాయి. దాదాపు 22 లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరదల్లో చిక్కుకుని 10 మంది మృతి చెందినట్టు అధికారులు ధ్రువీకరించారు. లోతట్టు ప్రాంతాల్లోని వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కిషన్‌గంజ్, కతిహార్, జోగ్‌బానీ పరిధిలోని రైల్వే ట్రాక్‌లు ధ్వంసమయ్యాయి. ఫలితంగా 18 రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే అధికారులు తెలిపారు. రహదారులపై భారీగా వరద నీరు వచ్చి చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



బీహార్‌లోని అరారియా జిల్లాలోని ఓ గ్రామం వరద నీట మునిగింది. ఆ గ్రామ రైతు తాను పండించిన పంటను అరిటాకుల తెప్ప మీద తరలించుకు వెళుతున్న దృశ్యం

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంగళవారం 15-8-2017
సంపుటి : 3 సంచిక : 228 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 14 + 48 పేజీలు వెల : 5.00

నీటి గోస

కృష్ణా బేసిన్‌లో ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి కిందకి నీరు విడుదల చేసే విషయంలో ఇంకా సందిగ్ధం కొనసాగుతున్నది. తెలుగు రాష్ట్రాలకు తాగు, సాగునీరందించే ప్రధాన ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్ తీవ్ర నీటి కొరత ఎదుర్కొంటున్న తరుణంలో కనీసం తాగునీటి కోసం 15 టీఎంసీల నీటిని వెంటనే విడుదల చేయాల్సిందిగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు కర్నాటక జలవనరుల శాఖ మంత్రి పాటిల్‌కు లేఖ రాసి ఐదు రోజులు గడచినా ఇప్పటి వరకూ కర్నాటక ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. తాగునీటికి కూడా నీరు సరఫరా చేయలేని పరిస్థితికి శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు చేరుకున్న పరిస్థితుల్లో కూడా మానవతా దృక్పథంతో నీటిని విడుదల చేయాల్సిన కర్నాటక కిమ్మనకుండా ఉండడం చర్చనీయాంశమైంది. ఈ పరిస్థితుల్లో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, చంద్రబాబు కర్నాటకపై రాజకీయ ఒత్తిడి తీసుకువస్తే ప్రయోజనముంటుందని ఇంజనీర్లు అభిప్రాయ పడుతున్నారు.


కర్నాటక సీఎం సిద్దరామయ్య
సీఎం కేసీఆర్

ఆల్మట్టి, నారాయణపూర్ నీటి విడుదలపై వీడని సందిగ్ధం

హరీశ్‌రావు లేఖపై స్పందించని కర్నాటక సీఎం

- రాజకీయ ఒత్తిడితోటే సాధించాలంటున్న ఇంజనీర్లు
- కేసీఆర్, చంద్రబాబు ఫోన్ చేయరా?

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కర్నాటక నీటి విడుదల విషయంలో ఇప్పటికే కేంద్ర జలవనరుల శాఖను సంప్రదించాల్సి ఉండగా ఇద్దరు ముఖ్యమంత్రులు ఆ దిశగా ప్రయత్నం చేయక పోవడం విశేషం. నీటి విడుదల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటి వరకూ స్వయంగా రంగంలోకి దిగక పోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కేసీఆర్ కర్నాటక సీఎంకు ఫోన్ చేసినా లేఖ రాసినా ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయడం వెల్లడవుతున్నది. 2015 లో కూడా నీటి విడుదల విషయంలో కర్నాటక ఇదే వైఖరి అవలంబించడంతో రాష్ట్ర కాంగ్రెస్ నేతలు బెంగళూరు వెళ్ళి నీటిని విడుదల చేయాల్సిందిగా అక్కడి ముఖ్యమంత్రిని కోరారు. ఈ చర్చలతో పాటూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నంతో అప్పట్లో కర్నాటక నీరు విడుదల చేసింది. అయితే రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఈ సంవత్సరం అటువంటి ప్రయత్నాలేవీ చేయడం లేదు. పట్టిసీమ నీటిని కృష్ణా బ్యారేజీకి భారీగా తరలిస్తున్న చంద్రబాబు కర్నాటక నీటి విడుదల విషయంపై దృష్టి కేంద్రీకరించడం లేదు. రాష్ట్ర రాజధానితో పాటూ ఫ్లోరైడ్ పీడిత నల్లగొండ జిల్లాకు తాగునీరందించాలంటే తెలంగాణ ప్రభుత్వమే ఎక్కువ శ్రద్ధ వహించాల్సి ఉంది. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కర్నాటక సీఎంతో కనీసం ఫోన్‌లో మాట్లాడినా ఫలితం ఉంటుందని అధికార వర్గాలు అంటున్నాయి.

అక్కడ్ ఫుల్..ఇక్కడ నిల్


కర్నాటక లోని ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయా ల్లోకి ఇప్పటికే పలుమార్లు పూర్తిస్థాయిలో నీరు వచ్చి చేరింది. బేసిన్‌లోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో ఈ ప్రాజెక్టులు నిండుకుండల్లా ఉన్నాయి. అయితే ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు విడుదల చేసుకుంటున్న కర్నాటక జూరాలకు మాత్రం నీరు విడుదల చేయడం లేదు. గత నెలలో కేవలం రెండ్రోజుల పాటూ రెండు టీఎంసీల నీటిని విడుదల చేసిన తర్వాత గేట్లు మూసేశారు. జూరాలకు వచ్చిన కొద్దిపాటి నీటిని తాగునీటికి. సాగుకు వినియోగించుకుంటున్నారు. కింద ఉన్న శ్రీశైలం నాగార్జునసాగర్ ప్రాజెక్టుల

...9లో

నవభారతం నిర్మిద్దాం

పంద్రాగస్టు సందర్భంగా ప్రెసిడెంట్ కోవింద్

న్యూఢిల్లీ: నవభారత నిర్మాణం కోసం సమిష్టిగా కృషి చేద్దామని భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పిలుపునిచ్చారు. 70వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత తొలిసారి ఆయన దేశప్రజలను ఉద్దేశించి సోమవారం ప్రసంగించారు. ఆంగ్లేయుల దాస్యశృంఖలాల నుంచి 1947, ఆగస్టు15న భారతదేశం విముక్తి పొందిందన్నారు. కిట్టూరు రాణి చెన్నమ్మ, ఝాన్సీ లక్ష్మీబాయి, మాతంగిని హాజ్రా వంటి మహిళామణులు దేశ స్వాతంత్ర్యం కోసం వీరోచితంగా పోరాడారని అన్నారు. స్వాతంత్ర్య సముపార్జన కోసం మహాత్మా గాంధీ, పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, సర్దార్ వల్లభా య్‌పటేల్, భగత్‌సింగ్, సుభాష్ చంద్ర బోస్, చంద్రశేఖర్ ఆజాద్, రామ్‌ప్రసాద్ బిస్మిల్, అష్ఫఖుల్లా ఖాన్ వంటి నేతలు చేసి కృషిని మరవొద్దని కోరారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన వారికి మన మంతా రుణపడి ఉన్నామని, వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. నవభారత నిర్మాణంలో పేదరికానికి తావుండరాదని పేర్కొన్నారు. వికలాంగులైన మన సోదర సోదరీమణులను మనం ప్రత్యేక ఆదరణతో చూడాలని సూచించారు. కులమతాలకు అతీతంగా దేశ ప్రజలంతా సమైక్యంగా మెలగాలని కోరారు. అనంతరం ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ భారత్, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ), పెద్ద నోట్ల రద్దు నిర్ణయం తదితర అంశాల గురించి తన ప్రసంగంలో ప్రస్తావించారు. దేశ సరిహద్దుల్లో ఉండి శత్రుమూకలు, మిలిటెంట్ల దాడులను తిప్పి గొడుతూ పహారా కాస్తున్న భద్రతా సిబ్బంది సేవలను రాష్ట్రపతి ఈ సందర్భంగా ప్రశంసించారు.



ఇదేమీ మొదటి సారి కాదు

చిన్నారుల మృతి ఘటనపై

- బీజేపీ చీఫ్ అమిత్‌షా వివాదాస్పద వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలో గోరఖ్‌పూర్‌లోని బాబా రాఘవ్ దాస్ (బీఆర్‌డీ) వైద్య కళాశాలలోని ఆస్పత్రి ఘటనలో 73మంది చిన్నారుల ప్రాణాలు గాల్లో కలిసిపోవడంతో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. అభం శుభం తెలి యని చిన్నారుల మృతితో హృదయం బరువెక్కి బాధపడుతున్న కుటుంబాలను పరామర్శించి ఓదార్చాల్సిన అధికార పార్టీ ముఖ్యనేతనే మానవత్వాన్ని మరిచిపోయి ప్రవర్తిం చారు. మృతుల కుటుంబాలకు భరో సా కల్పించాల్సింది పోయి భారత్‌లో ఇదేం మొదటి ఘటన కాదంటూ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమ య్యాయి. ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శలను ఎదుర్కొనేందుకు బీజేపీ చీఫ్ అమితా షా చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపాయి. 'ఇలాంటి ఘటనలు మనదేశంలో గతంలోనూ జరిగాయి. ఇదేం మొదటి ఘటన కాదు. ప్రతిపక్ష హోదాలో ఉన్న కాంగ్రెస్ ఈ ఘటనను భూతద్దంలో చూపేందుకు ప్రయత్ని స్తోంది. భారత్ లాంటి పెద్ద దేశంలో అక్కడక్కడ ఇలాంటి ఘటనలు గతంలోనూ జరిగాయి. యూపీ ప్రజలు యథాతథంగా క్రిష్ణాష్టమి వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ ఘటన జరిగిందని వేడుకల నుంచి దూరంగా ఉండాలని ఆ రాష్ట్ర ప్రజలను

...9లో



కోహ్లిసేన కొత్త చరిత్ర
3-0 విజయం

- శ్రీలంకలో టీమ్ ఇండియా తొట్టతొలి క్లీన్‌స్వీప్ సిరీస్
- పల్లెకల్‌లో ఇన్నింగ్స్ 171 పరుగులతో కోహ్లీసేన గెలుపు 12లో

పరిహారం చెల్లించేదాకా అడ్డుకుంటాం

- సుందిళ్ల బ్యారేజీ పనుల వద్ద నిర్వాసితుల ఆందోళన
- గోలివాడ మాదిరిగానే పెంచివ్వాలని డిమాండ్
- ప్రయివేటు సిబ్బందితో గ్రామస్తులకు బెదిరింపులు
- నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు 9లో



నిర్బంధం

కేంద్ర డీఎల్‌సీ, సింగరేణి అధికారుల ఘెరావ్

- 7 గంటలు గదిలో బంధించి కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన
- కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్
- ఎటూ తేల్చని సింగరేణి యాజమాన్యం
- 31లోపు అమలు చేయిస్తాం 9లో
- రాతపూర్వక హామీ ఇచ్చిన డీఎల్‌సీ, కేంద్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మెన్


సమావేశాన్ని అడ్డుకున్న కార్మికులు

నా ఒక్కడివల్లే ఈ దేశం మారిపోతుందా..? అనుకునే ఏ ఒక్కరివల్లా ఈ దేశానికి ఉపయోగం లేదు. – 'కాస్ట్రో'


గోరఖ్‌పూర్ ఘోరం

సంపాదకీయం

స్వతంత్ర భారతానికి నేటితో డెబ్భైయేండ్లు నిండాయి. డెబ్భై ఒకటవ స్వాతంత్ర్యదినోత్సవ సంబురాల్లో యావత్ దేశం మునిగిపోయింది. నవ దేశం దగ్గరలోనే ఉందని ఏలికలు సుద్దుల సందేశాలు ఇస్తున్నారు. సరిగ్గా ఇదే సమయంలో ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో బాబా రాఘవ్ దాస్ ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిలో ప్రాణవాయువు అందక 72మంది చిన్నారుల ప్రాణాలు విడిచిన విషాదం స్వతంత్ర భారతం ఎంత దయనీయ స్థితిలో ఉందో అద్దం పడుతోంది. కూడు, గుడ్డ, విద్య, వైద్యం ప్రజల ప్రాథమిక హక్కుగా ఉండాలంటూ రాజ్యాంగ సృష్టి కర్తలు శ్రేయోరాజ్యాన్ని ప్రతిపాదించగా ఇన్నేండ్లయినా అది సాకారం కాలేదని గోరఖ్‌పూర్ మృత్యు ఘోష మరోసారి స్పష్టం చేస్తోంది. పసికందుల మరణాలు హృదయం ఉన్న ప్రతి ఒక్కరినీ కలచివేస్తుండగా, కేంద్రంలో, యూపీలో జమిలిగా అధికారం వెలగబెడుతున్న బీజేపీ ప్రభుత్వాలు ఘటనపై ఒకరికి మించి మరొకరు చేస్తున్న విన్యాసాలు సిగ్గుమాలినవీ క్షమించరానివీ. ప్రభుత్వాల తప్పేమీ లేదని సమర్థించుకునేందుకు పడుతున్న పాట్లు అత్యంత దుర్మార్గమైనవి.

గోరఖ్‌పూర్ దారుణానికి ప్రధాన కారణం ఆ రాష్ట్ర ప్రభుత్వమే. దర్యాప్తు చేయాల్సింది సర్కారుపైనే. యోగి ప్రభుత్వం అధికారంలో ఉంటే నిష్పక్షపాత విచారణ దుర్లభం. నిష్పాక్షికతపై నిత్యం ప్రవచించే ప్రధాని మోడీ, యోగితో రాజీనామా చేయించి సమగ్ర విచారణకు ఆదేశిస్తే వాస్తవాలు వెలుగు చూస్తాయి. ప్రజలు విశ్వసిస్తారు.

కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించని కారణంగా ఆక్సిజన్ సరఫరా నిలిపివేయడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పిల్లలు, శిశువులు ఊపిరాడక పిట్టల్లా రాలిపోయారని లోకం కోడై కూస్తుండగా, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాత్రం ఆక్సిజన్ కొరత లేదని కొట్టి పారేసి నేరం నుంచి తప్పించుకునేందుకు వెంపర్లాడారు. యూపీలో ఎప్పటి నుంచో మెదడువాపు వ్యాధి ఉందంటూ గత సమాజ్‌వాదీ సర్కారును ముగ్గులోకి లాగి రాజకీయం చేయడం హేయమైన చర్య. సీఎం యోగిని మించిపోయారు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సిద్దార్థసింగ్. రోజుకు పది మంది చొప్పున ఆస్పత్రిలో చనిపోవడం సాధారణమంటూ సర్కారు కాఠిన్యాన్ని జంకు గొంకు లేకుండా బయట పెట్టారు. ఆస్పత్రిని సందర్శించిన కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి నడ్డా అయితే భౌగోళికంగా యూపీని వైరస్‌లు సోకుతాయంటూ పిల్లల వ్యాధులపై పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తామని కంటితుడుపు ప్రకటన చేశారు. శుక్రవారం పిల్లల మరణాలపై మీడియా గగ్గోలు పెట్టగా తదుపరి రెండు మూడు రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, బీజేపీ పెద్దల్లో ఎలాంటి పశ్చాత్తాపం లేకపోగా స్వీయ సమర్థనలకు పెద్ద పీట వేయడం దారుణాతిదారుణం.



ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం గోరఖ్‌పూర్. పిల్లల మరణాలు వెలుగులోకొచ్చిన నాటికి రెండు రోజుల ముందు యోగి సదరు ఆస్పత్రిని, పిల్లల వార్డును తనిఖీ చేశారు. ఆయన సందర్శించే నాటికే ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయి కొన్ని మరణాలు సంభవించాయి. సీఎం దృష్టికి ఈ విషయం ఎందుకు రాలేదు? ఒకవేళ వచ్చినా పట్టించుకోలేదా? విచారణ దీనిపై జరగాలి. సకాలంలో ఆక్సిజన్ బకాయిలు చెల్లించనందుకు ప్రిన్సిపాల్‌ను, విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై పిల్లలవార్డు డాక్టర్‌ను సస్పెండ్ చేసింది సర్కారు. రూ.70 లక్షల బకాయిలంటే కొన్ని నెలలుగా చెల్లించట్లేదనేగా? నిధులు ఇవ్వాల్సింది యూపీ సర్కారే అయినప్పుడు మొదటి ముద్దాయి ఆ ప్రభుత్వ అధినేత యోగినే అవుతారు. అసలు విషయాన్ని వదిలేసి రెండు రోజులు ఆలస్యంగా బిల్లులు చెల్లించారంటూ ప్రిన్సిపాల్‌పై నేరం మోపడం మసిపూసి మారేడుకాయ చేసేందుకేగా? పైగా స్వంత డబ్బుతో ఆక్సిజన్ కొనుగోలు చేసి పిల్లలను రక్షించే ప్రయత్నం చేసిన వార్డు డాక్టర్‌ను కూడా ఇందుకు బలిచేయటం మరీ దుర్మార్గం.

కేంద్ర హోంశాఖ ప్రకటన మరీ విడ్డూరం. 21మందే చనిపోయారని మరణాల సంఖ్య తగ్గించింది. ఆక్సిజన్ కొరత వల్లనేనని ముక్తాయించింది.

ప్రతి చిన్నదానికీ అలవోకగా చాయ్ పె బాత్, మన్‌కే బాత్‌లు నిర్వహిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ గోరఖ్‌పూర్ దురంతంపై ఎందుకు మౌనం దాల్చినట్టు? చలోక్తులతో ప్రత్యర్థి రాజకీయ పార్టీలపై విరుచుపడే మోడీ కంఠం ఎందుకు పెగలట్లేదు? సంఘ్ మానస పుత్రుడు, తన ప్రియ శిష్యుడు, యూపీలో హిందూరాజ్య స్థాపనకు కంకణం కట్టుకున్నందునే యోగి దుర్మార్గమైన నిర్లక్ష్యానికి ఒడిగట్టినా ప్రధాని క్షమ కనబరిచారనుకోవాలి. గోరఖ్‌పూర్ ఘటన చాలా చిన్నది. అయినా ఇదేమీ మొదటి సారికాదనీ బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా, యోగి సర్కారుకు బాసటగా నిలిచారు తప్ప ఆక్సిజన్ అందకనే పిల్లలు చనిపోయారని సాక్షాత్తు యూపీకి చెందిన బీజేపీ ఎంపీ సాక్షిమహరాజ్ ప్రకటనను కావాలనే దాటవేశారు. నోరులేని ఆవుల రక్షణకు ప్రత్యేక దళాలను నెలకొల్పి నడిపిస్తున్న యోగికి ఆవులకంటే పసికందుల ప్రాణాలు తృణప్రాయం అయ్యాయి. ముమ్మాటికీ గోరఖ్‌పూర్ దారుణానికి ప్రధాన కారణం ఆ రాష్ట్ర ప్రభుత్వమే. దర్యాప్తు చేయాల్సింది సర్కారుపైనే. యోగి ప్రభుత్వం అధికారంలో ఉంటే నిష్పక్షపాత విచారణ దుర్లభం. నిష్పాక్షికతపై నిత్యం ప్రవచించే ప్రధాని మోడీ, యోగితో రాజీనామా చేయించి సమగ్ర విచారణకు ఆదేశిస్తే వాస్తవాలు వెలుగు చూస్తాయి. ప్రజలు విశ్వసిస్తారు.

చేజారుతున్న స్వతంత్ర ఫలాలు



ప్రకాష్ కరత్

భారతదేశం 70వ స్వాతంత్ర్య వార్షికోత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో, స్వతంత్ర గణతంత్ర రాజ్యానికి చెందిన ప్రతి మూలస్తంభం భయానక స్థితిలో వున్నది.

I

1997లో దేశం 50వ స్వతంత్ర వార్షికోత్సవాన్ని జరుపుకున్నపుడు పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలోని ఒక ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ ఉనికి అందరినీ ఆకర్షించిన విజయాలలో ఒకటి. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్ని లోపాలున్నప్పటికీ రాజకీయాలలో ప్రజలకు ఎంతోకొంత భాగస్వామ్యం యివ్వగలిగింది. యిది భారత స్వాతంత్ర్య పోరాటం యొక్క ప్రజాస్వామిక లక్ష్యాలలో ఒకటి.

కానీ, 20ఏండ్ల అనంతరం, దురదృష్టం ఏమిటంటే ఇప్పుడు ఆ స్థితి లేదు. అంటే ఎన్నికలు క్రమం తప్పకుండా నిర్వహించబడుతున్నాయి. ఎన్నికల రంగంలో ప్రజల భాగస్వామ్యం ఏ విధంగానూ తగ్గలేదు. కానీ, రూపం మారకుండా ప్రజాస్వామిక సారం క్రమంగా హరించుకుపోతున్నది.

ఒక గణతంత్ర రాజ్యాంగం క్రింద వున్నటువంటి ప్రజాస్వామిక సామర్థ్యం, ఒక ప్రజాస్వామిక సామాజిక రూపాంతరం లేకుండా అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ విధానం యొక్క వర్గ వాస్తవాలలో మునిగిపోవడం ప్రారంభించింది. భూస్వామ్య విధానంతో రాజీ, భూసంస్కరణల అమలులో వైఫల్యాలు దీనికి స్పష్టమైన ఉదాహరణలుగా చెప్పవచ్చు. యిది ఒక సామాజిక, న్యాయబద్ధమైన ఆర్థిక క్రమాన్ని సృష్టించే అవకాశాన్ని కుంటుపరచింది. స్వాతంత్ర్యం సాధించిన తొలి దశాబ్దాలలో సామాజిక, ఆర్థిక అసమానతల విధానం ఉన్నది. రాజ్యాంగంలో సంక్షిప్తంగా వ్యక్తీకరించబడిన, స్వాతంత్ర్య పోరాటంలో ప్రారంభమైన సామాజిక, ఆర్థిక దార్శనికతను గుత్త పెట్టుబడిదారీ విధాన పెరుగుదల వక్రీకరించింది.

ఈ పోరాటాలు, ఉద్యమాలు వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ప్రత్యామ్నాయ కార్యక్రమాలుగా వుండాలి. బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్‌ల కృషి ఫలితంగా ఏర్పడిన నయా ఉదారవాద - హిందూత్వ శక్తుల మైత్రిని, యిప్పటి వరకు స్వాతంత్ర్య భారతదేశాన్ని ఒక ఎరగా భావించిన బూర్జువా, భూస్వామ్య వర్గాలను సవాల్ చేసే వామపక్ష, ప్రజాస్వామిక ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించడమే సరియైన మార్గం.

ఈ కారణాలన్నీ ప్రజాస్వామ్యాన్ని, పౌరుల ప్రజాస్వామిక హక్కులను బలహీనపరిచాయి. కానీ గడచిన రెండు దశాబ్దాలలో, నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానాల అమలుతో ప్రజాస్వామ్యం శిథిలమవుతూ వస్తోంది. పెట్టుబడిదారీ విధానంలోని నయా ఉదారవాద దశ సంపద కేంద్రీకరణను తీవ్రతరం చేసి, దానిని ఒక భయానక స్థితికి తెచ్చింది. 2016కి చెందిన 'క్రెడిట్ సూయిస్సీ' వెల్త్ రిపోర్టు ప్రకారం భారతదేశ జనాభాలోని ఉన్నత వర్గానికి చెందిన ఒకశాతం ప్రజలు 58.4శాతం సంపదకు యజమానులుగా వున్నారు. అదే విధంగా జనాభాలోని ఉన్నత వర్గానికి చెందిన 10శాతం ప్రజలు, 80.7శాతం సంపదకు యజమానులుగా వున్నారు.

నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానం రాజకీయాలపై చేసిన దాడితో రాజకీయ వ్యవస్థ రూపురేఖలే మారిపోయాయి. రాజకీయ, వ్యాపార సంబంధాలు పెద్ద మొత్తం డబ్బుతో వ్యాప్తి చేయబడుతున్న ఎన్నికల రాజకీయాలకు మద్దతు పలుకుతున్నాయి. చాలా ఎక్కువమంది వ్యాపారస్తులూ పెట్టుబడిదారులూ చట్టసభల ప్రతినిధులుగా ఎన్నుకోబడుతున్నారు. మంత్రులుగా నియమించబడుతున్నారు. పెనవేసుకుంటున్న రాజకీయాలు, వ్యాపారం ప్రజాస్వామిక సంస్థలను హరించివేస్తున్నాయి. బూర్జువా పార్టీలన్నీ డబ్బుతో తప్పుడు పనులు చేస్తూ నయా ఉదారవాద విధానాల కౌగిలిలో మునిగితేలుతున్నాయి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రాథమికంగా ఆర్థిక విధానాలలో ఏ విధమైన మార్పు ఉండడం లేదు.



యిదంతా పార్లమెంటరీ సంస్థలను హరించే మార్గాలను సుగమం చేస్తుంది. ఎన్నికల విధానంపై డబ్బుకు వున్న పట్టువల్ల ప్రత్యామ్నాయ కార్యక్రమం లేదా విధానం వున్న ఏ పార్టీ కూడా అధికారంలోకి రాలేని స్థితికి, ఎవ్వరినీ ప్రభావితం చేయలేని స్థితికి దారి తీస్తోంది. కేంద్రంలోని పాలక పార్టీగా బీజేపీ చేత ఒక అవకాశంగా ఉపయోగించబడుతున్న ఈ ఎన్నికల విధానం ఒక అక్రమమైన మార్గం. సిగ్గులేనితనంతో చట్ట సభలలోని ప్రతినిధులను కొనుగోలు చేస్తూ, వారిని తప్పులు చేయడానికి ప్రేరేపిస్తున్నారు. వ్యతిరేకులను బెదిరించటానికి కేంద్ర పరిశోధక ఏజెన్సీలను ఉపయోగిస్తున్నారు.

ఎన్నికల బాండ్ల విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా, రాజకీయ వ్యవస్థపై పెద్ద కార్పొరేట్ వ్యవస్థ పట్టు పెంచడానికి అవసరమైన మార్గాలను మోడీ ప్రభుత్వం సులభతరం చేసింది. ఎవరిచ్చినారన్న ప్రశ్న వేయకుండానే, అపరిమితమైన డబ్బు ఒక రాజకీయ పార్టీకి కార్పొరేట్ శక్తులు యివ్వవచ్చు. ఎన్నికలలో డబ్బును వినియోగించే విధానానికి కళ్ళెం వేయడానికి రూపొందించబడిన ఎన్నికల సంస్కరణలపై పోరాటం చాలా ఆవశ్యకమైనది. ఎన్నికల విధానంలో దామాషా పద్ధతిలో ప్రాతినిధ్యం వుండాలన్న విధానం ప్రవేశపెట్టడం అనేది ప్రాథమిక సంస్కరణలలో ఒకటి.

రాజ్యాంగం పరిధిలోని రాజ్యానికి చెందిన కొన్ని సంస్థలు ఒక క్రమ పద్ధతిలో నాశనం చేయబడుతున్నాయి. యిక్కడ డాక్టర్ అంబేద్కర్ చేసిన ఒక హెచ్చరిక మనం గుర్తు చేసుకోవాలి. "రాజ్యాంగం మంచిదైనప్పటికీ, దానిని అమలుపరచే వారు మంచివారు కాకుంటే, అది (రాజ్యాంగం) కూడా చెడ్డదైనదిగా రుజువవుతుంది".

II

దేశ స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం ఒక వింతైన తీవ్ర జాతీయతా భావం చేత నాశనం చేయబడుతున్నాయి. యిది మన భారతదేశంలో పుట్టి, పెరిగిన వారందరూ భారతీయులే అని చెప్పే జాతీయతావాదం కాదు. యిది హిందూ జాతీయతా భావం. అలాంటి జాతీయతా భావం మతోన్మాదం తప్ప మరొకటి కాదు. ఆర్‌ఎస్‌ఎస్–బీజేపీల జాతీయతావాదం ముస్లింలను, క్రిస్టియన్లను, హిందూత్వ భావజాలాన్ని అంగీకరించని వారిని వెలివేస్తుంది. యిది జాతి ఐక్యతను బలహీనపరచి, ఆధునిక లౌకిక రాజ్యం ప్రతీకార దాడులకు గురయ్యేట్టు చేస్తుంది.

హిందూ జాతీయతావాదం ఏ విధంగానూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా లేదు. అందువలన ఆర్‌ఎస్‌ఎస్ స్వతంత్ర పోరాటంలో పాల్గొనలేదు. అందుకనే హిందూత్వశక్తుల నాయకత్వంలోని మోడీ ప్రభుత్వం తన "సహజ మిత్రునిగా భావిస్తున్న అమెరికన్ సామ్రాజ్యవాదంతో సఖ్యత ఏర్పరచుకుంటున్నది. చాలా కొద్ది వ్యవధిలోనే యూపీఏ ప్రభుత్వ పాలనా కాలంలో అమెరికాతో ఏర్పడిన వ్యూహాత్మక సఖ్యతను మోడీ ప్రభుత్వం మరింత పటిష్టపరచింది. నేడు అమెరికా భారతదేశాన్ని ఒక "ప్రధానమైన సంరక్షణ భాగస్వామి"గా పరిగణిస్తోంది. అమెరికా యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలు ఇంధనాన్ని నింపుకోవడానికి, సేవలు చేయించుకోవడానికి, వాటి నిర్వహణకు భారతదేశ ఓడరేవులను, సైనిక విమాన కేంద్రాలను ఉపయోగించుకోవడానికి అనుమతించే ఒక ఒప్పందంపై సంతకం చేయడానికి బీజేపీ ప్రభుత్వానికి ఏ విధమైన సంకోచం లేకుండా పోయింది. భారతమాత సార్వభౌమత్వాన్ని తాకట్టుపెట్టామన్న పశ్చాత్తాపం కూడా ఎన్డీయే ప్రభుత్వానికి లేదు.

ఒక పథకం ప్రకారం జాతీయం చేసిన బ్యాంకింగ్ రంగాన్ని, రైల్వేలను, యితర ముఖ్యమైన ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరించి దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని ఈ ప్రభుత్వం నాశనం చేస్తున్నది. రక్షణరంగ ఉత్పత్తులలో జరిగినంత ప్రయివేటీకరణ మరే రంగంలోనూ జరగలేదు. 100శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ), 100శాతం ప్రయివేట్ భాగస్వామ్యం రక్షణ రంగ ఉత్పత్తులలో ఉండడానికి మోడీ ప్రభుత్వం అంగీకరించింది. దీనితో భారతదేశ కార్పొరేట్ వ్యాపారులకు, విదేశీ ఆయుధ ఉత్పత్తిదారులకు మధ్య భాగస్వామ్యం ఏర్పడింది. అమెరికాలోని పెద్ద ఆయుధ కంపెనీ లాక్‌హీడ్ మార్టిన్ మన దేశానికి చెందిన టాటా సన్స్ కంపెనీతో యుద్ధ విమానాలు ఉత్పత్తి చేయడానికి ఉద్దేశింపబడిన ఒప్పందంపై సంతకం చేసింది. అదే విధంగా కళ్యాణి గ్రూప్ కంపెనీ ఇజ్రాయిల్‌కు చెందిన ఆయుధ కంపెనీ (రాఫెల్) తో మిస్సైల్స్ తయారీకి ఒక ఫ్యాక్టరీ ప్రారంభించింది.

భారతదేశ ప్రభుత్వరంగ రక్షణ కంపెనీలను, ఆర్డినెన్స్ పరిశ్రమలను కూల్చి, ఆ రంగాలను విదేశీ, భారతదేశ కార్పొరేట్ల చేత ఏర్పాటు చేయబడిన కంపెనీలకు స్వాధీనం చేయటం అంటే సార్వభౌమత్వంలోని ముఖ్యమైన భాగాన్ని లాక్కోవడమే.

III

శాస్త్రీయ పద్ధతిలో ఒక ఆధునిక, లౌకిక సమాజాన్ని ఏర్పాటు చేస్తామన్న మాటను మన స్వాతంత్ర్యం యిచ్చింది. కానీ ఈ ఆలోచనను ముందుకు తీసుకెళ్ళడంలో మన బూర్జువా–భూస్వామ్య వర్గాలు విఫలం చెందాయి. ప్రస్తుతం ఏడు దశాబ్దాల అనంతరం, అన్ని రంగాలపై పెట్టుకున్న ఆశలన్నీ తలక్రిందులవుతున్నాయన్న సమస్యను మనం ఎదుర్కొంటున్నాం. మత విద్వేషం పునాదిగాగల సమాజాన్ని నిర్మించటానికి అశాస్త్రీయమైన, అహేతుకమైన, ప్రగతి వ్యతిరేక చర్యలకు పాల్పడటం జరుగుతున్నది. విద్యా, సాంస్కృతిక సంస్థలు ముట్టడికి గురవుతున్నాయి. హిందూత్వ భావాలను, అధికారిక భావజాలంగా మార్చడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది.

నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానానికి, హిందూత్వ మతతత్వానికి మధ్య ఏర్పడిన అనుబంధం దేశ సార్వభౌమాధికారానికి, లౌకికతత్వానికి, ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా మారింది. స్వాతంత్ర్య భారత పునాది పరిరక్షింపబడాలంటే నయా ఉదారవాదం, హిందూత్వశక్తుల కలయికతో కొనసాగుతున్న నిరంకుశ పాలనను వెనక్కి తిప్పికొట్టవలసి వుంటుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ, బడా పెట్టుబడిదారుల దన్నుతో అక్రమ మార్గంలో నడుస్తున్న ఎన్నికల విధానం మారాలంటే ప్రజాస్వామ్యం కొరకు జరిగే పోరాటం పార్లమెంటరీ వేదికలకు మాత్రమే పరిమితం చేయకూడదు. కార్మికవర్గ ప్రజలపై దుష్ప్రభావం చూపిస్తున్న నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా బహుముఖ పోరాటాలు చేయాలి. దేశ సార్వభౌమత్వ రక్షణ కోసం, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించాలి. ఫాసిస్ట్ మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా ఐక్య ప్రజా ఉద్యమాలను నిర్మించాలి.

ఈ పోరాటాలు, ఉద్యమాలు వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ప్రత్యామ్నాయ కార్యక్రమాలుగా వుండాలి. బీజేపీ–ఆర్‌ఎస్‌ఎస్‌ల కృషి ఫలితంగా ఏర్పడిన నయా ఉదారవాద – హిందూత్వ శక్తుల మైత్రిని, యిప్పటి వరకు స్వాతంత్ర్య భారతదేశాన్ని ఒక ఎరగా భావించిన బూర్జువా, భూస్వామ్య వర్గాలను సవాల్ చేసే వామపక్ష, ప్రజాస్వామిక ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించడమే సరియైన మార్గం.

అనువాదం: బోడపట్ల రవీందర్.
సెల్: 9848412451

డిటెన్షన్ విధానం విద్యాహక్కుకు విఘాతం




నాగటి నారాయణ

ప్రాథమిక విద్యలో నాన్ డిటెన్షన్ విధానాన్ని ఎత్తేయాలని కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం విద్యా హక్కు చట్టాన్ని సవరించే బిల్లును పార్లమెంట్‌లో పెట్టబోతున్నట్టు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి ప్రకాశ్ జవదేకర్ ప్రకటించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఏ ద్వారా 8వ తరగతి వరకు విద్యను ప్రాథమిక హక్కుగా ప్రకటించిన విషయం అందరికీ తెలిసిందే. బడిలో చేరిన విద్యార్థులను ఎనిమిదో తరగతి పూర్తయ్యే వరకు మధ్యలో ఏ తగరతిలోనూ ఆపకూడదు లేదా బహిష్కరించకూడదు అని సెక్షన్ 16లో ఆదేశం. ఈ నిబంధన సవరించి 5వ తరగతికీ 8వ తరగతికీ పరీక్షలు నిర్వహించి వారిని అదే తరగతిలో ఆపేయాలి (డిటెయిన్) అని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

పరీక్షలు పెట్టి పాసైన వారిని ప్రమోట్ చేసి, ఫెయిలైన వారిని డిటెయిన్ చేస్తే ఏమవుతుంది? ప్రథమ్ సంస్థ సర్వేలు, విద్యాశాఖల నివేదికల ప్రకారం ప్రతీ తరగతిలోనూ నిర్దేశిత కనీస అభ్యాసన సామర్థ్యాలను సగం మంది విద్యార్థులే సాధించగలుగుతున్నారని తెలుస్తోంది. జాతీయ విద్యా ప్రణాళిక, పరిపాలన విశ్వ విద్యాలయం (ఎన్‌యూఈపీఏ) ప్రచురించిన 2015–16 యు–డైస్ గణాంకాల ప్రకారం దేశంలో మొత్తం పాఠశాల విద్యార్థులు 26.06 కోట్ల మంది. వారిలో 5వ తరగతిలో 2.50 కోట్లు, 8వ తరగతిలో 2.20 కోట్లు వెరసి 4.70 కోట్ల మంది ఉన్నట్టు ఆ నివేదికలో పేర్కొంది. ఇప్పుడు కూడా దాదాపు అదే సంఖ్యలో ఉండొచ్చు. వారిలో 98శాతం మంది 'నో డిటెన్షన్' పాలసీతో ప్రమోట్ అవుతుంటారు. డిటెన్షన్ పాలసీ వస్తే దాదాపు సగంమంది ఫెయిలవుతారు. ఫెయిలయ్యే వారిలో అత్యధికులు ప్రభుత్వరంగ పాఠశాలల్లోని దళిత, గిరిజన, బహుజన విద్యార్థులే ఉంటారు. అరకొర చదువే దిక్కయిన వారికి పాసయ్యే అవకాశం బహు తక్కువ. పాఠశాల విద్యలో పాస్, ఫెయిల్ పరీక్షా విధానం సరైంది కాదని, అది బట్టీ చదువులకే పరిమితం చేసి విద్యార్థుల సృజనాత్మక శక్తిని చిదిమేస్తుందని చాలా కాలంగా ఓ చర్చ ఉంది. పరీక్షల సంస్కరణలో భాగంగానే నిరంతర సమగ్ర మూల్యాంకనం (సీసీఈ) విధానం వచ్చింది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పాస్ ఫెయిల్‌గా కాకుండా గ్రేడ్‌లుగా ప్రకటించడం జరుగుతుంది. డీ, సీ గ్రేడ్‌ల విద్యార్థుల అభ్యసనకు అదనపు అవకాశాలను కల్పించి బీ, ఏ గ్రేడులకు ఎదగటానికి సహాయం చేయాలి. విద్యాహక్కు చట్టం ప్రకారం 1–8 తరగతులకు నిరాటంకంగా విద్యను కొనసాగించేందుకు సీసీఈ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయమైంది. కానీ ఈ విధానం సరిగా అమలు చేయకపోవడమే అసలు సమస్య. దానిని పట్టించుకోకుండా నో డిటెన్షన్ విధానం వలనే అభ్యసనా ప్రమాణాలు పడిపోతున్నాయని, అందుకే డిటెన్షన్ విధానం తేవాల్సి వస్తోందని ప్రభుత్వం చెబుతోంది. డిటెన్షన్ విధానంతో అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాలు పెరుగుతాయని ఏ విద్యా కమిషన్ నివేదికలోనూ చెప్పలేదు. పరీక్షల వలన విద్యార్థులు ఆందోళనకు, మానసిక ఒత్తిడికి గురవుతారని, ఫెయిలైనవారు న్యూనతా భావంతో, అవమానాలతో కుంగిపోయి ఆత్మహత్యల పాలవుతారనే విషయం తెలియనిదేమీ కాదు.

బడిపిల్లలు నిర్దేశిత అభ్యసన సామర్థ్యాలను సాధించలేకపోవడానికి ప్రధానంగా ఐదు కారణాలున్నాయి. విద్యాహక్కు చట్టంలో పేర్కొన్న వసతులు, ప్రమాణాలతో పాఠశాలలు లేకపోవడం, ప్రభుత్వ పాఠశాలల్లో తగినంత మంది ఉపాధ్యాయులు లేకపోవడం, విద్యా సంవత్సరంలో 220 పనిదినాలతో వేయి గంటల ఇన్‌స్ట్రక్షన్ అమలు జరగకపోవడం, ఇంట్లో తల్లిదండ్రులు బిడ్డల చదువు గురించి తెలుసుకుంటూ అవసరమైన మద్దతు అందించే పరిస్థితి పేద కుటుంబాల్లో లేకపోవడం. ఈ కారణాలకు బాధ్యుడు కాని విద్యార్థిని డిటెన్షన్‌తో శిక్షించడం న్యాయంకాదు. కారణాలుగా పేర్కొన్న లోపాలు అన్నింటికీ సర్కార్ బడులు నిలయాలు. అందువలన వాటిలో చదువుకునే బడుగు, బలహీన వర్గాల విద్యార్థులే డిటెన్షన్ ప్రయోగానికి బలవుతారు.

ప్రభుత్వ విద్యను నియంత్రించి, ప్రయివేట్ విద్యను ఎగదోయడం బీజేపీ సర్కార్‌కు ఎక్కువైంది. ఏ చట్టాన్నీ లెక్కచేయని ప్రయివేట్ స్కూళ్ల యాజమాన్యాలు డిటెన్షన్ కోసం తెచ్చే సవరణ చట్టాన్నీ అమలు చేయవు. విద్యార్థులు ఫెయిలైతే విద్యా వ్యాపారానికి నష్టం, అందువల్ల ప్రయివేట్ స్కూళ్లు విద్యార్థులను ఫెయిల్ కానివ్వవు. అభ్యసనలో వెనకబడుతున్న వారికి స్పెషల్ కోచింగ్ ఇస్తామనే పేరుతో అదనంగా మరింత ఫీజులు గుంజుకుని అందరినీ ఏదో విధంగా పాస్ చేయిస్తాయి. 'సర్కార్ బడుల్లో ఫెయిలవుతారు, ప్రయివేట్ స్కూల్స్‌లో అయితేనే పాసవుతారు' అనే పబ్లిసిటీతో ప్రయివేట్ విద్యా వ్యాపారం మరింత పెరిగిపోతున్నది.



అందరికీ కనీసం పాఠశాల విద్యను నిర్బంధంగా అందించాలనే రాజ్యాంగ ఆదేశాలు అమలుకు నాన్ డిటెన్షన్ విధానాన్నే కొనసాగించాలి. ఈ విధానంతో పరీక్షలు లేకుండానే ప్రమోట్ చేస్తున్నారు అనే విమర్శలు తప్పు. సీసీఈ విధానంలో ఏడాదికి నాలుగు పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతీ పరీక్షల్లోనూ విద్యార్థి మార్కుల ఆధారంగా పై గ్రేడ్‌లకు అభివృద్ధి చెందడానికి ప్రోత్సహిస్తారు. పాస్, ఫెయిల్‌తో నిమిత్తం లేకుండా ప్రతి విద్యార్థి కనీస అభ్యసన సామర్థ్యాలను సాధించగలిగే ఏర్పాట్లు ప్రభుత్వమే చేయాలి. ప్రతి పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఉండాలి. దీర్ఘకాలిక సెలవుల్లో ఉండే ఉపాధ్యాయుల బాధ్యతల నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ, సమావేశాలను పని దినాల్లో నిర్వహించకూడదు. బడి పని దినాలు, టైమ్ టేబుల్, సిలబస్ కవరేజీ, మూల్యాంకన కర్తవ్యాలను సకాలంలో సమర్థవంతంగా అమలు చేయించే పర్యవేక్షణ, మోనిటరింగ్ వ్యవస్థను పటిష్ఠంగా పనిచేయించాలి. పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, లెర్నింగ్ మెటీరియల్ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు ఉచితంగా అందించాలి. చదువులో వెనకబడిన విద్యార్థులకు అదనపు బోధన ఏర్పాట్లు చేయాలి. నిరంతర సమగ్ర మూల్యాంకన విధానాన్ని సరళతరం చేసి సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన సాధనాలను సమకూర్చి ఉపాధ్యాయులను సిద్ధం చేయాలి. ఇలా విద్యార్థులను 8వ తరగతి వరకు డిటెయిన్ కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

డిటెన్షన్ విధానాన్ని తేవటానికి మంత్రి జవదేకర్ చెబుతున్న కారణాలు సమంజసంగా లేవు. అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాలను పరిశీలించిన ప్రథమ్, న్యూపా నివేదికల్లోనే కారణాలు, పరిష్కార మార్గాలు కూడా సూచించబడినవి. వాటిని అమలు చేయటానికి ప్రయత్నం చేయకపోగా గత మూడేండ్ల నుంచి కేంద్ర బడ్జెట్‌లో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేసే సర్వశిక్షా అబియాన్‌కి 15శాతం నిధులు తగ్గించింది. ప్రభుత్వ ఉపాధ్యాయ విద్య కళాశాలల్లో బోధనా సిబ్బంది కొరత వలన, ప్రయివేట్ రంగంలో టీచర్ ఎడ్యుకేషన్ కాలేజీలు పెరిగిపోవడం వలన నాణ్యమైన ఉపాధ్యాయులు లభించడంలేదు. అన్‌ట్రెయిన్డ్ టీచర్లను 2016 మార్చి తరువాత అనుమతించవద్దు అనే నిబంధనను ఉల్లంఘించి మరో మూడేండ్లు కొనసాగేందుకు చట్టాన్ని సవరించింది. కేంద్రం నిర్బంధం చేసిన టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) వలన చాలా రాష్ట్రాల్లో ఉపాధ్యాయ నియామకాలు స్థంభించిపోయాయి. కంటిన్యూయస్ కాంప్రహెన్సివ్ ఇవాల్యుయేషన్ (సీసీఈ) విధానాన్ని చాలామంది ఉపాధ్యాయులే అర్థం చేసుకోలేదని నివేదికల్లో తేలింది. 25 రాష్ట్రాలు కోరినందున డిటెన్షన్ విధానాన్ని తేవాల్సి వస్తోందని చెప్పడం కేంద్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. 'చట్టాన్ని సవరిస్తాం, దానిని అమలు చేయాలా లేదా అనేది రాష్ట్రాల ఇష్టం' అని జవదేకర్ చెప్పడం మరీ విడ్డూరంగా ఉంది. అసలు విద్యాహక్కు చట్టమే అమల్లో లేదని కాగ్ నివేదిక కడిగేసింది. ఆ విషయాన్ని పరిశీలించకుండా సవరణ చేయడం ఎందుకు? విద్యాహక్కును దెబ్బతీసే విధానాన్ని తెచ్చిపెట్టే డిటెన్షన్ బిల్లు సమర్థనీయం కాదు. దానిని ఉపసంహరింపజేసేందుకు విద్యారంగ శ్రేయోభిలాషులు తమ శక్తి మేరకు కృషి చేయాలి. పార్లమెంట్ సభ్యులు బిల్లును వ్యతిరేకించాలి. దానికన్నా విద్యాహక్కు చట్టం అమలు తీరు తెన్నులపైన పార్లమెంట్‌లో సమగ్రమైన చర్చ కోసం పట్టుబట్టాలి. తద్వారా ఇప్పటికైనా బడి ఈడు పిల్లల నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్యకు భరోసా కల్పించాలి.

సెల్: 9490300577

మెయిల్ @ నవతెలంగాణ



జి. నరసింహప్రసాద్

ఇంకెన్నేండ్లు...?

ఎంత కష్టపడి స్వతంత్రం తెచ్చుకున్నామో 70ఏండ్ల నుంచి చెప్పుకుంటూనే వున్నాం. మన సర్వ రోగాలకు కూలబడ్డ వ్యవస్థలకు, కులపిచ్చికి, మత విద్వేషాలకు, ప్రాంతాల పైత్యానికి నాటి బ్రిటిష్ పాలన, వారి ఎత్తుగడలు, శాసనాలే కారణమని. మరో వందేండ్లు కూడా ఇలానే నమ్మించగల నైపుణ్యం ఈ దేశ నాయకులకు పుష్కలంగా ఉంది. వాస్తవాలను జీర్ణించుకోలేని దేశభక్తులకు, భ్రమలలో బ్రతకడమే భారతీయతగా భావించేవారికి వాస్తవాలను తెలిపేవారు దేశద్రోహులుగాను, ఆత్మవిమర్శ చేసుకోవాలనేవారు విదేశీ తొత్తులుగా కనబడుతున్నారు.

స్వాతంత్ర్యానికి సరిగ్గా రెండేండ్ల ముందు అంటే 1945 ఆగస్టు 6న జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలపై అమెరికన్ దళాలు 2వ ప్రపంచ యుద్ధం (1939–45) చివరలో ప్రపంచంలోనే మొదటిసారిగా అణుబాంబులు వేసారు. దానితో 90శాతం నగరం మసై 80 వేల మంది వెంటనే చనిపోయారు. రేడియేషన్ ప్రభావానికి గురైనవారు, ఆ తరువాత చనిపోయారు. మొత్తం 3 లక్షల యాభైవేల మంది హిరోషిమా నగర జనాభాలో లక్ష నలభై వేల మంది చనిపోవడంతో శవాల దిబ్బగా మారింది నాటి హిరోషిమా. విపత్తుని ఎలా ఎదుర్కోవాలి, ఏం చేయాలో కూడా తెలియని అగమ్య స్థితిలో ఏడవటానికి కండ్లలో నీళ్ళు కూడా రాని అత్యంత దయనీయ స్థితిలో ఉన్న నాటి జపాన్ నేడు, ప్రపంచంలోనే తిరుగులేని ఆర్థిక స్థితికి చేరింది. కారణం క్రమశిక్షణ, కఠోర పరిశ్రమ, కొత్త ఆలోచనలు.

మనం స్వాతంత్ర్యం తెచ్చుకున్న 18ఏండ్లకి మలేసియా నుంచి వేరుపడి స్వతంత్ర దేశంగా సింగపూర్ అవతరించింది. నిరుద్యోగం, నివాస గృహలేమి, ముఖ్యంగా సహజ వనరుల లేమి, దాని కన్నా మించి భూమి కొరత. అపరిశుభ్రత, ఆకలితో అలమటించిన సింగపూర్‌ని అత్యంత చిన్నదైన భూభాగం కలిగిన సింగపూర్‌ని అద్వితీయ ఆర్థికశక్తిగా, పరిశుభ్రతకు మారుపేరుగా, ప్రపంచ పటంలో నిలబెట్టిన ఖ్యాతి లీ–కువాన్ ది, ఆయన వెన్నంటి ఉన్న సింగపూర్ ప్రజలది. 700చ.కి.మీ. విస్తీర్ణంలో ఉన్న ఒక చిన్న దీవి నేటికి మంచినీటి కోసం మలేషియాపై ఆధారపడ్డ దేశం, సాగుచేసుకోవడానికి అరెకరం విస్తీర్ణం కూడా లేని సింగపూర్, ఆసియాలో అభివృద్ధి చెందిన దేశంగా నిలిచింది.

జపాన్ వాళ్ళు ఆటంబాంబు ద్వారా వచ్చిన వినాశనాన్ని జయించగలిగారు కాని, మకిలి పట్టిన భావజాలం నుంచి మనం బయటపడలేకపోతున్నాం. మూఢనమ్మకాలు, సంప్రదాయాలు, ఆచారాలు – అనాచారాలు కలగలిసిన ఆలోచనలు, పద్ధతులు ఏవీ విడగొట్టలేని దైన్యస్థితి. బాణామతి, చేతబడి లాంటివి నమ్మరాదని ఓ వైపు ప్రచారం చేస్తూ, మరో వైపు ప్రభుత్వాధినేతలు యాగాలు, హోమాలు, పూజలు చేయించే చిత్రమైన పరిస్థితి. యాగాలు, హోమాల వల్ల ఉపయోగం ఉంటుందని నమ్మే వాళ్ళు బాణామతి, చేతబడుల వల్ల ఉపయోగం ఉండదని ఎలా చెప్పగలరు?

ఇక చట్టాలు, న్యాయాలు వగైరా వ్యవహారాలు సామాన్యులు అందుకోలేనంత ఎత్తులో అత్యంత విలువైన వ్యవహారాలుగా మారి, విలువలు పోగొట్టుకుంటున్నాయి. దేశంలోని వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు దాదాపు 3 కోట్లు. ఓ జీవిత కాలానికి కూడా తీరేవా ఇవి? ఇక అవినీతి ఓ నేరం అనే స్థాయిని దాటి ఓ హక్కుగా ఎప్పుడో మారిపోయింది. నైతికత అనే ప్రస్తావన లేదిప్పుడు. ఒకప్పుడు అవినీతిపరుణ్ణి వెలివేసినట్టు చూసే స్థితి నుంచి అభిమానంతో కౌగిలించుకొని హారతి పట్టి ఆహ్వానించే స్థితికి ఎదిగింది భారత సమాజం.

ప్రపంచ పటంలో ఎక్కడున్నాయో కూడా తెలియని దేశాలు సరిగ్గా పేరు కూడా మిగతా ప్రపంచానికి తెలియని దేశాలు, ఒలింపిక్స్‌లో మెడల్స్ సాధిస్తుంటే వంద కోట్ల జనాభా ఒకటో అరో మెడల్స్ సాధిస్తే, సాధించినవాళ్ళు ఏ కులానికి చెందిన వాళ్ళు? ఏ ప్రాంతానికి చెందిన వాళ్ళు అని వెతకడం, సాధించిన వాళ్ళ సామాజిక కోణాలను బట్టి ప్రభుత్వాలు బహుమతులను అందచేయడం నాగరికత అవుతుందా? మా తాతలు నేతులు తాగారు, త్రేతాయుగంలోనే మా దగ్గర విమానాలున్నాయి అన్నీ వేదాల్లోనే ఉన్నాయి అనే అసంబద్ధ అసమర్థ ఆలోచనలను నర నరాల్లో జీర్ణించుకున్న నేను అనే అహం, అహంకారం, అహంభావం మాకే అన్నీ తెలుసు మిగతా ప్రపంచానికి నాగరికత నేర్పిందే మేము లాంటి ఆలోచనలను పాతిపెట్టాలి. మీదే నవ భారతానికి పునాదులు వేయాలి. ఆగస్టు 15 లక్ష్యం లేని ఊకదంపుడు ఉపన్యాసాలకు కాకుండా, ప్రతి సంవత్సరం లక్ష్యాలకు వేదికగా మార్చాలి.

సెల్: 9440734501



నంద్యాల రోడ్‌షోలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న జగన్

చంద్రబాబు అభివృద్ధి సున్నా: జగన్

నంద్యాల: రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి సున్నా అని, ఉప ఎన్నికలు రాకుంటే నంద్యాలకు ఒక్క రూపాయి వచ్చేది కాదని వైసీపీ అధినేత వైఎస్.జగన్ విమర్శించారు. ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నంద్యాల పద్మావతి ఆర్చి నుంచి జగన్ రోడ్‌షో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి, మంత్రులు ప్రతి సామాజిక వర్గానికి ఎరవేస్తూ, బుజ్జగింపులు చేస్తున్నారని, వినకపోతే బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో రైతులు రెండు కార్ల పంటలు పండించే వారని, బాబు హయాంలో ఒక్క పంట కూడా కరువైందన్నారు. కొన్ని చోట్ల తాగడానికి మంచినీరు లేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. బాబు వచ్చాక రేషన్ షాపుల్లో బియ్యం మాత్రమే ఇస్తున్నారని, కిరోసిన్, చక్కెర, గోధుమ పిండి, పామాయిల్, కందిపప్పు తదితర వస్తువులు ఇవ్వడం లేదని విమర్శించారు. ఉప ఎన్నికల్లో వైసిపి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

టీడీపీ, వైసీపీ అన్ని విధాల విఫలం : రఘువీరా

అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ అన్ని విధాలా విఫలం చెందాయని, తమ సొంత ప్రయోజనాల కోసం ప్రశాంతంగా ఉండే నంద్యాలను అశాంతిమయం చేశారని పీసీసీ అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి విమర్శించారు. నంద్యాల ఉప ఎన్నికల్లో భాగంగా పాదయాత్ర చేస్తున్న పీసీసీ అధ్యక్షులు ఎన్. రఘువీరారెడ్డి 6వ రోజు బిషప్ మద్దతు కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అబ్దుల్ ఖాదర్‌కు ఓటు వేసి వేయించి గెలిపించాలని కోరారు.

నంద్యాలలో టీడీపీ విస్తృత ప్రచారం

ఉప ఎన్నికల్లో భాగంగా టీడీపీ విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించింది. నంద్యాల 37వ వార్డులో ప్రచార ర్యాలీ నంది పరిశ్రమల ఎండి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి భూమా అఖిలప్రియ, మాజీ మంత్రి టి.జి.వెంకటేష్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వర్‌రావు, పెనగలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావు, అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి, డాక్టర్లు నౌమాన్ తదితరులు పాల్గొన్నారు.

మసీదులపై హక్కు అల్లాదే: ఓవైసీ

హైదరాబాద్: ఒక మత పెద్ద చెప్పారని మసీదును వదులుకోవడం కుదరదని ఎంఐఎం జాతీయ అధ్యక్షులు, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ తేల్చి చెప్పారు. అయోధ్యలోని వివాదస్పద స్థలానికి దూరంగా ముస్లింలు ఎక్కువగా ఉన్న చోట మసీదు నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుందని ఈ నెల 8న ఉత్తరప్రదేశ్ షియా సెంట్రల్ బోర్డు ప్రతిపాదన చేసిన సంగతి తెలిసిందే. దీనిపై ఎంపి అసద్ ట్విట్టర్‌లో స్పందించారు.

కాపులకిచ్చిన హామీలన్నీ నెరవేర్చుతాం

అది నా బాధ్యత.. గుర్తుచేయక్కర్లేదు: చంద్రబాబు



కాపుల ఆత్మీయ సమ్మేళ కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి : కాపులకిచ్చిన హామీలన్నీ వీలైనంత త్వరలోనే నెరవేర్చుతానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. అది తన బాధ్యతని, ఎవరూ గుర్తు చేయనక్కర్లేదని స్పష్టం చేశారు. విజయవాడ వెన్యూ సమావేశ మందిరంలో కాపుల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు మాట్లాడుతూ తాను పాదయాత్ర చేసిన సమయంలో ఎన్నో సమస్యల్ని అధ్యయనం చేశానన్నారు. అందుకే అన్ని వర్గాలతో సమానంగా కాపులను అభివృద్ధి చేసేందుకు రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించానన్నారు. వారి మనోభావాలను అర్థం చేసుకుని, ఎవరూ అడగకుండానే హామీ ఇచ్చానన్నారు. త్వరలోనే మంజునాథ కమిషన్ నివేదిక వస్తుందని, దానిపై కేబినెట్‌లో చర్చించి కేంద్రానికి పంపిస్తామన్నారు.

రిజర్వేషన్ ప్రక్రియ ఏదో చేశామన్నట్లు కాకుండా పద్ధతి ప్రకారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాపు రిజర్వేషన్లపై 2004 ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి, మిగిలిన అందరికీ ఇచ్చి కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలవారిని తీసేశారన్నారు. కనీసం రూ. 40 లక్షలైనా ఖర్చుపెట్టి ఉంటే కాపుల వివరాలన్నీ అప్‌డేట్ అయ్యేవన్నారు. గత ఎన్నికల్లో వైసీపీ మేనిఫెస్టోలో కాపుల రిజర్వేషన్ అంశాన్ని పెట్టలేదని, కనీసం ఇటీవల జరిగిన ప్లీనరీలో కూడా మాట్లాడలేదని ఆయన విమర్శించారు. నోరు పారేసుకుంటే విశ్వసనీయత రాదని, అది ఒక్క రోజులో వచ్చేది కాదన్నారు. కాపు రిజర్వేషన్లపై టిడిపిని జగన్ విమర్శించడం సిగ్గుచేటన్నారు. తమ హయాంలో కొందరికి నేరుగా పదవులు రాకపోయినా సామాజిక న్యాయంతో నామినేటెడ్ పదవులు ఇస్తామన్నారు. సామాజిక న్యాయం అనేది తాను విద్యార్థి దశలోనే నేర్చుకున్నానని, యూనివర్సిటీలోనే దానికోసం పోరాడానని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలోనే కాపుల రిజర్వేషన్లను తొలగించారన్నారు. కాపుల గురించి ఇప్పుడు మాట్లాడుతున్న నేతలంతా అప్పుడు మేనిఫెస్టోలో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. సమాజంలో అన్ని వర్గాలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. వెనుకబడిన వర్గాలకు ఎలాంటి అన్యాయం జరగకుండానే కాపులకు రిజర్వేషన్లు ఇస్తామన్నారు. బిసిలను కొందరు రెచ్చగొట్టి వివాదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అలాంటి వారి మాటలను నమ్మొద్దన్నారు.

చంద్రన్న సంచార ఉద్యోగుల రిలే దీక్షలు



ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న ఎవి నాగేశ్వరరావు

అమరావతి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చంద్రన్న సంచార చికిత్స (104) ఉద్యోగులు సోమవారం విజయవాడ అలంకార్ థియేటర్ సెంటర్‌లో రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 151 ప్రకారం వేతనాలు పెంచాలని, చంద్రన్న సంచార చికిత్సలను రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని, ఫుడ్ అలవెన్స్ పెంచాలని వారు కోరుతున్నారు. ఈ దీక్షా శిబిరాన్ని రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ సెక్రటరీ జనరల్ ఎం బాలకాశి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగుల జెఎసి చైర్మన్, చంద్రన్న సంచార చికిత్స ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఉద్యోగులకు ఏడేళ్లుగా వేతనాల్లో, ఫుడ్ అలవెన్స్‌లలో ఎటువంటి పెరుగుదలా లేదన్నారు. జీవో 151 విడుదలై ఏడాది గడిచినా ఆ ప్రకారం వీరికి వేతనాలు పెంచకపోవడం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగులను వేధిస్తున్న పిరామిల్ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం రెండు నెలలుగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీమన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే వివిధ రూపాల్లో ఆందోళనలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామని, సమ్మె కూడా చేపడతామని హెచ్చరించారు. ఈ మేరకు ప్రభుత్వానికి ఇప్పటికే యూనియన్ నోటీసును అందజేసిందని గుర్తు చేశారు. ఎం.బాలకాశి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీతాలు పెంచి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ రాష్ట్ర ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, ప్రైవేట్ రవాణా రంగ ఆలిండియా కార్యదర్శి ముజఫర్‌అహ్మద్ ఈ దీక్షలకు మద్దతు తెలిపి దీక్షల్లో పాల్గొన్న వారికి పూల దండలు వేసి దీక్షలను ప్రారంభించారు.

కాపులకు స్వాతంత్ర్యం వచ్చేదెప్పుడు?

- మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం

కిర్లంపూడి: 'కాపు రిజర్వేషన్ల కోసం గాంధీ స్ఫూర్తితో గాంధేయమార్గంలో శాంతియుతంగా పాదయాత్ర చేసేందుకు అనుమతి కోరితే రాష్ట్రప్రభుత్వం నిరంకుశధోరణితో అడ్డుకోవడం ఎంతవరకూ న్యాయం? కాపులకు స్వాతంత్ర్యం వచ్చేదెప్పుడు?' అని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నించారు. ఆయన చేపట్టిన నిరవధిక పాదయాత్రను 20వరోజూ పోలీసులు అడ్డుకోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా నల్లజెండాలతో నిరసన తెలిపారు. ప్రజాస్వామ్యవాదులు ఇటువంటి నిరంకుశ వైఖరిని ప్రశ్నించాలన్నారు. చంద్రబాబు చేపట్టిన పాదయాత్రలు, దీక్షలకు చట్టాలు చుట్టాలుగా మారాయని, హక్కులకోసం పోరాడుతున్న కాపులపై నిర్బంధం విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాపు జేఏసీ నాయకులు ఆకుల రామకృష్ణ, వాసిరెడ్డి ఏసుదాసు, గౌతు స్వామి, తుమ్మలపల్లి రమేష్, ఆరేటి ప్రకాష్, గోపు అచ్యుతరామయ్య పాల్గొన్నారు. టీడీపీలో పదవులు అనుభవిస్తున్న కాపులతో చర్చలు జరిపి, తమ చెవిలో పువ్వులు పెట్టాలని చూస్తే సహించేది లేదంటూ కాపునాడు ఆధ్వర్యాన కాపులు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో చెవిలో పువ్వులు పెట్టుకుని సోమవారం రాస్తారోకో చేశారు. చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాపునాడు నగర అధ్యక్షులు జల్లా హరికృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే అసలైన కాపు ఉద్యమ నాయకులు ముద్రగడ పద్మనాభంతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి విదేశీ బాట

- అరబ్ ఎమిరేట్స్, దావోస్‌లకు చంద్రబాబు

అమరావతి: గాలిలో దీపాల్లా మారుతున్న భారీ పెట్టుబడులు వస్తాయో రావో తెలియదు.. ఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థలు మాట నిలబెట్టుకుంటాయో లేదో అర్థం కాదు.. ఎంత మందికి ఉపాధి లభిస్తుందో పక్కా అంచనాలు లేవు.. అయినా మన వారి విదేశీ యాత్రల వేగం తగ్గడం లేదు. కొద్ది నెలల విరామానంతరం మరో సారి విదేశీ పర్యటనల జోరు ప్రారంభం కానుంది. ఈసారి ముఖ్యమంత్రే కాకుండా, ఆయన తన యుడు కూడా విదేశీ యాత్రలకు కసరత్తు చేసు కుంటున్నారు. గతంలో వ్యక్తిగతం అంటూనే అధి కారులతో పాటు అమెరికా పర్యటించిన ఆయన, ఇప్పుడు మంత్రి పదవి కూడా రావడంతో అధికారి కంగానే పర్యటనలు చేయాలని నిర్ణయించుకు న్నారు. వీరిద్దరి పర్యటనలకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు శరవేగంతో పూర్తి చేస్తోంది. వచ్చే జనవరి వరకు ఈ యాత్రల ముసాయిదా షెడ్యూల్ సిద్ధమైంది.

కష్టజీవుల ఉద్యమానికి విజయకుమార్ సహకారం

- సంస్మరణ సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి.మధు

దుగ్గిరాల: కష్టజీవుల ఉద్యమానికి కోగంటి విజయకుమార్ ఎంతో సహకరించారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. ఇటీవల మరణించిన సీపీఐ(ఎం) అభిమాని కోగంటి విజయకుమార్ సంస్మరణ సభ గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చిలువూరులో సోమవారం నిర్వహించారు. సభకు కారుమంచి కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా మధు మాట్లాడారు. కమ్యూనిస్టు అగ్రనాయకులైన సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు, బసవపున్నయ్య, ఎల్‌బిజి, కొరటాల తదితర నాయకులతో విజయకుమార్ కుటుంబానికి మంచి సంబంధాలున్నాయని గుర్తు చేశారు. ఐఎఎస్ అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. విజయకుమార్ సేవాభావంతో పనిచేసేవారని చెప్పారు. సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య, మంగళగిరి డివిజన్ కార్యదర్శి జెవి.రాఘవులు తదితరులు పాల్గొన్నారు.



రైళ్లలో ఇక ఉచిత సినిమాలు!

న్యూఢిల్లీ: భారత రైల్వేల్లో కేంద్రం మరో సౌలభ్యాన్ని అందుబాటులోకి తీసుకు రానున్నది. ఇప్పుడు దాదాపు మూడువేల రైళ్లలో ప్రయాణికులకు ఉచితంగా వినోదాన్ని అందించనున్నది. దీనికోసం వయాకామ్18, జీ, హంగామా, షెమారూ వంటి వీడియో ప్రొవైడర్స్ తమ ఆసక్తిని వ్యక్తం చేశారని తెలిసింది. 24 కంపెనీలు ముందుకు రాగా..దీనివల్ల రైల్వేకు రూ.,500 కోట్లు ఆదాయం సమకూరనున్నదని అంచనా.అన్ని భారతీయ భాషల్లో సినిమాలు, వీడియోలను ఫ్రీగా చూసే అవకాశం లభిస్తుంది.ఆయా రైళ్లలో ఇప్పటికే ఉచితంగా లభించే వైఫై సేవల ద్వారా ప్రయాణికులు తమ స్మార్ట్‌ఫోన్లలో లాగిన్ అయ్యి ఈ సౌలభ్యాన్ని పొందవచ్చు..

21 మంది సభ్యులను బహిష్కరించిన జేడీ(యూ)

న్యూఢిల్లీ : పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో కీలక నేతలు, మాజీ మంత్రులతో సహా 21 మందిని జేడీయూ బహిష్కరించింది. వీరిలో మాజీ మంత్రులతోపాటు, ఎంపీ, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల సభ్యులు కూడా వున్నారు. ఎనిమిది సార్లుగా ఎమ్మెల్యేగా ఎన్నికకావడంతో పాటు మంత్రిగా పనిచేసిన రామాయి రామ్ కూడా బహిష్కరణకు గురైనవారిలో వున్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కారణంగానే వీరిని బహిష్కరిస్తున్నట్లు జేడీ(యూ) బీహార్ అధ్యక్షులు వశిష్ట నారాయణ సింగ్ తెలిపారు. గతవారంలో శరద్ యాదవ్ అనుచరుడు, రాజ్యసభ సభ్యుడు అలి అన్వర్ అన్సారీని పార్టీ నుంచి బహిష్కరించిన సంగతి తెలిసిందే.



కన్నూరు జిల్లా ధర్మదంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ గూండాల దాడిలో ధ్వంసమైన సీపీఐ(ఎం) కార్యాలయ కిటికీలు

సీపీఐ(ఎం) కార్యాలయాలపై ఆర్ఎస్ఎస్ దాడి

కన్నూరు: కేరళలోని కన్నూరు జిల్లాలో సీపీఐ(ఎం) కార్యాలయాలు, కార్యకర్తలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ గూండాల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా జరిగిన హింసాత్మక సంఘటనల్లో ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మదం నియోజకవర్గంలో సీపీఐ(ఎం) కార్యాలయంపై దాడి జరిగింది. కాషాయ గూండాలు

ఓయూ ప్రతిష్టకే 'పరీక్ష'

- అత్యుత్తమ గ్రేడ్ కోసం 'విశ్వ'ప్రయత్నం
- సర్వహంగులతో ముస్తాబవుతున్న వర్సిటీ
- 17,18,19 తేదీల్లో న్యాక్‌బృందం పర్యటన
- వెంటాడుతున్న సమస్యలు
- తీరని వ్యథ...అధ్యాపకుల కొరత

ఉస్మానియాలో న్యాక్ ఫీవర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్/ఉస్మానియా విశ్వవిద్యాలయం

రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థల్లో ఒకటి ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ). దేశంలో అతి పురాతనమైన విశ్వవిద్యాలయాల్లో ఓయూ ఏడోస్థానంలో ఉంది. వందేమాతర ఉద్యమం మొదలుకొని తెలంగాణ ఉద్యమం వరకు పోరాటాలకు చిరునామా ఓయూ. ఇక్కడ

NAAC
NATIONAL ASSESSMENT AND ACCREDITATION COUNCIL

చదివిన వారు దేశవిదేశాల్లో ప్రముఖస్థానాల్లో స్థిరపడ్డారు. ఓయూ కీర్తిప్రతిష్టలు ప్రపంచమంతా విస్తరించాయి. ఓయూలో నేడు ఎక్కడా చూసినా, ఎవరి నోట విన్నా నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) మాటే వినిపిస్తున్నది. ఉస్మానియాలో న్యాక్ ఫీవర్ ఉంది. వేలాది మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించే ఉస్మానియా విశ్వవిద్యాలయం నేడు సొంతంగా పరీక్షా కాలాన్ని ఎదుర్కోబోతున్నది. న్యాక్ గ్రేడ్ ఓయూ ప్రతిష్టకే పరీక్షగా మారింది. ఈనెల 17,18,19 తేదీల్లో న్యాక్ బృందం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పర్యటించనుంది. అంతా టెన్షన్ వాతావరణం నెలకొంది. ఉస్మానియా ప్రాంగణంలోని కాలేజీ భవనాలు, హాస్టళ్లు, అడ్మినిస్ట్రేటివ్ భవనాలు, పార్కులు, గ్రంథాలయం, పరిశోధనా కేంద్రాలు ఇలా అన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి. కొత్త రంగులు, మరమత్తులతో భవనాలు, హాస్టళ్లు కళకళలాడుతున్నాయి. ఇంకా కొన్ని పనులు జరుగుతూనే ఉన్నాయి. అత్యుత్తమ గ్రేడ్ కోసం విశ్వవిద్యాలయం అధికారులు విశ్వప్రయత్నం చేస్తున్నారు. వాస్తవానికి ఈఏడాది ఏప్రిల్ 26,27,28 తేదీల్లో జరిగిన ఓయూ శతాబ్ది ఉత్సవాలకు ముందే న్యాక్ గ్రేడ్ వస్తుందని అందరూ ఆశించారు. కానీ అందరికీ నిరాశే ఎదురైంది. ఉస్మానియా అధికారుల విజ్ఞప్తి మేరకు న్యాక్ బృందం ఈనెలలో పర్యటిస్తున్నది.

అత్యుత్తమ గ్రేడ్‌తో అధిక నిధులు

ఓయూకు అత్యుత్తమ న్యాక్ గ్రేడ్ వస్తే బహుళ ప్రయోజనాలున్నాయి. 2017, మార్చి 16న న్యాక్‌కు సెల్ఫ్ స్టడీ రిపోర్టు (ఎస్ఎస్ఆర్)ను అందజేసింది. అందులో ఉన్న అంశాల పరిశీలనకు న్యాక్ బృందం ఈనెల 17,18,19 తేదీల్లో పర్యటిస్తున్నది. న్యాక్ గ్రేడ్ వస్తే ఓయూ కీర్తి మరింత పెరగనుంది. న్యాక్ అత్యుత్తమ గ్రేడ్ వస్తే యూజీసీ, రూసా, ఎంహెచ్ఆర్డీ ఇతర సంస్థల నుంచి ఎక్కువ నిధులొస్తాయి. విద్యార్థుల పట్టాలకు విలువ పెరుగుతుంది. విద్యార్థులకు ఎంహెచ్ఆర్డీ ప్రకటించే ఫెలోషిప్‌ల సంఖ్య పెరుగుతుంది. విద్యార్థుల సర్టిఫికెట్ల మీద ఆ గ్రేడ్ ఉంటే విదేశాల్లో చదువులకు, మంచి సంస్థల్లో ఉద్యోగాలు పొందేందుకు దోహదపడుతుంది. ఎన్ఐఆర్ఎఫ్‌లో అన్ని విద్యాసంస్థల్లో కలిపి 38వ ర్యాంకు, విశ్వవిద్యాలయాల విభాగంలో 23వ ర్యాంకు ఓయూ పొందింది. 2001లో ఐదు స్టార్‌ల గ్రేడ్, 2008లో 3.31 సీజీపీఏతో ఏ గ్రేడ్ సాధించింది.

న్యాక్ గ్రేడ్‌ల వివరాలు

సీజీపీఏ	గ్రేడ్
3.76-4.00	ఏ++
3.51-3.75	ఏ+
3.01-3.50	ఏ
2.76-3.00	బీ++
2.51-2.75	బీ+
2.01-2.50	బీ
1.51-2.00	సీ
1.50 తక్కువుంటే	డీ

(డీ గ్రేడ్ వస్తే న్యాక్ అక్రిడిటేషన్ ఉండదు)

న్యాక్ గ్రేడ్ ఇచ్చేదిలా...

న్యాక్‌లో ఏ++, ఏ+, ఏ, బీ++, బీ+, బీ, సీ గ్రేడ్‌లున్నాయి. ఏ++ గ్రేడ్ సాధించడం అంత సులువు కాదు. బోధన అంశాలకు 150 మార్కులు, బోధన, అభ్యసన, మూల్యాంకనానికి 200 మార్కులు, పరిశోధన, ఆవిష్కరణలకు 250 మార్కులు, మౌలిక వసతులకు 100 మార్కులు, విద్యార్థుల ప్రగతికి 100 మార్కులు, సుపరిపాలన, నాయకత్వ ప్రతిభకు 100 మార్కులు, విద్యాసంస్థలో విలువలు, అవార్డులకు 100 మార్కుల చొప్పున మొత్తం 1000 మార్కులుగా విభజించి న్యాక్ బృందం పరిశీలిస్తుంది. వెయ్యి మార్కులను నాలుగు క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ యావరేజ్ (సీజీపీఏ)గా కుదించి గ్రేడ్ కేటాయిస్తారు. 3.76 నుంచి 4 పాయింట్లు సాధిస్తే ఏ++, 3.51 నుంచి 3.75 పాయింట్లు సాధిస్తే ఏ+, 3.01 నుంచి 3.50 పాయింట్లు వస్తే ఏ గ్రేడ్ వస్తుంది. న్యాక్ గ్రేడ్ ఐదేండ్లపాటు ఉంటుంది. ఓయూకు వచ్చే గ్రేడ్ ఇతర విశ్వవిద్యాలయాలపై ప్రభావం చూపుతుంది. ఓయూ ఏ, ఏ+, ఏ++ గ్రేడ్ సాధిస్తేనే మనుగడ ఉంటుంది. అప్పుడే ఇతర విశ్వవిద్యాలయాలకు ఆదర్శంగా నిలుస్తుంది. లేదంటే ఓయూతోపాటు ఇతర వర్సిటీల ఉనికి ప్రశ్నార్థకమవుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సమస్యల సుడిగుండంలో నేడు

ఉస్మానియా విశ్వవిద్యాలయం సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నది. ఓయూకు రెగ్యులర్ వీసీ వచ్చి ఏడాది దాటినా ఇంతవరకూ పాలకమండలిని నియమించలేదు. దీంతో అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. ఓయూలో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉంది. అది తీరని వ్యథగా మారింది. 1267 అధ్యాపక పోస్టులు మంజూరైనవి ఉంటే సుమారు 700 వరకు ఖాళీలున్నాయి. ఇంకోవైపు పరిశోధనలు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. కాంట్రాక్టు అధ్యాపకులున్నా వారిని ఉద్యోగ అభద్రత వేధిస్తున్నది. జీతాలు పెంచుతామని ప్రభుత్వం చెప్తున్నా ఆ ఊసేలేదు. మరోవైపు నిధుల కొరత తీవ్రంగా ఉంది. అధ్యాపకులకు, బోధనేతర సిబ్బందికి జీతాలు చెల్లించడమే ఇబ్బందిగా పరిణమించింది. ఓయూ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లు ఇస్తామని చెప్పినా ఇంతవరకు రూ.50 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులుదులుపేసుకుంది. కేంద్రం నుంచి నిధుల ఊసేలేదు. వర్సిటీ నిధులతోనే కాలం వెళ్లదీస్తున్నారు. కొన్ని భవనాలు, హాస్టళ్లు శిథిలావస్థలో ఉన్నాయి. ఈ సమస్యలు న్యాక్ గ్రేడ్‌పై ప్రభావం చూపుతాయని అధికారులు ఆందోళన చెందుతున్నారు.

గతం ఎంతో ఘనం...

ఉస్మానియా విశ్వవిద్యాలయం 1917లో ప్రారంభమైంది. నాటినుంచి నేటి వరకు ఎంతో ఖ్యాతిని సంపాదించింది. పరిశోధనల్లో ప్రతిభకుగాను యూజీసీ నుంచి రూ.135 కోట్ల ప్రాజెక్టులను పొందింది. సాంకేతిక విద్యలో ప్రమాణాలు పెంచేందుకు టెకిప్-2 ద్వారా రూ.35 కోట్ల నిధులు వచ్చాయి. పరిశోధనలు పెరగడానికి కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ రూ.9 కోట్లు అందించింది. ఓయూ ఖ్యాతిని గుర్తించి యూనివర్సిటీ విత్ పొటెన్షియల్ ఫర్ ఎక్సలెన్స్ (యూపీఈ) గుర్తింపు ఇవ్వడంతోపాటు రూ.50 కోట్లు యూజీసీ 2012లో ప్రకటించింది. ఇలా అనేక కార్యక్రమాలతో విదేశీ విద్యార్థులనూ ఆకర్షిస్తున్నది. విదేశీ విద్యార్థులు ఎక్కువగా చదువుతున్న విశ్వవిద్యాలయాల్లో ఓయూ నాలుగో స్థానంలో నిలిచింది. ఓయూ 1,632 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. సువిశాల ప్రాంగణం, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, వివిధ డిపార్ట్‌మెంట్‌ల భవనాలు, హాస్టళ్లున్నాయి. డిజిటల్ లైబ్రరీ, సెంట్రల్ లైబ్రరీ వాటిలో వేలాది పుస్తకాలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. ఇలా ఓయూ విద్యాకేంద్రంగా విలసిల్లుతున్నది.

ఏ++ గ్రేడ్ సాధిస్తాం : ఎస్ రామచంద్రం, వీసీ



అందరూ సహకరిస్తున్నారు. న్యాక్ కోసం ఎనిమిది నెలలుగా కృషి చేస్తున్నాం. అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది కష్టపడి చేస్తున్నారు. పరిశోధనలు, ఉన్నత విద్యకు ఓయూ మారుపేరు. ప్లేస్‌మెంట్లు, కోకర్రికులమ్ కార్యక్రమాల్లో ముందుంది. సెలవుల్లోనూ పనిచేయడం స్ఫూర్తి కలిగిస్తుంది. తప్పకుండా ఏ++ గ్రేడ్ సాధిస్తామన్న విశ్వాసముంది.

సమాజానికీ సేవ చేస్తున్నాం : గోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్



ఓయూ విద్యాపరంగా, పరిశోధనలపరంగానే కాకుండా సమాజానికీ సేవ చేస్తున్నది. బేగంపేటలో జెనెటిక్ ఆస్పత్రి ద్వారా రోగులకు సేవలందిస్తున్నాం. మాన సిక సమస్యలున్న విద్యార్థుల కోసం అక్కడే పాఠశాల నడు పుతున్నాం. ఓయూ పక్కనే మోడల్ హైస్కూల్ ఉంది. ఇలా అనేక విధాలుగా సమాజానికి సేవ చేస్తున్నాం. న్యాక్ దీన్ని కూడా దృష్టిలో ఉంచుకొని మంచి గ్రేడ్ ఇస్తుందని ఆశిస్తున్నాం.

అందరూ సహకరించాలి : శ్రీరాం వెంకటేశ్, ఐక్యూఏసీ డైరెక్టర్



విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది అందరూ న్యాక్ బృందానికి సహకరించాలి. ఓయూ కీర్తి ప్రతిష్టల గురించి చెప్పాలి. సమస్యల గురించి ఆ బృందానికి చెప్పడం వల్ల ఉపయోగం లేదు. ఆ సమస్యలను పరిష్కరించే అధికారం ఈ బృందానికి లేదు. న్యాక్ గ్రేడ్ వచ్చేందుకు అందరూ కృషి చేయాలి. వర్సిటీ ప్రాంగణంలో పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, జెండాలు తొలగించాలి. న్యాక్ గ్రేడ్ ఓయూకే కాకుండా తెలంగాణకే ప్రతిష్టాత్మకం.

తరగతులు నిర్వహిస్తేనే మంచి గ్రేడ్



వర్సిటీలో తరగతులు నిర్వహించాలి. హాస్టల్ సౌకర్యం, మెస్ ప్రారంభిస్తేనే విద్యార్థులు తరగతులకు వస్తారు. న్యాక్ బృందం పర్యటించేటపుడు తరగతులు జరగకపోతే ఆ ప్రభావం గ్రేడ్‌పై పడుతుంది. వర్సిటీ అధికారులు విద్యావాతావరణం నెలకొల్పాలి. ఇప్పటికే అధ్యాపకుల కొరత ఉంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల తరగతులు జరగకపోవడం సరికాదు. తక్షణమే స్పందించి హాస్టళ్లు తెరిచి మెస్ ప్రారంభించి తరగతులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి.


-భట్టు సత్యనారాయణ, ఔటా అధ్యక్షుడు

బుర్కీనా ఫాసోలో ఉగ్రదాడి

20 మంది మృతి, 8మందికి గాయాలు

వాగాదువో: పశ్చిమ ఆఫ్రికాలోని బుర్కీనా ఫాసో దేశంలో ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. బుర్కీనా ఫాసో రాజధాని వాగాదువోలో ఉన్న టర్కిస్ రెస్టారెంట్‌లోకి స్థానిక కాలమాన ప్రకారం ఆదివారం 9 గంటల సమయంలో దుండగులు చొరబడి విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో 20 మంది అక్కడికక్కడే మృతిచెందగా... మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు.

మృతుల్లో వివిధ దేశాలకు చెందినవారు ఉన్నారని ఆఫ్రికన్ మీడియా వర్గాలు వెల్లడించాయి. క్షతగాత్రుల్ని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రులకు తరలించారు. ఈ దాడి కారణంగా వాగాదుగో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. ఈ ఘటనపై క్షేత్రస్థాయిలో విచారణ జరుపుతున్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ దాడికి బాధ్యత వహిస్తూ ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ ప్రకటన చేయలేదని పోలీసులు



వెల్లడించారు. బుర్కినాఫాసోలో గత రెండేళ్ల కాలంలో ఉగ్రదాడి జరగడం ఇది రెండోసారి. గతేడాది జనవరిలో ఓ కేఫ్‌పై దాడి చేసిన ఉగ్రవాదులు 30 మందిని పొట్టపెట్టుకున్నారు.

వర్జీనియా ఘటనతో భారతీయ అమెరికన్లలో ఆందోళన

చార్లట్స్‌విల్: నగరంలో జాతీయ ఉన్మాదులు చేపట్టిన ర్యాలీ హింసాత్మకంగా మారడం అక్కడ నివసించే భారతీయ అమెరికన్లపై ప్రభావం చూపుతోంది. ర్యాలీ ఘటనలో జరిగిన హింస తాలూకు వివాదం ఆదివారం నాటికి సద్దుమణిగినా, దాన్ని కళ్లారా చూసిన సగటు ఇండో-అమెరికన్ మనసులో అనేక సందేహాలు మొదలయ్యాయి.

వర్జీనియా రాష్ట్రంలో ఉన్న చార్లట్స్‌విల్ నగర జనాభా 50 వేలు. వర్జీనియా రాష్ట్రంలో స్థిరపడిన భారతీయులు సంఖ్య పెద్దగానే ఉంది. శనివారం జరిగిన ర్యాలీలో భారతీయులు ఎవరూ గాయపడలేదు. అయితే, ఇది భారతీయ అమెరికన్లకు ఓదార్పు కావడం లేదు. వారిలో ఏదో తెలియని భయం, ఏదైనా అయిపోతుందనే ఆందోళన నెలకొందని యూనివర్సిటీ ఆఫ్ వర్జీనియాలో సీనియర్ అసోసియేట్‌గా పని చేస్తున్న శంకరన్ వెంకటరామన్ పేర్కొన్నారు. చార్లట్స్‌విల్‌లో తాను గత 20 ఏండ్లుగా నివసిస్తున్నట్టు చెప్పారు. తన కూతురి స్నేహితురాలు 'జాతీయ ఉన్మాదుల'కు వ్యతిరేకంగా జరిపిన ర్యాలీలో పాల్గొనగా, హింసలో ఆమె కాలు విరిగిందని ఆయన తెలియజేశారు. హింస చార్లట్‌విల్ ప్రజల వ్యక్తిత్వం కాదని అన్నారు. ఇలాంటి



వర్జీనియా నిరసన ర్యాలీలో ప్రధాన పాత్ర పోషించిన జాతీయ ఉన్మాదుల గ్రూప్ కేకేకే(కు క్లక్స్ క్లాన్)

దురదృష్టకరమైన ఘటన జరుగుతుందని నగరవాసులు కలలో కూడా ఊహించి ఉండరని చెప్పారు.ప్రస్తుతం యూనివర్సిటీకి సెలవులు ఇచ్చారని, మరో రెండు వారాల్లో మళ్లీ తెరుస్తారని తెలిపారు. యూనివర్సిటీలో చదువుకోవడానికి వచ్చే యువతలో ఈ ఘటనపై భయాందోళనలు కచ్చితంగా ఉంటాయని అన్నారు.

ట్రంప్ వల్లే విపరీత ధోరణులు..

వర్జీనియా ఘటన అమెరికాలో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. 'మేక్ అమెరికా గ్రేట్ అగేయిన్' అన్న డొనాల్డ్ ట్రంప్ ఎన్నికల ప్రచారం, దేశంలో జాతీయ ఉన్మాదులకు మరింత బలాన్నిచ్చిందని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ట్రంప్ ఎన్నికల ప్రచార తీరు ప్రజల మధ్య చిచ్చుపెట్టిందని, దాని ఫలితంగానే ఇలాంటి ఉన్మాద ఘటనలు చోటుచేసుకుంటున్నాయని డెమొక్రట్లు, రిపబ్లికన్లు ట్రంప్‌ను విమర్శించారు. శనివారంనాటి జాతీయ ఉన్మాదుల నిరసన ర్యాలీకి కేకేకే, నియో-నాజీ, ఆల్టర్‌నేటివ్ రైట్, ఇతర జాతీయ అతివాద గ్రూపుల నాయకులు నేతృత్వం వహించారు. వీరంతా మొన్నటి అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌కు పెద్ద ఎత్తున మద్దతు పలికారు. చార్లెట్స్‌విల్లే మేయర్ మైక్ సిగ్నర్ మాట్లాడుతూ... "అతివాద గ్రూపులు, ఉన్మాదులు చీకటిలో ఉండేవారు. కానీ, ఇప్పుడు ఈ దుష్ట శక్తులు బయటకు రావడానికి కారణముంది. వీరికి బలాన్నిచ్చే వ్యక్తి అధ్యక్షుడిగా ఉన్నాడు" అని అన్నారు. 'కు క్లక్స్ క్లాన్' (కేకేకే) అతివాద గ్రూపు మాజీ నాయకుడు లూసియానా రాష్ట్ర రిపబ్లికన్ పార్టీ నాయకుడిగా ఉన్నారు. వివిధ పేర్లతో దేశంలో 1600 వరకు జాతీయ ఉన్మాద గ్రూపులు ఉన్నాయన్నది ఓ అంచనా. ఆన్‌లైన్‌లో సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో ఈ గ్రూప్ సభ్యులు తమ భావజాలాన్ని విస్తరింపజేస్తారు. వామపక్ష భావాల పట్ల వ్యతిరేకత, ఇస్లామోఫోబియాను సృష్టించటం ఈ గ్రూప్‌ల ప్రధాన లక్ష్యం.

అణు యుద్ధం రాదు

- ఆందోళన చెందాల్సిన అవసరం లేదు : సీఐఏ చీఫ్ పాంపియో
- అణు దాడి జరగొచ్చునని నిఘా ఏజెన్సీల నుంచి సమాచారం రాలేదు

వాషింగ్టన్ : అమెరికా-ఉ.కొరియా మధ్య అణు యుద్ధం తలెత్తుతుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఐఏ డైరెక్టర్ మైక్ పాంపియో చెబుతున్నారు. అయితే ఉ.కొరియా తీరును విమర్శిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న బెదిరింపుల్ని ఆయన సమర్థించారు. తప్పనిసరి పరిస్థితుల్లో అది జరగొచ్చన్న సందేశం ట్రంప్ మాటల్లో ఉందిని పాంపియో చెప్పారు. ఆదివారం 'ఫాక్స్' న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పాంపియో మాట్లాడుతూ..."అమెరికాపై ఉ.కొరియా అణు క్షిపణి ప్రయోగిస్తుందన్న వార్తలు ఒట్టి పుకార్లు మాత్రమే. అణు యుద్ధం అంచుల్లో ఇరు దేశాలున్నాయన్న ప్రచారంలోనూ నిజం లేదు. ఉ.కొరియా అణు దాడి జరుపుతుందని నిఘా ఏజెన్సీల నుంచి ఎలాంటి సమాచారమూ రాలేదు" అని అన్నారు.

అయితే ట్రంప్ చేసిన ప్రకటనలు ఉ.కొరియా వివాదాన్ని మరింత పెద్దది చేశాయి కదా ? అన్న ప్రశ్నకు సమాధానంగా...ఉ.కొరియా అణు కార్యక్రమం నిలిపివేయాలన్న ఉద్దేశంతో నే ట్రంప్ అలాంటి వ్యాఖ్యలు చేశారని పాంపియో సమర్థించారు. అణు



క్షిపణి ప్రయోగాల్ని, ఖండాంతర క్షిపణి అభివృద్ధి కార్యక్రమాన్ని ఉ.కొరియా నిలిపివేయాలన్నదే ట్రంప్ ఉద్దేశమని ఆయన చెప్పారు.

అందరిలో భయాన్ని నింపే ఎత్తుగడ : రష్యా

అమెరికా-ఉ.కొరియా మధ్య నెలకొన్న మాటల యుద్ధాన్ని రష్యా తీవ్రంగా తప్పుబట్టింది. ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మారియా జక్రోవా మాట్లాడుతూ..."ఇరు దేశాలూ ఒకదాన్ని మరోటి కావాలని గిచ్చుకుంటున్నాయి. ఉద్రిక్తతలను రాజేసుకుంటున్నాయి. యుద్ధంతో తేల్చుకోవాల్సిందేనన్న వాతావరణాన్ని తీసుకొచ్చారు. అందరిలో భయాన్ని నింపే ఎత్తుగడను వాషింగ్టన్ అమలుజేస్తున్నది. ఉద్రిక్తతలను తీసుకొచ్చినవారు రేపటి రోజున అమెరికా ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. కేవలం ఉ.కొరియా ప్రజల గురించేకాదు, ద.కొరియా ప్రజల గురించి కూడా అమెరికా సెనెటర్లు ఆలోచించాలి" అని ఆమె అన్నారు.

కొండచరియలు విరిగిపడి 179 మృతి!



- సియార్రా లియోన్‌లో ఘోర దుర్ఘటన


ఫ్రీటౌన్ : సియార్రా లియోన్ రాజధాని ఫ్రీటౌన్‌కు సమీపంలో కొండచరియలు విరిగిపడి కనీసం 179 మంది ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చునని రెడ్ క్రాస్ తెలిపింది. గతకొన్ని రోజులుగా దేశంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడుతున్నాయి. సోమవారం తెల్లవారుజామున ఫ్రీటౌన్ సమీపంలో చోటుచేసుకున్న ప్రమాద ఘటనల్లో వందలాది చనిపోయివుండొచ్చునని సియార్రా లియోన్ దేశ ఉపాధ్యక్షుడు విక్టోర్ బాకరీ ఫో ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రతి ఉగ్రవాదినీ ఉరితీస్తాం

- పాక్ సైన్యాధ్యక్షుడు జావెద్ బజ్వా

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో ఉన్న ప్రతి ఉగ్రవాదినీ ఉరితీస్తామని ఆ దేశ సైన్యాధ్యక్షుడు కమర్ జావేద్ బజ్వా అన్నారు. పాక్ శత్రు దేశాలకు ఆయన ఓ హెచ్చరిక చేశారు. తూర్పు లేదా పశ్చిమ దేశాలు ఏవైనా.. వారి బుల్లెట్లు అయిపోవాలే తప్ప తమ సైనికుల గుండెల్లోకి చొచ్చుకుపోలేవన్నారు. ఏ శక్తీ తమ లక్ష్యాన్ని బలహీనపర్చలేదని, శత్రుదేశాలు చేసే ఎలాంటి ప్రయత్నాలనైనా తమ దేశ సైన్యం, ఇతర సంస్థలు విఫలం చేస్తాయని స్పష్టంచేశారు. పాకిస్థాన్ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయన భారీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పాకిస్థాన్ 70వ స్వాతంత్ర్య దినోత్సవానికి సంకేతంగా భారత్‌తో పాక్‌సరిహద్దు అట్టారి-వాఘా వద్ద సుమారు 400 అడుగుల ఎత్తులో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

ఈ సందర్భంగా ఆర్మీ చీఫ్ బజ్వా మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధంగా తమ దేశం అభివృద్ధి వైపు అడుగులు



వేస్తున్నదని చెప్పారు. దేశానికి ఎన్ని సవాళ్లు ఎదురవుతున్నా...వాటిని అధిగమిస్తూ ముందుకెళు తున్నామన్నారు. దేశ ప్రజలు ఎన్నో త్యాగాలు చేశారని, అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ మరచిపోలేమన్నారు.

స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలి


● నేరెళ్ల ఘటనపై గవర్నర్‌ను కలిసిన కాంగ్రెస్, టిడిపి, సీపీఐ, బీజేపీ, ఆప్, టీజేఏసీ నేతలు ● అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నేరెళ్లలో దళితులు, బీసీలపై థర్డ్‌డిగ్రీ ప్రయోగించి చిత్ర హింసలకు గురి చేసిన ఎస్పీ సహా బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్‌కు కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ, బీజేపీ, ఆప్ పార్టీలు, టీజేఏసీ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయనకు వారు వినతిపత్రం అందించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నేరెళ్లలో ఇసుక లారీని దహనం చేసిన కేసులో దళిత, బీసీ సామాజిక వర్గాలకు చెందిన 8 మందిని అరెస్ట్ చేసి చిత్రహింసలకు గురి చేసిన సంగతి తెలిసిందే. 40 రోజులు గడిచినా.. ముఖ్య బాధ్యుడైన ఎస్పీ విశ్వజిత్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా, ప్రభుత్వం ఒక ఎస్సైని సస్పెండ్ చేసింది. బాధ్యులపై అట్రాసిటీ కేసు నమోదు చేయలని డీజీపీని ఆదేశించాలని కోరారు. ఈ ఘటనపై స్వతంత్ర దర్యాప్తు సంస్థతో దర్యాప్తు జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. బాధితులకు పరిహారం అందించడంతో పాటు భద్రత కూడా కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.


విలేకర్లతో మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

రాష్ట్రంలో మానవ హక్కుల ఉల్లంఘన; ఉత్తమ్



కేసీఆర్ పాలనలో మానవ హక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతున్నదని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంలో గిరిజన రైతులకు బేడీలు వేయడంతోనే ఈ ప్రభుత్వ వైఖరి తేటతెల్లమైందన్నారు. సిరిసిల్ల జిల్లాలో ప్రమాదానికి కారణమైన ఇసుక లారీలను బాధితులు దహనం చేయడంతో, వారిని అరెస్ట్ చేసి థర్డ్‌డిగ్రీ ప్రయోగించారని తెలిపారు. థర్డ్‌డిగ్రీ ప్రయోగించి టార్చర్ చేసిన ఎస్పీపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. బాధితులకు మంత్రి కేటీఆర్ క్షమాపణ చెప్పాలని, పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22, 22 తేదీల్లో నేరెళ్ల ఘటనపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.

ధన దోపిడీకి పాల్పడుతున్న కేసీఆర్ కుటుంబం; ఎల్ రమణ



ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం మొత్తం ధనాన్ని దోపిడీ చేస్తోందని టీడీపీ అధ్యక్షుడు ఎల్ రమణ ఆరోపించారు. ఇసుక మాఫియాలో కేసీఆర్ కుటుంబమే ఉందన్నారు. మంత్రి కేటీఆర్‌కు నైతికత ఉంటే వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తున్న సర్కారు; కోదండరామ్


నేరెళ్ల ఘటనపై చట్టాన్ని యథేచ్ఛగా సర్కారు ఉల్లంఘిస్తోందని జేఏసీ చైర్మెన్ కోదండరామ్ విమర్శించారు. కొద్దిమంది ఇసుక మాఫియా కోసం చట్టాన్ని పూర్తిగా పక్కకు పెడుతున్నారని తెలిపారు. దళితులపై దాడి జరిగినా.. సర్కారు నుంచి స్పందన రాలేదని, ఇదే విషయాన్ని గవర్నర్‌కు తెలిపామని చెప్పారు.

దమ్ముంటే విచారణ జరిపించాలి; చాడ వెంకటరెడ్డి




థర్డ్‌డిగ్రీ ప్రయోగించని ఎస్పీపై ఎందుకు చర్యలు తీసుకోలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ప్రశ్నించారు. ఎస్పీ విశ్వజిత్‌పై అట్రాసిటీ కేసు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఏం జరగలేదంటూ చెప్పిన కేటీఆర్‌కు దమ్ముంటే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

18 మంది పోలీసులు ఉన్నారు : పీఎల్



నేరెళ్లలో దళితులను చితకబాదిన ఘటనలో ఎస్పీ సహా 18 మంది పోలీసులున్నారని ఆప్ అధ్యక్షుడు పీఎల్ విశ్వేశ్వర రావు తెలిపారు. వీరందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసునమోదు చేయాలని డిమాండ్ చేశారు.

బాధ్యులపై చర్యలేవీ; లక్ష్మణ్



నేరెళ్లలో దళిత, బీసీ యువకులపై థర్డ్‌డిగ్రీ ప్రయోగించిన వారిపై చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్సీ కమిషన్ ఆదేశించినా ఎందుకు తీసుకోలేదని బీజేపీ అధ్యక్షుడు కే లక్ష్మణ్ ప్రశ్నించారు. నేరెళ్లలో పోలీసులు దమనకాండకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు.

బాధితులను కేసీఆర్ పరామర్శించాలి; మోత్కుపల్లి



నేరెళ్ల బాధితులను ముఖ్యమంత్రి కేసీఆర్ పరామర్శించాలని, వారికి సాయం చేయాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు డిమాండ్ చేశారు. బాధితులను నేరస్తులుగా చూసి, ఇష్టమొచ్చి నట్టు చితకబాదారని తెలిపారు.

మోడల్‌స్కూల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, గెస్ట్‌టీచర్లకు పెంచిన వేతనాలు చెల్లించాలి

● టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్, గెస్ట్‌టీచర్లకు పెంచిన వేతనాలను వెంటనే చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో మోడల్‌స్కూల్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్, గెస్ట్‌టీచర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన చావ రవి మాట్లాడుతూ... మోడల్ స్కూల్ ఔట్‌సోర్సింగ్, గెస్ట్‌టీచర్లను రెగ్యులర్ చేయాలని కోరారు. కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలు, కస్తూర్బా, మోడల్‌స్కూల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసినట్టుగానే ఔట్‌సోర్సింగ్, గెస్ట్‌టీచర్ల సమస్యల పరిష్కారం కోసం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాలను చేపడుతామని అన్నారు. దీనికి మోడల్‌స్కూల్ టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది సమాయత్తం కావాలని కోరారు. టీఎస్ఎంఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బి.కొండయ్య మాట్లాడుతూ...జీవోనెంబర్ 14 ప్రకారం ఔట్ సోర్సింగ్, మోడల్‌స్కూల్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. గెస్ట్‌టీచర్లకు పిరియెడ్‌కు రూ.140 చెల్లించాలని అన్నారు. సమావేశంలో టీఎస్ఎంఎస్‌టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెరిక జగన్, టీఎస్ఎంఎస్ఓఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎ.యాదగిరి, ఎం.సతీష్, జి.మమత, బి.ప్రశాంత్, వీరస్వామి, నవీన్, కైలాస్, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'ప్రయివేటు ట్రావెల్స్‌తో అధికారుల కుమ్మక్కు'

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రయివేటు ట్రావెల్స్ యాజమాన్యాలతో రవాణా శాఖ అధికారులు కుమ్మక్కు అయ్యారని, అందుకోసమే ఏపీకి చెందిన ప్రయివేటు ట్రావెల్స్‌ను నియంత్రించలేకపోతున్నారని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు.. ఈ అంశంపై అసెంబ్లీలో పలుమార్లు ప్రస్తావించినా ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రయివేటు ట్రావెల్స్‌కు ఆన్‌లైన్ బుకింగ్‌ను ఎలా అనుమతిస్తారని రవాణ శాఖ కమిషనర్, జాయింట్ కమిషనర్‌లను ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం ఆయన సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రయాణికుల ప్రాణాలను హరిస్తున్న ప్రయివేటు ట్రావెల్స్‌ను నియంత్రించడంలో రవాణా శాఖ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రయివేటు బస్సుల్లో సిట్టింగ్ కెపాసిటీ, ఇంజన్ కెపాసిటీలకు మించి ప్రయాణికులను ఎక్కిస్తున్నందుకే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అన్ని ప్రయివేటు బస్సుల్లో అదనపు కెపాసిటీకి మించి సీట్లను బిగిస్తున్నా అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రయివేటు వాహనాల వల్లనే ఆర్టీసీ సంస్థ నష్టాల్లో కూరుకుపోతుందన్నారు. ఆర్టీసీ లాభాల్లో నడవాలంటే ప్రయివేటు వాహనాలను కట్టడి చేయాలని తెలిపారు. పండుగ సందర్భాల్లో ప్రయాణికుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేస్తున్నా రవాణ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.

ప్యాక్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : ఎఐటీయూసీ

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

ప్యాక్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని (ఎఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు టి. నరసింహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం ఏఐటీయుసీ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నరసింహన్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ ఇవ్వడంతోపాటు త్రిసభ్య కమిటీ వేసినందుకు అభినందనలు చెప్పారు. సాధ్యమైనంత తొందరగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కమిటీ కృషి చేయాలని కోరారు. ఈసమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యండీ. షరీఫ్, ఉప ప్రధాన కార్యదర్శి విప్పా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు రాంబాబు, శంకరయ్య, అనంతరెడ్డి పాల్గొన్నారు.

కోర్టు తీర్పు మేరకు పనిచేయని కాలానికి జీతం ఇవ్వాల్సిందే : హైకోర్టు

నవతెలంగాణ- హైదరాబాద్

ఉద్యోగులపై ఆరోపణలు వచ్చినప్పుడు వారిని విధుల నుంచి తొలగింపు చర్యలు సరికాదని కోర్టులు తేల్చితే ఆ ఉద్యోగి పనిచేయని కాలానికి కూడా జీతం, ఇంక్రిమెంట్లు ఇవ్వాలని హైకోర్టు న్యాయమూర్తి పి.నవీన్‌రావు తీర్పు చెప్పారు. నిజామాబాద్ జిల్లా వేల్పూరు మండలం అమీనాపూర్‌కు చెందిన ఆర్టీసీ డ్రైవర్ కె.నర్సయ్య హన్మకొండ-నిజామాబాద్ దారిలో ప్రమాదానికి అతివేగంతోపాటు నిర్లక్ష్యం కూడా కారణమని పేర్కొంటూ అతన్ని ఆర్టీసీ యాజమాన్యం విధుల నుంచి తొలగించింది. డ్రైవర్‌పై పోలీసులు పెట్టిన క్రిమినల్ కేసును కామారెడ్డి కోర్టు కొట్టివేసింది. హైదరాబాద్ లేబర్ కోర్టులో డ్రైవర్ పెట్టిన కేసులో ఆర్టీసీ యాజమాన్య చర్యను సవాల్ చేస్తే ఆయనకు అనుకూలంగానే నిర్ణయం వెలువడింది. బాపట్ల డిపోలో ఉద్యోగి సురేష్‌బాబు మెడికల్ లీవ్ పేరుతో వారం రోజులపాటు విధులకు హాజరుకాలేదు. తర్వాత విధులకు హాజరైనప్పుడు మెడికల్ ధవపత్రం, ఫిట్‌నెస్ పత్రం సమర్పించారు. అయితే విధులకు డుమ్మా కొట్టాడని చెప్పి విధుల నుంచి తొలగించడాన్ని గుంటూరు లేబర్ కోర్టు తప్పుపట్టింది. ఈ రెండు వేర్వేరు కేసుల్లో వారికి అనుకూలంగా కింది కోర్టులు తీర్పులు వెలువడ్డాక తిరిగి విధుల్లోకి చేరినా పనిచేయనికి కాలానికి జీతం చెల్లించలేదు. వారు హైకోర్టులో వేసిన వ్యాజ్యాల్ని విచారించిన న్యాయమూర్తి.. తప్పు చేశారన్న ఆరోపణలపై విధుల నుంచి తొలగించారు. కానీ ఆరోపణలు నిరూపణ కాలేదు. కాబట్టి వారికి సుప్రీంకోర్టు గతంలో వెలువరించిన తీర్పు మేరకు తొలగింపునకు గురైన కాలానికి జీతం, ఇంక్రిమెంట్లు చెల్లించాలి.. అని తీర్పు చెప్పారు.

కేసీఆర్‌పై కేసు పెట్టాలి : చెరుకు సుధాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



కమ్యూనిస్టులను, ప్రజా సంఘాలను 'నా కొడుకులు' అని దుర్భాషలాడిన కేసీఆర్‌పై కేసు నమోదు చేయాలని తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షులు చెరుకు సుధాకర్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న ఆ వ్యక్తే అలాంటి వ్యాఖ్యలు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇది కేవలం రాజకీయ పరిభాషకు సంబందించినది మాత్రమే కాదని, పార్లమెంటరీ కనీస సాంప్రదాయనికి కూడా విరుద్ధమని వ్యాఖ్యానించారు. ప్రత్యేక రాష్ట్రం కోసం కేసీఆర్ 15 ఏండ్ల నుంచి కాలికి బలపం కట్టి తిరిగానని ప్రచారం చేసుకుంటున్నారని.. అంతకు ముందే తాము తెలంగాణ కోసం కొట్లాడామని..ఆ సమయంలో కేసీఆర్ అనే నా కొడుకు ఎక్కడ పడుకున్నాడని నిలదీశారు. హైదరాబాద్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సోమవారం చెరుకు సుధాకర్ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బలమైన ప్రతిపక్షం రావాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని సామాజిక వర్గాలు మాత్రమే రాజకీయాల్లో చెలామణి చేస్తున్నాయని.. భూస్వామ్య భావజాలం, అహకారం దృక్పథంతో వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గద్దె నుంచి దించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రజలు ఎన్నుకున్నారు కాబట్టి తమది దొరల ప్రభుత్వమేనని చెప్పడం అహంకారానికి నిదర్శనమన్నారు. నేరెళ్ల ఘటనపై సీఎం వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. దళితులు అని ముఖం మీద బోర్డు రాసిపెట్టి ఉంటదా అని సీఎం అన్నారు. నేరెళ్లలో మనుషులను తొక్కి చంపే లారీల ముఖంలో మాత్రం కేటీఆర్, హరీష్‌రావు బోర్డు రాసిపెట్టి ఉంటుందని విమర్శించారు. రాజ్యాంగం అందరికీ ఒకేలా ఉంటుందని, చట్టానికి విరుద్ధంగా మనుషులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి దాడులు చేసే అధికారం పోలీసులకు లేదన్నారు. ప్రొఫెసర్ కోదండరాం టీ జేఏసీ కాకుండా మనసులో మాట బయటపెట్టాలన్నారు. ప్రజా గాయకుడు గద్దర్ ఇటీవల సామాజిక న్యాయం కోసం పోరాడతానని చెప్పారని గుర్తుచేశారు. రాష్ట్రంలో వ్యవస్థను చక్కదిద్దాల్సిన బాధ్యత పార్టీలు, ప్రజలపై ఉందన్నారు. ఆటగాళ్లే కాదు... ఆట పద్ధతి కూడా మారాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. రాష్ట్రం వచ్చి మూడేండ్లు అయినా సమైక్య రాష్ట్రంలో ఉన్న సమస్యలే దర్శనమిస్తున్నాయని విమర్శించారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఐఏఎస్ అధికారి కరుణకు విశిష్ట పురస్కారం

● ఇద్దరు ఐపీఎస్‌లు, ఒక ఐఎఫ్ఎస్‌కు కూడా
● నేడు ముఖ్యమంత్రి చేతులమీదుగా అవార్డుల ప్రదానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాహిత కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్న ఆలిండియా సర్వీసెస్ అధికారులను సన్మానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఒక ఐఎఎస్, ఇద్దరు ఐపీఎస్‌లు, ఒక ఐఎఫ్ఎస్ అధికారిని విశిష్ట పురస్కారాలకు ఎంపికయ్యారు. కేసీఆర్ కిట్స్ పథకాన్ని విజయవంతం చేయడంలోనూ, ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరును మెరుగుపరచడంలో విశేష కృషి చేస్తున్న సీనియర్ ఐఎఎస్ అధికారిణి వాకాటి కరుణను విశిష్ట సేవలందించిన ఐఎఎస్‌గా గుర్తించారు. అలాగే, సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల ను సమర్థవంతంగా నడుపుతూ ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దుతు న్న ఐపీఎస్ అధికారి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్, పౌర సరఫరాల వ్యవస్థను మెరుగు పరిచేందుకు విశేష కృషి చేస్తున్న సీవీ ఆనంద్‌ను ఈ అవార్డులకు ఎంపికయ్యారు. మైనారిటీ గురుకుల పాఠశాలలను విజయవంతంగా నిర్వహిస్తున్న ఎండీ షఫివుల్లాను ఐఎఫ్ఎస్ అధికారుల కేటగిరిలో ఎంపిక చేశారు. వీరందరినీ మంగళశవారం గోల్కొండ కోటలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు సత్కరించనున్నారు.

మంత్రి లక్ష్మారెడ్డి అభినందనలు

స్వాతంత్ర్య దినోత్సవం రోజు అవార్డులు దక్కించుకోనున్న పలువురు అధికారులకు రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి అభినందనలు తెలి పారు. విశిష్ట పురస్కారానికి ఎంపికైనా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిష నర్ వాకాటి కరుణకు ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. వైద్యశాఖలో ఆమె చేస్తున్న సేవలను కొనియాడారు. కరుణను ఆదర్శంగా తీసుకొని మిగతా అధికారులు కూడా బాగా పని చేయాలని కోరారు. అదే విధంగా, అవార్డుల్లో ఉస్మానియాకు చెందిన డాక్టర్ చింతకింది మధుసూదన్, నర్సుల విభాగంలో అంజమ్మకు అవార్డులు దక్కడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డులు తమ శాఖ పనితీరుకు అద్దం పడుతున్నా యన్నారు. మిగతా అధికారులకు మంచి ప్రోత్సాహకంగా ఉంటుందని, అవార్డులు పొందిన అధికారులపై బాధ్యతలు మరింత పెరిగాయన్నారు.

డాక్టర్ విజయకుమార్ మృతికి తమ్మినేని సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపకులు మద్దికాయల ఓంకార్ పెద్ద కుమారుడు డాక్టర్ విజయ్ కుమార్ మృతిపట్ల సీపీఐ(ఎం) ఒక ప్రకటనలో తీవ్రసంతాపాన్ని ప్రకటించింది. ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ రాష్ట్రకార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ట్రంప్ చర్యలతో మానవాళిలో ఆందోళన : ఎంసీపీఐ(యూ)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అమెరికా సామ్రాజ్యవాద కాంక్ష రోజురోజుకీ పెరుగుతున్నదని ఎంసీపీఐ (యు) ఆందోళన వ్యక్తం చేసింది. ఆయుధాల ఉత్పత్తి, వాటి అమ్మకాన్ని మరింతగా పెంచుకునేందుకు వీలుగా ఆ దేశం స్వయం సమృద్ధి సాధిస్తున్న దేశాలపై యుద్ధ బెదిరింపులకు పాల్పడుతున్నదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎమ్‌డీ గౌస్ అన్నారు. కేరళ రాజధాని త్రివేండ్రంలో జరిగిన ఎంసీపీఐ (యు) కేంద్ర కమిటీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ... ఉత్తర కొరియా, వెనిజులా తదితర దేశాల సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేందుకు అమెరికా కుట్రలు పన్నుతున్నదని చెప్పారు. ఇదే సమయంలో సరిహద్దు దేశాలైన భారత్, పాక్, చైనాల్లో పరస్పర ఘర్షణ వాతావరణం నెలకొనటం అత్యంత ఆందోళనకరమని వ్యాఖ్యానించారు. పరస్పర చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఎంసీపీఐ (యు) తెలంగాణ కార్యదర్శి తాండ్రకుమార్, రాష్ట్ర నాయకులు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, వనం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి న్యాయం చేస్తాం

● 'నవతెలంగాణ' కథనానికి పోలీసుల స్పందన

నవతెలంగాణ-వేములవాడ రూరల్

బంధువుల బహిష్కరణకు గురైన బాధితురాలికి న్యాయం చేస్తామని వేములవాడ రూరల్‌ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం మల్లారం గ్రామంలో ఓ దళితురాలికి అండగా నిలిచిన మరో ఉన్నతవర్గం మహిళను బహిష్కరించిన కథనాన్ని నవతెలంగాణ సోమవారం ప్రచురించిన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన వేములవాడ రూరల్ ఎస్ఐ రాజశేఖర్ ఆ గ్రామాన్ని సందర్శించారు. బాధితురాలు, ఆమె బంధువులను విచారించారు. కేసు పూర్వపరాలు పరిశీలించి బాధితురాలికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

పోలీసుల తీరును తప్పుపట్టిన హైకోర్టు

నవతెలంగాణ-హైదరాబాద్

కిడ్నాప్‌లు, పిల్లల తారుమారు, బ్రూణహత్యలు, హత్యలు, అత్యాచారాలు, రోడ్డు ప్రమాదాలు వంటి కీలక కేసుల్లో ముఖ్య ఆధారాలైన గోళ్లు, వెంట్రుకలు, రక్తం, కణాల సేకరణ చేయకపోవడంపై హైకోర్టు పోలీసుల తీరును తప్పుపట్టింది. ఇలాంటి కీలక కేసుల్ని విచారించే కింది స్థాయి పోలీసులకు తగిన ఆదేశాలివ్వాలని తెలుగు రాష్ట్రాల డీజీపీలను హైకోర్టు న్యాయమూర్తులు పి.వి.సంజయ్‌కుమార్, షమీమ్ అక్తర్‌లతో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. అత్తను హత్య చేశాడన్న కేసు నుంచి వరంగల్ జిల్లా భీమారంకి చెందిన గోపు శ్రీనివాస్‌రెడ్డి (పరందామ్)కు కింది కోర్టు జీవితఖైదు శిక్షను హైకోర్టు రద్దు చేసింది. తన అత్త బి.లక్ష్మీని రంగసాయిపేటలోని ఒక ఫార్మసీ కాలేజీ దగ్గర్లోని బావిలో శ్రీనివాస్‌రెడ్డి తోసి చంపేశారన్నది పోలీసుల కేసు. లక్ష్మి మతదేహం బావిలో తేలుతూ నెలరోజులకు గుర్తుపట్టలేని పరిస్థితిలో గుర్తించారు. ఆమె లక్ష్మేనన్న ఆధారాలు సేకరించలేదు. ఆమె శరీరంపై నమూనాలు కూడా సేకరించలేదు. కేవలం ఆమె తన తల్లేనని కుమార్తె చెప్పిన సాక్ష్యాన్ని ఆధారంగా చేసుకుని లక్ష్మే హత్యకు గురైందని కింది కోర్టు నిర్ధారించడం చెల్లదు. దేని ఆధారంగా తన తల్లి మతదేహమని చెప్పిందో పోలీసులు నమోదు చేయలేదు. మతదేహం ఎవరిదో ఆధారాలు లేకుండా పోయాయి. "ఈ కేసును దర్యాప్తు చేసిన అధికారులు హతురాలి నుంచి గోళ్లు, వెంట్రుకల వంటి నమూనాలు సేకరించలేదు. వాటిని సేకరించి ఉంటే మతురాలి బంధువల ద్వారా డీఎన్ఏ పరీక్ష నిర్వహించి ఆమెను గుర్తించేందుకు వీలయ్యేది. ఈ కేసులో ప్రత్యక్ష సాక్ష్యాధారాలు లేవు. కేవలం డీఎన్ఏ ద్వారానే ఆమెను గుర్తించాల్సివుంది. అయితే దర్యాప్తు అధికారులు మతదేహం నుంచి నమూనాలు తీసుకోలేకపోవడంతో ఆమె ఎవరో గుర్తించలేకపోయారు. ఇకపై రెండు తెలుగు రాష్ట్రాలు ఇలాంటి కేసుల్లో నమూనాలు సేకరిస్తే డీఎన్ఏ పరీక్ష ద్వారా మ తదేహాల్ని గుర్తించేందుకు కీలకం అవుతాయి. ఈ తీర్పు ప్రతిని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల డీజీపీలకు అందలే హైకోర్టు రిజిస్ట్రీ చర్యలు తీసుకోవాలి.." అని డివిజన్ బెంచ్ తన తీర్పులో పేర్కొంది.

జాతికి ఇదొక్కటే పండుగ : పవన్

హైదరాబాద్ : జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ దేశ ప్రజలందరికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వ్యక్తులకు సంబంధించి భిన్నమైన పర్వదినాలు ఉండవచ్చుకానీ..జాతికి సంబంధించి ఇదొక్కటే పండుగ రోజు. మన దేశ ప్రజలందరికీ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు అని ట్వీట్ చేశారు.

క్షేమంగా వెళ్లిరండి : హజ్‌యాత్ర ప్రారంభంలో డిప్యూటీ సీఎం

నవతెలంగాణ-శంషాబాద్

హజ్‌యాత్ర దిగ్విజయంగా ముగించుకుని క్షేమంగా స్వదేశానికి తిరిగి రావాలని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ ఆకాంక్షించారు. ఆదివారం రాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి హజ్‌యాత్రకు బయలుదేరే వారిని హజ్‌టెర్మినల్ వద్ద జెండా ఊపి సాగనంపారు.


13 మంది పోలీసు అధికారులు,సిబ్బందికి రాష్ట్రపతి పోలీసు పతకాలు

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను రాష్ట్రానికి చెందిన 13 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ సోమవారం రాష్ట్రపతి పోలీసు పతకాలను ప్రకటించింది. ఇందులో ఇద్దరికి అత్యున్నత రాష్ట్రపతి పోలీసు పతకాలు (పీపీఎం), 11 మందికి ఇండియన్ పోలీసు పతకాలు(ఐపీఎం) లభించాయి. రాష్ట్రపతి పోలీసు పతకాలు పొందిన వారిలో రాష్ట్ర పౌరసరఫరాల విభాగం కమిషనర్, అదనపు డీజీ సీవీ ఆనంద్, మెట్రో రైల్ విభ్యాగం అదనపు డీసీపీ బాలకృష్ణలు ఉన్నారు. ఇక ఇండియన్ పోలీసు మెడల్స్ పొందిన వారిలో చిక్కడపల్లి ఏసీపీ జె.నర్సయ్య,ఏసీబీ మహబూబ్‌నగర్ డీఎస్పీ ఎం.భ్రాకర్, ఇంటెలిజెన్స్ డీఎస్పీ హైదరాబాద్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి, సీటీసీ పేట్లాబుర్జు ఏసీపీ పి.గిరిరాజు, కౌంటర్ ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీమతి పీ ఆర్ రాజేశ్వర్ లక్ష్మీ, గ్రేహౌండ్స్ ఆర్ఐ సి.భూపాల్‌రెడ్డి, వరంగల్ ఏఎస్ఐ సిటీ బి.మహేందర్, కరీంనగర్ టీఎస్ఎస్పీ ఏఆర్ఎస్ఐ టీ. ప్రభాకర్, ఇంటెలిజెన్స్ సీటీ హెడ్ కానిస్టేబుల్‌ఎం. రఘుపతిరావు, హెడ్ కానిస్టేబుల్ ఎస్ఏఆర్ సీపీఎల్ అంబర్‌పేట్ మహ్మద్ ఖైరుద్దీన్, కౌంటర్ ఇంటెలిజెన్స్ సిటీ హెడ్ కానిస్టేబుల్ జీవానందం.

లెదర్ పార్క్ ఉట్టిమాటే

● రెండు వేల మందికి ఉపాధి లేనట్టే
● ప్రతిపాదిత స్థలంలో డంపింగ్ యార్డు
● మూడు దశాబ్దాలుగా మోచీలపై స్పందించని నేతలు



నవతెలంగాణ-బీర్కూర్ విలేకరి

దారిద్ర్య రేఖకు దిగువనున్న దళితులు, మోచీలకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేయాలనుకున్న లెదర్ పార్క్ ఆశలకు సర్కారు గండికొట్టింది. మూడు దశాబ్దాలుగా దళితులు పోరాడుతున్నా ప్రభుత్వాలు పెడచెవిన పెట్టేశాయి. నిరుద్యోగ యువత గురించి అసలే పట్టించుకోకపోగా ఫలితంగా విదేశాలకు వలసెళ్లే వారి సంఖ్య ఎక్కువైంది. ఇటీవలే నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలో తోలు పరిశ్రమకు సర్కారు పచ్చజెండా ఊపగా.. ఏండ్ల తరబడి నిరీక్షిస్తున్న బాన్సువాడవాసులకు మళ్లీ నిరాశే ఎదురైంది. కేటాయించిన స్థలంలో ఇప్పటికే కబ్జాల పర్వం మొదలవగా... ప్రస్తుతం మంత్రి ఆదేశాల మేరకు అక్కడ డంపింగ్ యార్డు ఏర్పాట్లు కొనసాగుతుండటం స్థానికులను ఆవేదనకు గురిచేస్తోంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన బాన్సువాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో సుమారు 500 పైగా మోచీ కుటుంబాలున్నాయి. ఒక్క బాన్సువాడ పట్టణంలోనే 70కిపైగా కుటుంబాలున్నాయి. 250 మందికిపైగా చెప్పులు కుట్టే పనిపై ఆధారపడ్డారు. రోజంతా కష్టపడ్డా వారికి వచ్చే ఆదాయం రూ.50 నుంచి వందలోపే. జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని మొత్తం జనాభాలో దాదాపు 30 శాతం మోచీలున్నారు. వీరంతా మహారాష్ట్ర నుంచి వలసొచ్చారు. 30 ఏండ్లుగా స్థానికంగా లెదర్ పార్క్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో అప్పటి నిజామాబాద్ జిల్లాలోని బాన్సువాడలో లెదర్ పార్క్ ఏర్పాటు చేస్తామని సర్కారు హామీనిచ్చింది. 2004లో బాన్సువాడ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ చొరవతో మోచీ, మాదిగ ఉపకులాల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు శ్రీకారం చుట్టింది. బాన్సువాడ మండలానికి కూతవేటు దూరంలోని తాడ్కోల్ గ్రామం దాల్‌మాల్‌కుచ్చ గల శివారులోని సర్వే నెంబర్ 312/2లో 25 ఎకరాల ప్రభుత్వ భూమిని లెదర్ పార్కుకు కేటాయించారు. దీంతో స్థానికుల్లో ఆశలు చిగురించినా తదనంతరం దాన్ని పట్టించుకునే నాథుడే లేకపోయాడు. దీంతో ఉపాధి సరిగ్గా లేక మరికొందరు గల్ఫ్ లేదా ఇతర ప్రాంతాలకు వలసెళ్తున్నారు. బాన్సువాడలో లెదర్ పార్క్ నిర్మిస్తే నిజామాబాద్, కామారెడ్డి జిల్లావాసులకు, మోచీలకు స్వయం ఉపాధితో పాటు జీవన ప్రమాణాలు మెరుగుపడే అవకాశాలున్నాయి. నిరుద్యోగ యువతకూ కాస్తోకూస్తో కష్టాలు తొలగుతాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా మొత్తం 2వేల మందికి ఉపాధి కలిగే అవకాశం ఉంది.


మార్పు పథకం కనుమరుగు..

2004లో బాన్సువాడకు లెదర్ పార్క్ రానుందని అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఇందిరా క్రాంతి పథకం ద్వారా మాదిగలకు చెప్పుల తయారీలో నూతన పద్ధతులు, జాగ్రత్తలపై వివరించారు. ఒక్కో బ్యాచ్‌లో 80 మంది చొప్పున 3 నెలల పాటు యువతకు శిక్షణ అందించారు. ఇలా ఏడాది పాటు కొనసాగింది. ఇతర సదుపాయాల కోసం ఎస్సీ లీడ్‌క్యాప్ పథకం ద్వారా రూ. 2 కోట్లు కేటాయించారని ప్రచారం జరిగినా దానిపై ఎవరికీ స్పష్టత లేకపోయింది. తోలు పరిశ్రమతో చెప్పులు, బెల్టులు, బ్యాగులు తయారు చేసుకుంటూ తమ జీవితాల్లో వెలుగులు నింపుకోవచ్చునని మోచీలు ఆనందపడ్డారు. కానీ, వారి ఆనందం కొన్నాండ్లకే పరిమితమైంది. పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఏడాది క్రితం మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి వినతిపత్రం అందించినా ఫలితం లేకపోయింది.

డంపింగ్ యార్డుకు మంత్రి ఆదేశం


తోలు పరిశ్రమ కోసం ప్రభుత్వం కేటాయించిన 25 ఎకరాల్లో ఇప్పటికే కొంత స్థలం కబ్జాకు గురైంది. మిగతా స్థలంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం స్థానికులను తీవ్ర నిరాశకు గురిచేసింది. సర్కారుపై ఒత్తిడి తేవాల్సిన స్థానిక మంత్రి..అక్కడ డంపింగ్ యార్డుకు ఆదేశాలు జారీచేయడంతో మోచీలు, దళితులు ఆవేదనకు గురవుతున్నారు. ఇప్పటికే ఆ పనులను పర్యవేక్షించిన మంత్రి వేగవంతం కోసం అధికారులకు ఆదేశాలు కూడా జారీచేశారు. తమతో కనీసం చర్చించకుండానే ఈ చర్యలు తీసుకోవడం పట్ల దళితులు, మోచీల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

సర్వే చేసినా ఫలితం దక్కలేదు : అంబిల్‌పూర్ అశోక్, మోచీ సంఘం బాన్సువాడ అధ్యక్షుడు



లెదర్ పార్క్ ఏర్పడుతుందని అధికారులు సర్వే నిర్వహించి భూమిని కూడా కేటాయించారు. పలుమార్లు మంత్రి పోచారం దృష్టికి తీసుకెళ్లాం. కానీ ఫలితం లేకపోయింది. ఇప్పటికే పనుల్లేక చాలామంది ఇతర ప్రాంతాలకు వలస పోతు న్నారు. ఎండనకా, వాననకా కష్టపడుతున్నా పూటగడవటం కష్టంగా మారింది.

ధ్రువీకరణ పత్రాలిచ్చారు : బాలరాం, బాన్సువాడ



తోలు పరిశ్రమ వస్తుందని మోచీ, దళిత ఉప కులస్తులకు శిక్షణనిచ్చి ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. శిక్షణ పొందినవారు కూడా ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారు. మరికొందరు పట్టణాలకు వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా సర్కారు కనికరించాలి.

పనిచేస్తేనే అన్నం : మోచీ బాలవ్వ, బాన్సువాడ

నాకు ఇద్దరు కూతుళ్లు. ఇద్దరు కొడుకులు. అందులో ఇద్దరు వికలాంగులు. నా భర్త చనిపోయినప్పటి నుంచి కుటుంబ భారం నామీద పడింది. ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేస్తే వచ్చిన డబ్బులతోనే పొట్టనింపుకుంటం. సర్కారే మా బాధలు తీర్చాలే.

ఇసుక మాఫియాకు కేరాఫ్ కాంగ్రెస్

అధికారం రాదనే కాంగ్రెస్, బీజేపీ విమర్శలు

- రైతులను కాల్చి చంపిన ఘనత బీజేపీదే: మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- ఆర్టీసీ కార్మికుల శిక్షణకు భవనాలు: మంత్రి మహేందర్‌రెడ్డి



నవతెలంగాణ - హుస్నాబాద్

టీఆర్ఎస్ సర్కార్ సంక్షేమ పథకాలతో ప్రజలు సుఖంగా జీవిస్తున్నారని, ఇక తమకు అధికారం రాదన్న భయంతోనే కాంగ్రెస్, బీజేపీ తమ పాలనపై విమర్శలు చేస్తున్నాయని మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు, శ్మశాన వాటిక తదితర పనులకు రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి సోమవారం పలుచోట్ల శంకుస్థాపన చేశారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక మాఫియాను పెంచి పోషించింది కాంగ్రెస్ అని, మాఫియాను అరికట్టింది టీఆర్ఎస్ ప్రభుత్వం అని అన్నారు. కాళేశ్వరం, మిడ్ మానేరు పూర్తి చేసి గౌరవెల్లి, గండిపల్లి, ప్రాజెక్టులకు నీరు తీసుకొస్తామని ఉద్ఘాటించారు. ప్రాజెక్ట్ నిర్మాణాల్లో 110 కేసులు వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టులు పూర్తి చేస్తామని తేల్చిచెప్పారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రంలో రుణమాఫీ అడిగిన రైతులను కాల్చి చంపిన చరిత్ర ఆ పార్టీకే దక్కుతుందని విమర్శించారు. టీఆర్ఎస్‌ను విమర్శించే నైతికత బీజేపీకి, కాంగ్రెస్‌కి లేదన్నారు. ఇసుక ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ.40 కోట్లు ఆదాయం వస్తే, టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.400 కోట్లని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు జేబులు నింపుకుంటే టీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఖర్చు చేస్తోందని చెప్పారు. హుస్నాబాద్ అభివృద్ధి కోసం రూ.2కోట్ల రూపాయలతో సమావేశాల కోసం టౌన్‌హాల్ నిర్మాణం చేపడుతామన్నారు. రైతు బజారుకు రూ.50 కేటాయించామని, స్థలాన్ని గుర్తించాలని అధికారులకు ఆదేశించారు. అనం తరం మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి జిల్లాలో ఆర్టీసీ కార్మికులకు శిక్షణ కోసం రూ.50 కోట్లతో భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 236 మినీ సిటీ బస్సులు కేటాయించి నడిపిస్తున్నామన్నారు. రూ.380 కోట్లతో 1400 బస్సులను సీఎం కేటాయించారని గుర్తు చేశారు. 96 డిపోల్లో ప్రజలకు అన్ని విధాలా సౌకర్యాల కోసం రూ.60 కోట్లు కేటాయించామన్నారు. కార్యక్రమంలో ఎంపీ వినోద్‌కుమార్, ఆర్టీసీ చైర్మెన్ సత్యనారాయణ, చీఫ్ విప్ పాతురి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే సతీష్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ ఉమా, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, జడ్పీవైస్ చైర్మెన్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

పెరగనున్న ఉపాధ్యాయ పోస్టులు

సీఎం ఆదేశాలతో విద్యాశాఖ కసరత్తు

- వెంటవెంటనే రెండు డీఎస్సీలు వేసే ఆలోచనలో సర్కార్
- నోటిఫికేషన్ విడుదలపై సందిగ్ధం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

సర్కారు బడుల్లో భర్తీ చేయనున్న టీచర్‌పోస్టుల సంఖ్య పెరగనున్నాయి. పోస్టుల సంఖ్యను పెంచాలని సీఎం కేసీఆర్ ఆదేశించడంతో పాఠశాల విద్యాశాఖాధికారులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం 8,792 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ పోస్టులను ఒకే సారి భర్తీ చేయాలా లేక రెండు డీఎస్సీ(టీఆర్‌టీ)లు నిర్వహించాలా అనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నది. తెలంగాణలో 8,792 ఉపాధ్యాయ పోస్టులతో త్వరలోనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని ఇటీవల డిప్యూటీసీఎం కడియం శ్రీహరి ప్రకటించారు. టీచర్ పోస్టుల భర్తీపై శనివారం డిప్యూటీసీఎం, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్‌తో ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్షించారు. పాతజిల్లాలు, కొత్త జిల్లాలకు సంబంధించిన అంశంపై న్యాయస్థానాల్లో సమస్యలు రాకుండా చూసుకోవాలని వారికి సూచించారు. ఈక్రమంలోనే టీచర్ పోస్టులు మరీ తక్కువగా ఉండటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తూ, మరో ప్రతిపాదనతో రావాలని సూచించినట్టు తెలిసింది. దీంతో మరోసారి టీచర్ పోస్టుల ఖాళీల వివరాలను జిల్లాలనుంచి అధికారులు సేకరిస్తున్నారు. ప్రస్తుతం భర్తీచేస్తామని ప్రకటించిన పోస్టులు 2015 విద్యాసంవత్సరంలో సేకరించినవి కావడంతో ఈ రెండేండ్ల కాలంలో మరో మూడువేల పోస్టుల వరకూ ఖాళీలు ఏర్పడే అవకాశమున్నది. వీటి నూతన జాబితాను తయారు చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 12వేలమంది విద్యావాలంటీర్లు పాఠశాలల్లో పనిచేస్తున్నారు. ఈసంఖ్యకు అనుగుణంగా టీచర్ పోస్టులను భర్తీచేసే ఆలోచన కూడా చేస్తున్నారు.

వెంటవెంటనే రెండు డీఎస్సీలు..?

ఐదేండ్లుగా డీఎస్సీ నిర్వహించకపోవడంతో నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేండ్ల కాలంలో డీఎస్సీ నిర్వహణపై అనేక వాయిదాలు వేసింది. ఇది నిరుద్యోగుల్లో ప్రభుత్వంపై కొంత వ్యతిరేకతను తీసుకొచ్చింది. ఈ వ్యతిరేకత నుంచి బయటపడేందుకు ప్రభుత్వం సమాలోచనలు చేస్తోంది. ఒకేసారి మెగా డీఎస్సీ నిర్వహించాలా..? లేక వెంటవెంటనే రెండుడీఎస్సీలు వేయాలా అనే ఆలోచన చేస్తోంది. కొత్తగా ప్రారంభించిన ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లోనూ టీచర్ పోస్టులను భర్తీ చేయాలని, వాటిల్లో పోస్టులను కేటాయించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో పోస్టులు భారీగానే పెరిగే అవకాశమున్నది. అయితే ఇప్పటికే ప్రకటించిన 8,792 ఖాళీ పోస్టులతో వెంటనే డీఎస్సీ ప్రకటించి, ఇంగ్లీష్‌మీడియం పోస్టులు, మిగిలిన పోస్టులతో ఈ ఏడాది చివర్లో మరో డీఎస్సీ వేయాలనే ఆలోచన ప్రభుత్వం పెద్దల్లో ఉన్నట్టు తెలుస్తోంది. దీనిద్వారా తెలంగాణ ప్రభుత్వంలో రెండుసార్లు డీఎస్సీ వేసినట్టు ప్రకటించుకునే అవకాశముందని భావిస్తోంది. అయితే ఉమ్మడి జిల్లాలుగా, కొత్త జిల్లాలుగా టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినా న్యాయస్థానాల్లో చిక్కులు వచ్చే అవకాశమున్న నేపథ్యంలో ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తుందనే దానిపై నిరుద్యోగుల్లో ఉత్కంఠ నెలకొన్నది. దీంతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలపై సందిగ్ధం నెలకొన్నది. ఈనెల 17న జరిగే సమావేశంలో డిప్యూటీసీఎం క్లారిటీ ఇచ్చే అవకాశమున్నది.

ఇదేమీ మొదటి సారి కాదు

(మొదటిపేజీ తరువాయి)

సూచించలేం. ఎందుకంటే, ఇది ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పండుగ కాదన్న విషయాన్ని గమనించాలి. ప్రజల మనోభావాలను, అభీష్టాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని గుర్తుంచుకోవాలి' అని అమిత్‌షా అన్నారు. జీఆర్‌డీ ఆస్పత్రి ఘటనపై యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్‌ను రాజీనామా చేయాలని ప్రతిపక్ష నేతలు డిమాండ్ చేసిన నేపథ్యంలో అమిత్‌షా పై కామెంట్లు చేసి ఇరకాటంలో పడ్డారు. అమిత్‌షా వ్యాఖ్యలపై బాధితులు మండిపడుతున్నారు.

కోర్టుల్లో సీసీ కెమెరాలు

- సుప్రీం కోర్టు చారిత్రక నిర్ణయం

న్యూఢిల్లీ: కోర్టుల్లో జరిగే విచారణలకు సంబంధించి దేశ సర్వోన్నత న్యాయస్థానం సంచలన నిర్ణయం తీసుకున్నది. ఇకపై అన్ని కోర్టుల్లో, ట్రిబ్యునళ్లలో సీసీ కెమెరాలను అమర్చి విచారణలను రికార్డు చేయాలని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని కోర్టుల్లో సీసీ టీవీలు అమర్చాలని స్పష్టం చేసింది.

న్యాయవ్యవస్థలో పారదర్శకతను సాధించేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయని జస్టిస్ ఆదర్శ్ కె గోయల్, జస్టిస్ ఉదయ్ యూ లలిత్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. విచారణ సందర్భంగా మాట్లాడే ప్రతి మాటా రికార్డు కావాలని ఆదేశించింది. దీని ద్వారా ఎలాంటి సమస్యా ఉండదని కోర్టు పేర్కొంది. దేశంలోని అన్ని హైకోర్టుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని.. కోర్టు ఆవరణల్లో కూడా వీటిని ఏర్పాటు చేయాలని ఆదేశించింది.


మార్చిలోనే ప్రయోగాత్మకంగా సీసీ కెమెరాల ఏర్పాటును ప్రారంభించారు. ప్రస్తుతం అన్ని కోర్టులు, ట్రిబ్యునళ్లలో వీటిని ఏర్పాటు చేయాలని కోర్టు సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది.

గత ఉత్తర్వుల్లో వీడియో రికార్డింగ్ మాత్రమే జరగాలని కోర్టు పేర్కొనగా.. తాజాగా ఇచ్చిన ఉత్తర్వుల్లో వీడియోతోపాటు ఆడియోను రికార్డు చేయాలని ఆదేశించింది. సీసీ కెమెరాల ఏర్పాటుకు సంబంధించి సాంకేతిక వివరాలు, కెమెరాల ధరలు తదితర పూర్తి వివరాలను ఒక నెలలో సిద్ధం చేయాలని కేంద్ర ఐటీ, న్యాయ శాఖలను ఆదేశించింది. అయితే, హైకోర్టు అనుమతి లేకుండా వేరే ఇంకెవరూ విచారణను రికార్డు చేసే అవకాశం లేదని తెలిపింది. నిర్దిష్ట గడువు తర్వాత రికార్డులను పూర్తిగా తొలగిస్తామని పేర్కొంది. ఈ అంశంపై గతంలో కేంద్రం, సుప్రీం కోర్టు మధ్య పలు దఫాల చర్చలు జరిగాయి. ఆగస్టు 2013 నుంచి పలువురు న్యాయశాఖ మంత్రులు న్యాయవ్యవస్థలో పారదర్శకత కోసం కోర్టు విచారణను రికార్డుల అంశాన్ని పరిశీలించాలని పలుమార్లు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో సుప్రీం తాజా నిర్ణయం తీసుకోవటం విశేషం..

ఆదిత్యనాథ్ రాజీనామా చేయాలి

విద్యార్థి సంఘాల నేతల డిమాండ్

- చిన్నారుల మృతికి ఓయూలో కొవ్వొత్తులతో నివాళి



ఉస్మానియాలో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ - ఉస్మానియా యూనివర్సిటీ /నారాయణగూడ

కేంద్రంలో మోడీ, యూపీలో ఆదిత్యనాథ్ నిర్వాహకం వల్ల పసిప్రాణాలు హరించుకుపోయాయని, గోరఖ్‌పూర్ ఘటనకు బాధ్యత వహిస్తూ యూపీ సీఎం ఆదిత్యనాథ్ వెంటనే రాజీనామా చేయాలని విద్యార్థి నేతలు డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట దళిత వామపక్ష, మైనార్టీ విద్యార్థి సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో యూపీలోని గోరఖ్‌పూర్ ఆస్పత్రిలో మృతి చెందిన 72 చిన్నారుల మృతులను స్మరిస్తూ కొవ్వొత్తులతో నివాళ్లర్పించారు. లిబర్టీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఓయూలో పలువురు విద్యార్థులు మాట్లాడుతూ... ప్రభుత్వ తప్పిదాలను కప్పిపుచ్చుతూ నెపాన్ని డాక్టర్లపై నెట్టడం తగదన్నారు. ఘటన నుంచి తప్పించుకునేందుకు మెదడువాపు వ్యాధి వచ్చిందని బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు దుర్మార్గపు ప్రచారానికి పూనుకున్నాయన్నారు. విద్యార్థి నేతలు శరత్, నరేష్, అలెగ్జాండర్, నారాయణ, వెంకట్, విద్యార్థి నేతలు పాల్గొన్నారు.

పశువులపై ఉన్న ప్రేమ మనుషులపై చూపెట్టరా?

యూపీ సీఎం ఆదిత్యనాథ్‌కు పశువులపై ఉన్న ప్రేమ మనుషుల ప్రాణాలపై ఎందుకు లేదని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు బండారు వీరబాబు ప్రశ్నించారు. హిమాయత్‌నగర్‌లోని లిబర్టీ వద్ద ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట యువజన సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషులను గౌరవించలేని ఆదిత్యనాథ్‌కు సీఎంగా కొనసాగే అర్హత లేదన్నారు. మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామని, మనిషి ప్రాణానికి విలువనివ్వని వ్యక్తి రాష్ట్రాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఎలా కాపాడుతాడని ప్రశ్నించారు. భాదితకుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు నూకమళ్ళ వీరస్వామి, శనిగరపు బాలకృష్ణ, హరినాథ్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కడుపు మండింది. తమ సమస్యల్ని పరిష్కరించడంలో యాజమాన్యం, కార్మిక శాఖ మీనమేషాలు లెక్కించడాన్ని వారు సహించలేకపోయారు. తాడోపేడో తేల్చుకోవాలని నిశ్చయించుకున్నారు. కేంద్ర కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ (డీఎల్‌సీ) శ్యాంసుందర్ అధ్యక్షతన సింగరేణి కాలరీస్‌లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల సన్నాహక సమావేశాన్ని ముట్టడించారు. దీనికి శివంరోడ్‌లోని సెంట్రల్ అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఏటీఐ) వేదికైంది. సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ జేఏసీ నాయకత్వంలో కార్మికులు సింగరేణి అధికారుల్ని, డీఎల్‌సీని దాదాపు 7 గంటల పాటు గదిలో బంధించి...ముందు తమ సమస్యను పరిష్కరించాకే, వారి ఎజెండాలోకి వెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ హఠాత్పరిణామానికి కంగుతిన్న అధికారులు వారిని ఒప్పించేందుకు నానాతంటాలు పడ్డారు. ఈ ఏడాది జనవరి 19న కనీస వేతనం రూ.359 ఇవ్వాలని కేంద్రప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇస్తే...ఇప్పటి వరకు ఎందుకు అమలు చేయట్లేదని జేఏసీ భాగస్వామ్య సంఘం నేత బి మధు (సీఐటీయూ) నిలదీశారు. దీనిపై ఈ ఏడాది మార్చిలో 9రోజులు సమ్మె చేస్తే 15 రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చి...మళ్లీ ముఖం చూడలేదని పులి రాజిరెడ్డి (బీఎమ్ఎస్) అధికారులతో వాగ్వివాదానికి దిగారు. కేంద్రప్రభుత్వ ఉత్తర్వుల్ని అమలు చేయకుంటే కార్మికశాఖ సింగరేణి యాజమాన్యాన్ని ఎందుకు ప్రాసిక్యూట్ చేయట్లేదని వెంకన్న (ఐఎఫ్‌టీయూ) ప్రశ్నించారు. పాత బకాయిలతో కలిపి వేతనాలు ఇస్తారో లేదో ఇక్కడే స్పష్టం చేయాలని శంకర్ (ఐఎఫ్‌టీయూ) డిమాండ్ చేశారు. గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల సన్నాహక సమావేశానికి దాదాపు 15 కార్మిక సంఘాల నేతలు హాజరయ్యారు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల రాజిరెడ్డి, మందా నర్సింహరావు కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళనకు మద్దతు తెలిపారు. దీంతో మిగిలిన కార్మికసంఘాలన్నీ అనివార్యంగా కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్‌కు మద్దతు తెలపాల్సి వచ్చింది. ముందు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యను పరిష్కరించమని వారు డీఎల్‌సీని కోరారు. ఉదయం 11.30 గంటలకు మొదలైన ఈ అందోళన మధ్యాహ్నం 1.30 అయినా కొలిక్కి రాలేదు. ఈలోపు సమాచారం తెలుసుకున్న కేంద్రప్రభుత్వ కనీస వేతనాల సలహా మండలి ఛైర్మెన్ ఆవుల గోవర్ధన్ అక్కడికి వచ్చారు. గతంలో తనతో జరిగిన సమావేశాల్లో కనీస వేతనాలు ఇస్తామని ఒప్పుకున్న యాజమాన్యం, ఇప్పటి వరకు ఎందుకు అమలు చేయలేదని ఆయన సింగరేణి అధికారుల్ని ప్రశ్నించారు. దానికి వారు లీగల్ ఓపీనియన్ తీసుకుంటున్నామని చెప్పడంతో ఛైర్మెన్‌తో సహా కార్మికులు అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. తక్షణం అమలు చేస్తున్నట్టు రాతపూర్వకంగా ఇస్తే తప్ప అక్కడి నుంచి కదలనిచ్చేది లేదని తేల్చిచెప్పారు. దీంతో సింగరేణి జనరల్ మేనేజర్ (పర్సనల్) ఆనందరావు, డిప్యూటీ జనరల్ మేనేజర్లు అనిల్‌కుమార్, కవితానాయుడు, డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) అజయ్‌కుమార్‌లు తమ పై అధికారులకు సమాచారాన్ని ఇచ్చారు. అయితే అటునుంచి ఎలాంటి ప్రతిస్పందన రాలేదు. దీంతో కార్మికులు మరింత ఆగ్రహానికి గురయ్యారు. మధ్యవర్తిత్వం వహించేందుకు వచ్చిన ఏ గోవర్ధన్ కూడా అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు, అధికారులకు మధ్య వాగ్వివాదం జరిగింది. తమను అరెస్టు చేసినా సరే...ఇప్పుడు సమస్యను పరిష్కరించాల్సిందేనని కార్మికులు భీష్మించారు. అప్పటికే సాయంత్రం 6 గంటలు అయ్యింది. దీంతో ఈనెల 31వ తేదీలోపు కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయించే బాధ్యతను తాము తీసుకుంటామని, యాజమాన్యం దిగిరాకుంటే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని కేంద్ర కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ శ్యాంసుందర్, కేంద్ర ప్రభుత్వ కనీస వేతనాల సలహా మండలి ఛైర్మెన్ ఆవుల గోవర్ధన్ రాతపూర్వకంగా హామీ ఇచ్చారు. జనవరి 19 నుంచి పాతబకాయిలతో సహా ఇప్పిస్తామని ఆ ఒప్పందంలో పేర్కొన్నారు. దీంతో కార్మికులు శాంతించారు.

ఎన్నికల సమావేశం వాయిదా

సింగరేణి కాలరీస్‌లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల సన్నాహక సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు శ్యాంసుందర్ ప్రకటించారు. కాంట్రాక్ట్ కార్మికుల అంశం పరిష్కారమయ్యాకే తదుపరి సమావేశ తేదీని ప్రకటిస్తామని చెప్పారు.

పరిహారం చెల్లించేదాకా అడ్డుకుంటాం

నవతెలంగాణ-మంథని

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న సుందిళ్ల బ్యారేజీ పనుల వద్ద భూ నిర్వాసితుల ఆందోళన కొనసాగుతున్నది. పరిహారం పూర్తిస్థాయిలో చెల్లించేదాకా పనులను అడ్డుకుంటామని గ్రామస్తులు భీష్మిస్తున్నారు. బ్యారేజీ పనులను అడ్డుకునేందుకు సోమవారం అక్కడికెళ్లిన నిర్వాసితులపై కాంట్రాక్టర్లు బెదిరింపులకు దిగారు. పరిసర ప్రాంతాల్లోకి రాకుండా ప్రయివేటు సెక్యూరిటీ సిబ్బందితో నిలువరించారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు నలుగురు నిర్వాసితులను అదుపులోకి తీసుకున్నారు.

పెద్దపల్లి జిల్లా సిరిపురంలో సుందిళ్ల బ్యారేజీ పనుల నిమిత్తం 50 మంది రైతుల నుంచి ప్రభుత్వం 120 ఎకరాలు సేకరించిన విషయం తెలిసిందే. తమకు అదనపు పరిహారం చెల్లించాలని కొంతకాలంగా నిర్వాసితులు ఆందోళన చేస్తున్నారు. గోలివాడ మాదిరిగానే తమకు కూడా రూ. 13 లక్షల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల ప్రాజెక్టు వద్ద లారీలను అడ్డుకున్న గ్రామస్తుడు చంద్రమోహన్‌పై కాంట్రాక్టర్లు కేసులు పెట్టారు. దీంతో పోలీసులు శుక్రవారం రాత్రి అతన్ని నిర్బంధించారు. చిత్రహింసలకు గురిచేయడమే అక్రమంగా నాలుగు సెక్షన్ల మీద కేసులు బనాయించారు. శనివారం గోదావరిఖని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి కూడా పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం బాధితుడితో కలిసి సోమవారం బ్యారేజీ పనులను మళ్లీ అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ... పరిహారం ఎక్కువ ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యేకు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

గోలివాడతో పోల్చుకుంటే తమ భూముల్లోనే పంటలు ఎక్కువగా పండుతాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం బంగారం లాంటి భూములిస్తే ఇలా మోసం చేస్తారా అని వాపోయారు. అదనపు పరిహారం అడిగితే పోలీసులతో తీవ్రంగా హింసించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. గోలివాడ నిర్వాసితుల వలే తమకు అదనపు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పనులను అడ్డుకున్న దాసరి చంద్రమోహన్, దాసరి శేఖర్, బొద్దె సుధాకర్, ఉడుత కొమురయ్యలను స్టేషన్‌కు తరలించారు. నిర్వాసితులు మాత్రం పరిహారం చెల్లించే వరకూ పోరాడుతామని, అప్పటివరకు పనులు నడవనివ్వబోమని తేల్చిచెప్పారు.

నీటిగోస

(మొదటిపేజీ తరువాయి)

పరిధిలోని కృష్ణా బేసిన్‌లో కురిసిన వర్షాలకు కేవలం రెండేసి టీఎంసీల నీరు మాత్రమే వచ్చి చేరింది. తెలుగు రాష్ట్రాల్లోని 24 ఎకరాలకు సాగునీరందించే ఈ ప్రాజెక్టుల్లో నీరు లేక పోవడంతో ఖరీఫ్ పంటకు వేసే సమయం కూడా దాటి పోయింది. ప్రతీయేటా ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం పరిస్థితి మరీ అందోళనకరంగా మారింది. ఆల్మటి, నారాయణపూర్ రిజర్వాయర్లలోకి వచ్చిన నీటిని ఎప్పటికప్పుడు ఆయకట్టుకు తరలించిన తర్వాత కూడా ఆ రెండు రిజర్వాయర్లలో ఇప్పటికీ పూర్తిస్థాయిలో నీరు ఉన్నది. ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లో తగ్గడంతో కిందకి నీరు విడుదల చేయడానికి ఆ రాష్ట్రం సుముఖంగా లేదు.

కృష్ణా బేసిన్‌లోని ప్రధాన ప్రాజెక్టుల పరిస్థితి

ప్రాజెక్టు పేరు	నీటి నిల్వ సామర్థ్యం (టీఎంసీల్లో)	ఇప్పటి వరకూ వచ్చిన నీరు (టీఎంసీల్లో)	ప్రస్తుత నీటి నిల్వ (టీఎంసీల్లో)
ఆల్మట్టి	129.72	154	128.19
నారాయణపూర్	37.64	41	30.73
జూరాల	9.65	12	6.7
శ్రీశైలం	215.80	3	19.87
నాగార్జునసాగర్	312.04	3	115.94
తుంగభద్ర	100.85	51	49.54

స్పష్టత రాని సమగ్ర సర్వే

శాఖల మధ్య సమన్వయ లోపం

- మొత్తం రైతులు 63,79,127
- సర్వే పూర్తయింది 45,55,881



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వం చేపట్టిన 'సమగ్ర రైతు సర్వే" ఇంకా నత్తనడకన సాగుతునది. రైతు సమగ్ర సర్వేలో భాగంగా 558 మండలాల్లో 2163 క్లస్టర్లు (పంట కాలనీలు)గా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 10743 గ్రామాల్లో, 63,79,127 మంది రైతులున్నారని ప్రభుత్వం అధికారికంగా గుర్తించింది. వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ, భూ పరిపాలన విభాగం లెక్కల మధ్య పొంతన కుదరకపోవడంతో ప్రభుత్వం సమగ్ర రైతు సర్వేకు పూనుకుంది. దీని ద్వారా వచ్చే ఏడాది నుండి ఒక్కో రైతుకు ఎకరానికి ఖరీఫ్, రబీ పంటల సాగు సమయాల్లో రూ.8వేలు అందించాలని ప్రభుత్వం భావించింది. దీని కోసం సమగ్ర సర్వే చేపట్టారు. ఈ సర్వే ప్రారంభంలో ఉన్నంతకొత్తగా ఆసక్తి రానురాను లేకుండా పోయింది. రైతుల వద్దకు అధికారులు వెళ్లి సర్వే నిర్వహించడంతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఇప్పుడు రైతులు వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్లి రికార్డు చేయించుకోవాలని అనే పరిస్థితికి వచ్చింది. దీంతో కథ మొదటికొచ్చినట్టయింది. ప్రభుత్వం విధించిన తుది గడువు లోపల ఈ ప్రక్రియ పూర్తికాలేదు. ఇది నిరంతరం జరిగే కార్యక్రమం కిందికి మార్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గూడా హడావుడిగా చేయొద్దని చెప్పడంతో అధికారుల్లో నిర్లక్ష్యం అలుముకున్నది. శుక్రవారం నాటికి 4555881 మంది రైతుల నుంచి సమాచారం సేకరించినట్టు అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు నిర్వహిస్తున్న రైతు సమగ్ర సర్వేలో కూడా స్పష్టత రాదని ఉన్నతాధికారలు అంటున్నారు. ఉదాహరణకు మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు 14 లక్షల మంది వివిధ ప్రాంతాలకు వలసలు పోయారు. సర్వేకు వెళ్లిన అధికారులకు తాళాలు వేసిన ఇండ్లు దర్శనమిస్తున్నాయి. వలసలు పోయిన వారి వివరాలు ఎలా అందుతాయి. అదే విధంగా నిజామాబాద్ జిల్లాల్లో చెరకు కొట్టడానికి వివిధ ప్రాంతాల నుంచి రైతులు కూలి కొరకు వచ్చారు. కూలీల తండాలకు అధికారులు వెళ్లి సర్వే నిర్వహిస్తే సమాచారం ఎలా వస్తుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అదే విధంగా సాదాబైనామా కింద దరఖాస్తు చేసుకున్న వారు 12లక్షల మంది రైతులున్నారని సమాచారం. ఈ రైతులు అధికారులకు ఏ విధంగా సమాచారం చెబుతారు. రుణమాఫీకి సంబంధించిన రైతుల పాస్‌బుక్‌లు బ్యాంకుల్లో ఉన్నాయి. ఈ వివరాలు ఎలా అందుతాయి. అధికారులు ఏ విధంగా నమోదు చేసుకుంటారనే అనుమానాలు రైతుల్లో వ్యక్తం అవుతున్నాయి. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమగ్ర సర్వే నిర్వహించింది. అందులో భూముల వివరాలు, సర్వే నెంబర్లు మాత్రమే కాకుండా గొర్లు, బర్లు ఎన్ని ఉన్నాయనే వివరాలను కూడా అధికారులు రాసుకున్నారు. ఈ లెక్కలు తేలేదెప్పుడు? లెక్కలు తేలినా ప్రభుత్వం ప్రకటించిన ఎకరానికి రూ.4వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమయ్యేదెప్పుడని రైతులు చర్చించుకుంటున్నారు. వ్యవసాయ రంగంలో సమూల మార్పులతో పాటు ఆయా సీజన్‌లలో పంటల సాగుకోసం పెట్టుబడికి ఎకరానికి రూ. 4వేల చొప్పున అందించడంతో పాటు పంట కాలనీలు, రైతు సమాఖ్యల ఏర్పాటు సక్రమంగా జరగాలనే ఉద్దేశంతో ఈ సర్వే చేపడుతున్నట్టు వ్యవసాయ శాఖలో పని చేసే రిటైర్డ్ అధికారి ఒకరు తెలిపారు. ఏ రైతు వద్ద ఎంత భూమి ఉన్నదనే వివరాలు చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్‌ఏ) వద్ద ఉందని, ఆ డేటాపై ప్రభుత్వానికి నమ్మకం లేకనే మరోసారి సర్వే నిర్వహిస్తోందని మరో అధికారి పేర్కొన్నారు. శాఖల మధ్య, అధికారుల మధ్య లెక్కలు కుదరకనే ఈ సర్వే చేయిస్తున్నారని సమాచారం.

రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం ఎంత మంది రైతులున్నారు? ఇప్పటి వరకు ఎంత మంది రైతుల నుంచి సమాచారం సేకరించింది అనే వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

జిల్లాలు	మొత్తం రైతులు	సర్వే చేసిన రైతు
ఆదిలాబాద్	13600	111371
భద్రాది (కొత్తగూడెం)	155738	102756
జనగాం	152695	109446
జగిత్యాల్	138747	137767
జయశంకర్ (భూపాల్‌పల్లి)	209840	134460
జోగులాంబ (గద్వాల)	162657	124715
కరీంనగర్	159604	116160
కామారెడ్డి	272207	191354
ఖమ్మం	267663	239620
కొమురంభీమ్ (ఆసిఫాబాద్)	153262	80171
మహబూబాబాద్	144991	137626
మహబూబ్‌నగర్	416844	274717
మంచిర్యాల్	157474	99293
మేడ్చల్	14769	15860
మెదక్	275814	159465
నాగర్‌కర్నూల్	272458	210660
నల్లగొండ	604086	334073
నిర్మల్	192801	130565
నిజామాబాద్	294097	192696
పెద్దపల్లి	191619	101077
రంగారెడ్డి	243241	176885
సంగారెడ్డి	307215	213962
సిద్దిపేట్	256070	198305
సిరిసిల్ల	150862	82028
సూర్యాపేట	217400	180725
వికారాబాద్	280319	172834
వనపర్తి	177687	109430
వరంగల్ (రూరల్)	143235	133925
వరంగల్ (అర్బన్)	96951	67286
యాదాద్రి	132771	216649
మొత్తం	**6379127**	**4555881**



స్వాతంత్ర్య స్ఫూర్తి చాటిన చిత్రాలు

భారతీయ సినిమా పుట్టుక దగ్గర్నుంచి నేటి వరకు స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని, ప్రజల దేశభక్తి, త్యాగాన్ని చాటే రీతిలో ఎన్నో స్వాతంత్ర్య సమర నేపథ్య సినిమాలు రూపొందాయి. ఆ చిత్రాలన్ని ప్రేక్షకులను అలరించేడమే కాకుండా అణువణువూ దేశభక్తిని ప్రేరేపించాయి..

'పాడవోయి భారతీయుడా..' (వెలుగు నీడలు), 'గాంధీ పుట్టిన దేశమా ఇది..' (పవిత్ర బంధం), 'తెలుగు వీర లేవరా..' (అల్లూరి సీతారామరాజు), 'జననీ జన్మభూమిశ్చ..' (బొబ్బిలిపులి), 'పుణ్య భూమి నా దేశం..' (మేజర్ చంద్రకాంత్), 'వినరా వినరా దేశం మనదేరా..' (రోజా), 'చక్ దే ఇండియా..' (చక్ దే ఇండియా), 'దేశం మనదే..' (జై), 'మేమే ఇండియన్స్..' (ఖడ్గం), 'ఏ శకుని ఆడని జూదం..' (లీడర్).. వంటి తదితర ఎన్నో చిత్రాల్లోని ఈ దేశభక్తి పాటలు వింటుంటే ప్రతి ఒక్కరి రోమాలు నిక్కబోడుచుకోక మానవు. స్వాతంత్ర్య సమర స్ఫూర్తిని చాటిన ఇటువంటి ఎన్నో పాటలను మన దర్శక, నిర్మాతల తమ తమ చిత్రాల్లో పొందుపరిచి మరికొంత మందికి స్ఫూర్తిగా నిలిచారు. అలాగే తెలుగు సినిమా స్వర్ణయుగ దశల 'వందేమాతరం', 'నా దేశం', 'దేశ ద్రోహులు' వంటి తదితర చిత్రాలు పూర్తి స్థాయి స్వాతంత్ర్య సమర నేపథ్యంలో రూపొంది విశేష ఆదరణ పొందాయి. ఆ తర్వాత నందమూరి తారకరామారావు, అక్కినేని నాగేశ్వరరావు తదితర స్టార్ హీరోలూ స్వాతంత్ర్య సమర నేపథ్యంలో రూపొందిన సినిమాల్లోనే కాకుండా, ఇతర చిత్రాల్లో సైతం దేశభక్తిని ప్రబోధించే పాటల్లోనూ నటించడం విశేషం. 'బొబ్బిలిపులి', 'సర్దార్ పాపారాయుడు' తదితర ఎన్టీఆర్ నటించిన చిత్రాలు, శోభనబాబు నటించిన 'ఆంధ్రకేసరి' వంటి చిత్రాలు ఈ కోవకి చెందినవే. ఆ తర్వాత మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజుగా కృష్ణ నటించిన 'అల్లూరి సీతారామరాజు' సంచలన విజయం సాధించింది. తెల్లదొరల పెత్తందారీ విధానంపై ప్రాణాల్ని లెక్కచేయకుండా తిరగబడ్డ తెలుగు బిడ్డగా అల్లూరి సీతారామరాజు పోరాట చరిత్ర ప్రేక్షకుల్లో స్ఫూర్తి రగిలించింది. దేశభక్తిని చాటిన గొప్ప చిత్రంగా జాతీయ అవార్డుని సైతం దక్కించుకుంది. స్వాతంత్ర్య సమర నేపథ్యాన్ని ఆధునిక శైలిలో చూపిస్తూ కమల్‌హాసన్ నటించిన 'భారతీయుడు' చిత్రం యావత్ భారతీయ సినీ ప్రేక్షకుల్ని అలరించింది. స్వాతంత్ర్య సమర యోధుడు సుభాష్ చంద్రబోస్ జీవిత చరిత్ర ఆధారంగా వెంకటేష్ నటించిన 'సుభాష్ చంద్రబోస్', బాలకృష్ణ నటించిన 'పరమ వీర చక్ర', రవితేజ, శ్రీకాంత్, ప్రకాష్‌రాజ్ కాంబినేషన్‌లో కృష్ణవంశీ రూపొందించిన 'ఖడ్గం', చిరంజీవి నటించిన 'ఠాగూర్', 'స్టాలిన్', శ్రీకాంత్ నటించిన 'మహాత్మ', 'నేటి గాంధీ' తదితర చిత్రాలు సైతం దేశభక్తిని చాటాయి. టాలీవుడ్‌లోనే కాకుండా బాలీవుడ్‌లో సైతం దేశభక్తిని చాటే చిత్రాలొచ్చాయి. స్వాతంత్ర్య తిరుగుబాటు నేపథ్యంలో రూపొందిన 'షాహీద్' చిత్రంలో దిలీప్‌కుమార్ నటించారు. స్వాతంత్ర్యం సంపాదించిన తర్వాత కూడా ఓ భారతీయ స్త్రీ పరిస్థితి ఎంత దుర్భరంగా ఉందో కళ్ళకు కట్టినట్టు రూపొందిన 'మదర్ ఇండియా' (1957) ప్రపంచ సినీ ప్రేక్షకుల్ని విశేషంగా అలరించింది. దేశభక్తి నేపథ్యాన్ని ఏదో ఒక రూపంలో తన సినిమాలో ఉండేలా తపన పడిన హీరోలలో మనోజ్‌కుమార్ ఒకరు. ఆయన నటించిన 'పూరబ్ ఔర్ పశ్చిమ్' (1970) భారతీయ సంస్కృతికి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ నిర్మితమైంది. 1825-1875 మధ్య కాలంలో స్వాతంత్ర్యం కోసం భారతీయులు పడిన వేదనకు ప్రతిరూపంగా 1981లో భారీ కాస్టింగ్‌తో 'క్రాంతి' చిత్రం విడుదలైంది.

దేశంపై భారతీయులకు ఉన్న మమకారాన్ని, గౌరవాన్ని, భక్తిని చాటే చిత్రంగా 1982లో 'రోజా' చిత్రం విడుదలైంది. మణిరత్నం దర్శకత్వం వహించిన ఈచిత్రంతో ఆస్కార్ అవార్డు గ్రహీత ఏ.ఆర్.రెహ్మాన్ సంగీత దర్శకుడిగా సినీ ప్రపంచానికి పరిచయమయ్యారు. దేశంలో జరుగుతున్న అన్యాయాల్ని అరికట్టేందుకు నడుంబిగించిన యువకుడిగా 1994లో నానాపటేకర్ 'క్రాంతివీర్' చిత్రంలో నటించారు. 1971 ప్రాంతంలో ఇండో,పాక్ యుద్ధ నేపథ్యంలోని పరిస్థితులకు ప్రతీకగా దేశభక్తి స్ఫూర్తిని కలిగించే రీతిలో 'బోర్డర్' (1997) చిత్రం విడుదలైంది. స్వాతంత్ర్య సమరయోధుడు, ధైర్యశాలి భగత్‌సింగ్ జీవిత చరిత్ర ఆధారంగా అజయ్‌దేవగన్ నటించిన 'ద లెజెండ్ ఆఫ్ భగత్‌సింగ్' (2002) చిత్రం విడుదలై విశేష ప్రేక్షకాదరణ పొందింది. ఇదే కోవలో 'లగాన్', 'మంగళ్‌పాండే', 'హే రామ్', 'ద ఫర్‌గాటెన్ హీరో', 'రంగ్ దే బసంతి', 'చక్ దే ఇండియా' తదితర చిత్రాలు విశేష దేశభక్తిని, సమర స్ఫూర్తిని చాటాయి.



గౌతమ్

మహేష్ 25వ చిత్రం షురూ..

మహేష్ నటిస్తున్న 25వ చిత్రం మొదలైంది. వంశీపైడిపల్లి దర్శకత్వంలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, వైజయంతి మూవీస్ పతాకాలపై దిల్‌రాజు, సి.అశ్వనీదత్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ నూతన చిత్రం సోమవారం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో వైభవంగా ప్రారంభమైంది. ముహూర్త సన్నివేశానికి మహేష్ తనయుడు ఘట్టమనేది గౌతమ్ క్లాప్‌నివ్వగా, మహేష్ తనయ ఘట్టమనేని సితార కెమెరా స్విచాన్ చేశారు. వంశీపైడిపల్లి కుమార్తె పైడిపల్లి ఆద్య తొలిషాట్‌కు దర్శకత్వం వహించారు. దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు, వి.వి.వినాయక్‌లు సంయుక్తంగా వంశీ పైడిపల్లికి స్క్రిప్ట్ అందించారు. 'మహేష్ హీరోగా ఆయన 25వ చిత్రాన్ని నిర్మిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. మహేష్ అభిమానులను, ప్రేక్షకులను అలరించేలా విభిన్నమైన కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తాం' అని నిర్మాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నమ్రతా మహేష్, జెమిని కిరణ్, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, సునీల్ నారంగ్, సురేందర్‌రెడ్డి, సతీష్ వేగేశ్న, హరీష్ శంకర్, చిత్ర సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, కథ: వంశీ పైడిపల్లి, హరి, సాల్మన్, సినిమాటోగ్రఫీ: పి.ఎస్.వినోద్.

నవచిత్రం

బన్నీ ఎంట్రీకి రంగం సిద్ధం


అల్లు అర్జున్ (బన్నీ)

అల్లు అర్జున్, అను ఇమ్మాన్యుయెల్ జంటగా వక్కంతం వంశీ దర్శకత్వంలో కె.నాగబాబు సమర్పణలో రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ పతాకంపై శిరీష శ్రీధర్ నిర్మిస్తున్న చిత్రం 'నా పేరు సూర్య- నా ఇల్లు ఇండియా'. త్వరలో రెండవ షెడ్యూల్‌ను ప్రారంభించుకోనున్న ఈ చిత్రం గురించి నిర్మాత లగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ, 'అల్లు అర్జున్ మా బ్యానర్‌లో నటిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రానికి సంబంధించి ఇటీవల తొలి షెడ్యూల్ పూర్తయ్యింది. తదుపరి షెడ్యూల్ ఈ నెల 18 నుంచి సెప్టెంబర్ 2 వరకు జరుగుతుంది. ఈ షెడ్యూల్‌లో స్టయిలీష్ స్టార్ అల్లు అర్జున్ జాయిన్ అవుతాడు. బన్నీ ఎనర్జీకి తగ్గట్టుగా చేసిన ఈ కథలో అన్ని రకాల కమర్షియల్ ఎలిమెంట్స్ ఉంటాయి. సూపర్ హిట్ చిత్రాలకు కథ అందించి, వరుస సక్సెస్‌లు అందుకుని తొలిసారి మెగాఫోన్ పట్టిన వక్కంతం వంశీ హై ఎనర్జిటిక్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. నాగబాబు, బన్నీవాసుగారి ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు నిర్మిస్తున్నందుకు చాలా హ్యాపీగా ఉంది. భారతదేశం గర్వించదగిన నటీనటులు, సాంకేతిక నిపుణులతో ఈ చిత్రాన్ని చాలా గ్రాండియర్‌గా తెరకెక్కిస్తున్నాం. విశాల్-శేఖర్ సంయుక్తంగా మంచి సంగీతం సమకూరుస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 27న ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం' అని అన్నారు. అర్జున్, శరత్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రాజీవ్ రవి, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరరావు (చంటి).


కత్రినా కైఫ్

భయపడుతూనే ఉంటా..


అర్జున్

'హీరో వల్లే సినిమా ఆడుతుందంటే నేను నమ్మను. ఒకవేళ తన వల్లే సినిమా హిట్ అయ్యిందని హీరో అనుకుంటే అంతకంటే ఫూలీష్‌నెస్ ఉండదు. ఇదంతా టీమ్ వర్క్‌తోనే సాధ్యం' అని అంటున్నారు అర్జున్. నితిన్, మేఘా ఆకాష్ జంటగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందిన 'లై' చిత్రంలో ప్రతినాయకుడిగా అర్జున్ నటించారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రానికి పాజిటివ్ రెస్పాన్స్ వస్తున్న నేపథ్యంలో సోమవారం అర్జున్ మీడియాతో సంభాషించారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

అందరూ ప్రశంసిస్తున్నారు..

ఇందులో మీది విలన్ రోల్ అని దర్శకుడు చెప్పగానే డైజెస్ట్ చేసుకోలేకపోయాను. కథ విన్న తర్వాత విలన్‌గా నటించడానికి మంచి స్కోప్ ఉందనిపించింది. అంతేకాదు పాత్రలో చాలా డైమెన్షన్స్ ఉన్నాయి. వీటితోపాటు నితిన్‌తో 'శ్రీ ఆంజనేయం' సినిమా చేశాను. అప్పట్నుంచి తనంటే నాకు ప్రత్యేక అభిమానం. దీంతో ప్రతినాయకుడి పాత్రకు నో చెప్పలేకపోయాను. సినిమా విడుదలయ్యాక నా పాత్రకు మంచి ప్రశంసలు దక్కాయి. భిన్నంగా, స్టయిలీష్ పాత్రలో అద్భుతంగా నటించారని అందరూ అప్రిషియేట్ చేస్తున్నారు. ఏ ప్రాత్రకైనా ప్రాణం పెట్టి చేస్తే కచ్చితంగా బాగా వస్తుందని నమ్మేవాడిని నేను.

అది ఫూలీష్ థింగ్..

ఓ సినిమా హిట్ అయ్యిందంటే దానికి హీరో కారణం కాదు. హీరో వల్ల సినిమా విజయం సాధిస్తుందంటే అది ఫూలీష్‌నెస్. కథను దర్శకుడు బాగా తెరకెక్కించాలి. హీరో బాగా నటించాలి. కెమెరా వర్క్ బాగుండాలి, మ్యూజిక్ ఆకట్టుకోవాలి. ఇలా ప్రతి డిపార్ట్‌మెంట్ బాగుంటేనే సినిమా ఆడుతుంది. అదంతా టీమ్ వర్క్. అంతేకాని హీరో వల్ల సినిమా ఆడటమనేది ఉండదు. ఫెయిల్ అవ్వడానికి కూడా చాలా కారణాలుంటాయి. ఇటీవల తెలుగు హీరోలు వర్సెటైల్ క్యారెక్టర్స్ చేస్తున్నారు. ఇదొక మంచి పరిణామం. మొన్నటి వరకు మన దగ్గర హీరో అంటే ఇమేజ్ అనే స్టాంప్ వేసేస్తారు. కానీ ఇప్పుడు హీరోలు విలక్షణమైన పాత్రలు చేయడం ఆనందించాల్సిన విషయం. మన సినిమా మారిందనడానికి ఇదొక నిదర్శనం కూడా.

ఇదంతా గాడ్ గిఫ్ట్..

నటుడు అనేవాడికి ఎప్పుడూ భయం ఉండాలి. నేనొక సినిమా చేస్తున్నానంటే ఇప్పటికీ భయపడుతూనే ఉంటా. నిర్మాత డబ్బిచాడు. సరిగా చేయకపోతే ఏమంటాడోననే భయం, ప్రేక్షకుడు నా పాత్రను ఎలా రిసీవ్ చేసుకుంటాడోననే భయం, సరిగా చేయకపోతే దర్శకుడు ఏమంటాడోనని భయం.. ఇలా భయపడుతూనే ఉంటా. అందుకే నేను ఫిట్‌నెస్‌గా ఉండేందుకు బాగా ప్రయత్నిస్తా. నన్ను నేను బాగా ఎంకరేజ్ చేసుకుంటాను. అలాగే నటుడిగా ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుంటా. నేనే కాదు ఎవరైనా సరే మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అప్‌డేట్ అవ్వాల్సిందే. యంగ్ బ్లడ్‌తోపాటు మేమూ రాణించాలి కదా (నవ్వుతూ). 37 సంవత్సరాల కెరీర్‌లో 151 చిత్రాల్లో నటించాను. ఇదంతా గాడ్ గిఫ్ట్‌గా భావిస్తున్నాను.

విలన్‌గానైనా సరే..

ఇకపై కూడా విలక్షణ పాత్రలు, నటనకు స్కోప్ ఉంటే ఎలాంటి పాత్రల్లోనైనా నటిస్తాను. 'లై' సినిమాలోని విలన్ పాత్ర స్టయిల్లో నటనకు స్కోప్ ఉంటే విలన్‌గానైనా చేస్తాను. ప్రస్తుతం అల్లు అర్జున్ సినిమాలో నటిస్తున్నా. ఇందులోనూ నా పాత్ర చాలా విభిన్నంగా, కొత్తగా ఉంటుంది.

నాకు అంత నాలెడ్జ్ లేదు..

సేవ చేయడమనేది వ్యక్తిగతం. పబ్లిసిటీ కోసం సర్వీస్ చేయకూడదు. ప్రతి ఒక్కరూ సేవ చేయాలి. అయితే సేవ చేయాలంటే కేవలం రాజకీయాల్లోకే వెళ్లాల్సిన పనిలేదు. సినిమా ద్వారానైనా సేవ చేయొచ్చు. మంచి సందేశం ఇస్తూ, జనాన్ని ఎడ్యుకేట్ చేసే సినిమాలు చేయడం కూడా దేశభక్తే అవుతుంది. తోటి వారికి సహాయం చేయడం, మంచి పనిచేయడం, పేద వాడికి ఒక్కపూట అన్నం పెట్టడం కూడా దేశభక్తి అనే నేను భావిస్తాను. ఇక రాజకీయాల విషయానికి వస్తే నాకు పాలిటిక్స్ తెలియవు. మంచి రాజకీయ నాయకుడికైనా, చెడు రాజకీయ నాయకుడికైనా చాలా నాలెడ్జ్ కావాలి. నాకంత నాలెడ్జ్ లేదు.

రామ్‌చరణ్ సరసన..!


సారా ఆలీఖాన్

'రంగస్థలం' చిత్రం తర్వాత రామ్‌చరణ్ మణిరత్నం దర్శకత్వంలో నటించనున్నారని సమాచారం. ఈ సినిమాలో చరణ్ సరసన తొలుత ఐశ్వర్యరాయ్‌ను తీసుకోవాలని చర్చలు జరిపినప్పటికీ తాజాగా మరో కథానాయిక పేరు బయటికొచ్చింది. ఈ చిత్రంలో చరణ్‌కి జోడీగా బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ తనయ సారా ఆలీఖాన్‌ని ఎంపిక చేయనున్నారట. అన్నీ కుదిరితే ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ భాషల్లో ఒకేసారి తెరకెక్కించనున్నారట. ఇదిలా ఉంటే 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్'కు సీక్వెల్‌గా రూపొందే చిత్రంతో సారా బాలీవుడ్‌లోనూ అడుగిడనున్నట్టు సమాచారం. ఇదే నిజమైతే సారా అలీఖాన్‌కి రెండవ సినిమాగా మణిరత్నం సినిమా అవుతుంది.

టెంపర్ రీమేక్‌లో.. !

ఎన్టీఆర్ నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'టెంపర్'ను బాలీవుడ్‌లో రీమేక్ చేయబోతున్న విషయం విదితమే. ఈ చిత్రంలో హీరోయిన్‌గా కత్రినా కైఫ్ నటించబోతున్నట్టు సమాచారం. తెలుగులో ఎన్టీఆర్ సరసన కాజల్ హీరోయిన్‌గా నటించింది. ఈ చిత్రాన్ని బాలీవుడ్‌లో రణ్‌వీర్ సింగ్ హీరోగా దర్శకుడు రోహిత్ శెట్టి రీమేక్ చేయబోతున్నారు. పోలీస్ ఆఫీసర్‌గా రణ్‌వీర్ సింగ్‌కిది తొలిచిత్రమవుతుంది.

తెలుగు 'టెంపర్'లో కాజల్ నటించిన హీరోయిన్ పాత్ర కోసం చిత్ర యూనిట్ కత్రినాను సంప్రదించారట. తెలుగునాట బ్లాక్‌బస్టర్ సినిమా కావడంతో కత్రినా సైతం పచ్చజెండా ఊపినట్టు తెలుస్తోంది. రోహిత్ శెట్టి ప్రస్తుతం 'గోల్‌మాల్ ఎగైన్' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం తర్వాత 'టెంపర్' రీమేక్‌ను తెరకెక్కిస్తారట.

అమీర్ ఖాన్ సరసన 'థగ్స్ ఆఫ్ హిందుస్థాన్', సల్మాన్ సరసన 'టైగర్ జిందా హై' చిత్రాలతోపాటు షారూఖ్ సరసన ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వంలో రూపొందే చిత్రంలోనూ కత్రినా నటిస్తూ బిజీగా ఉంది.

అందమైన ప్రేమకథా చిత్రం..


రాధికా మెహరోత్రా, చంద్రకాంత్

చంద్రకాంత్, రాధికా మెహరోత్రా జంటగా గోవర్ధన్.జి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ప్రేమ ఎంత మధురం ప్రియురాలు అంత కఠినం'. ఈ చిత్రాన్ని థర్డ్ ఐ క్రియేషన్స్ పతాకంపై రఘురాం రొయ్యూరుతో కలిసి గోవర్ధన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర మోషన్ పోస్టర్ లాంచ్ సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. అతిథిగా విచ్చేసిన నిర్మాత బెక్కెం వేణుగోపాల్ మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ప్యాషన్ ఉన్న టీమ్ చేస్తున్న చిత్రమిది. అమెరికాలో ఉండే తెలుగువారి ప్రేమ కథ ఇది. ఇందులోని ఓ మ్యాజిక్ అందరినీ అలరిస్తుంది. మ్యూజిక్ కూడా సూపర్‌గా కుదిరింది. దర్శకుడు గోవర్ధన్ కొత్తవాడైనా సినిమాను చాలా బాగా డీల్ చేశాడు. సినిమా పెద్ద హిట్ కావాలి' అని అన్నారు. 'మంచి టీమ్ సపోర్ట్‌తో తీసిన ఈ చిత్రం మా అందరికి మంచి బ్రేక్ ఇస్తుందని ఆశిస్తున్నాను. సినిమా చూసి సపోర్ట్ చేయడానికి ముందుకొచ్చిన నిర్మాత బెక్కెం వేణుగోపాల్‌గారికి ధన్యవాదాలు' అని నిర్మాత రఘురాం రొయ్యూరు తెలిపారు. దర్శకుడు గోవర్ధన్ మాట్లాడుతూ, 'సినిమాలంటే ప్యాషన్‌తో అమెరికాలో జాబ్ వదులుకుని ఈ చిత్రాన్ని రూపొందించాం. థ్రిల్లర్ ఎలిమెంట్స్ జోడించి ఓ బ్యూటిఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ట్రెండ్‌కు అనుగుణంగా అమెరికాలో జరిగే తెలుగువారి ప్రేమకథ ఇది. సినిమా మొత్తం అమెరికాలోనే షూట్ చేశాం. షూటింగ్ పూర్తయిన ఈ చిత్రాన్ని వచ్చే నెలలో విడుదల చేస్తాం. నిర్మాత బెక్కెం వేణుగోపాల్ మా చిత్రానికి సహకారం అందించడం ఆనందంగా ఉంది' అని చెప్పారు. 'ఈ సినిమా కోసం దర్శకుడు గోవర్ధన్ ప్రాణం పెట్టి జీవం పోశారు. మా నుంచి మంచి నటన రాబట్టుకున్నారు. అవకాశమిచ్చిన దర్శక, నిర్మాతలకు ధన్యవాదాలు' అని నాయకానాయికలు తెలిపారు.

భారీ మెజారిటీతో..


ఆర్.వెంకటేశ్వరరావు, అమ్మిరాజు, కె.సతీష్

తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ యూనియన్‌కు ఆదివారం జరిగిన ఎన్నికల్లో అమ్మిరాజు ప్యానెల్ విజయం సాధించింది. మొత్తం మూడు ప్యానెల్స్ పోటీలో పాల్గొనగా అమ్మిరాజు ప్యానెల్ అత్యధిక మెజారిటీతో గెలుపొందిందని యూనియన్ సభ్యులు తెలిపారు. యూనియన్‌కు అధ్యక్షుడిగా అమ్మిరాజు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.వెంకటేశ్వరరావు, కోశాధికారిగా కె.సతీష్(గీతా ఆర్ట్స్) పదవీ బాధ్యతలు చేపట్టారు. వీరితోపాటు ఉపాధ్యక్షుడిగా డి.యోగానంద్, కుంపట్ల రాంబాబు(అంబికా), సహాయ కార్యదర్శులుగా సూరపనేని కిషోర్, జి.నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా బానయ్య.ఎం, సి.హెచ్.నాగమధులు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా అంజయ్.పి, బి.వి.వి. సత్యనారాయణ, ఆకుల ఉమాశంకర్, జి.హరినాథ్, కె.రమేష్‌వర్మ, కొర్రపాటి వెంకటరమణ, కె.సత్యశివకుమార్, ఎం.రామారావు, ఐ.లక్ష్మణరావులు ఎన్నికయ్యారు.

75 మంది నూతన ఫైటర్స్ ఎంపిక


చిన్న శ్రీశైలం యాదవ్‌తో ఫైటర్స్ యూనియన్ సభ్యులు

తెలుగు సినీ ఫైటర్స్ యూనియన్‌లో కొత్తగా 75మంది అత్యుత్తమ ఫైటర్స్‌ని ఎంపిక చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో యూనియన్ చైర్మెన్ చిన్న శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపిక కార్యక్రమంలో సుమారు 200 మంది ఫైటర్స్ పాల్గొన్నారు. వివిధ పరీక్షల అనంతరం అత్యుత్తమ పోరాట ప్రదర్శన కనబర్చిన 75 మందిని ఎంపిక చేసినట్టు చైర్మెన్ శ్రీశైలం యాదవ్ తెలిపారు. రాబోయే దసరాలోపు నూతనంగా ఎంపికైన 75మంది ఫైటర్స్‌కు యూనియన్ కార్డ్స్ జారీ చేయనున్నామని ఆయన చెప్పారు. ఫైట్ మాస్టర్స్ రామ్-లక్ష్మణతోపాటు యూనియన్ అధ్యక్షుడు పి.సతీష్, కార్యదర్శి పవన్ కుమార్ సాల్వీ, అడ్వైజర్ నాగరాజ్ ముదిరాజ్, క్యాషియర్ రమేష్‌రాజు, నందు, రమణ, సాల్మన్ మాస్టర్ సమక్షంలో ఈ ఎంపిక కార్యక్రమం జరిగింది.

అనుబంధాలకు ప్రతిబింబం


అనుపమ పరమేశ్వరన్, దుల్కర్ సల్మాన్

దుల్కర్ సల్మాన్, అనుపమ పరమేశ్వరన్, ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో సత్యన్ అంతిక్కాడ్ దర్శకత్వంలో రూపొంది ఘన విజయం సాధించిన మలయాళ చిత్రం 'జొమోంటే సువిశేషంగాళ్'. ఈ చిత్రాన్ని మేఘవర్ష క్రియేషన్స్ పతాకంపై పత్తిపాటి శ్రీనివాసరావు 'అందమైన జీవితం' పేరుతో తెలుగులో విడుదల చేస్తున్నారు. విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం గురించి నిర్మాత పత్తిపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ, 'ఇదొక లవ్ అండ్ ఫ్యామిలీ సెంటిమెంట్ చిత్రం. తండ్రీకొడుకుల మధ్య అనుబంధాన్ని, ప్రేమికుల మధ్య ఉండే ప్రేమని ఈ చిత్రం అద్భుతంగా ప్రతిబింబిస్తుంది. సంగీతానికి మంచి ప్రాధాన్యత ఉన్న మ్యూజిక్ హిట్ చిత్రమవుతుంది. విద్యాసాగర్ వినసొంపైన బాణీలను అందించారు. మలయాళంలో విడుదలైన ఈ చిత్రం 50 కోట్ల రూపాయలను వసూలు చేసింది. ఇటీవల సెన్సార్ పూర్తి చేసుకుని క్లీన్ 'యు' సర్టిఫికెట్ పొందింది. ఈ నెలాఖరున సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: ఈ.ఎం. నాగేశ్వరరావు, కెమెరా: ఎస్.కుమార్.

ఉద్యమాలపై నిర్బంధం తగదు

కోదండరామ్ స్ఫూర్తియాత్రను అడ్డుకోవడం అప్రజాస్వామికం:

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శివర్గం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజా ఉద్యమాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించడం తగదని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శివర్గం హెచ్చరించింది. టీజేఏసీ చైర్మెన్ కోదండరామ్ స్ఫూర్తియాత్రను అడ్డుకోవడం అప్రజాస్వామికమని ఖండించింది. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అధ్యక్షతన రాష్ట్రకార్యదర్శివర్గ సమావేశం హైదరాబాద్‌లో జరిగింది. అనంతరం సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం సాయిబాబు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సమస్యల పరిష్కారానికి మూడేండ్లు ఓపిక పట్టినా ప్రభుత్వ వైఖరిలో మార్పులేదని తెలిపారు. కోదండరామ్ తలపెట్టిన స్ఫూర్తి యాత్రకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ప్రభుత్వం ఆటంకాలు సృష్టించిందని పేర్కొన్నారు. అక్రమ అరెస్టులతోపాటు బరితెగించి టీఆర్ఎస్ కార్యకర్తలతో దాడులు చేయించిందని విమర్శించారు.

ఈ నిరంకుశచర్యలను ప్రజాస్వామి కవాదులంతా వ్యతిరేకించాలని కోరారు. ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌ను ఎత్తివేయడమే కాకుండా జిల్లాల్లో ఉద్యమాలు చేస్తున్న ప్రజలపై పోలీసు లాఠీలు నిత్యకృత్యమవుతున్నాయని తెలిపారు. టీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజాసమస్యల పట్ల అసహనం పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు, రెగ్యులరైజేషన్, ఉద్యోగ భద్రత, రైతాంగ సమస్యలు, పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు, దళిత, గిరిజనులకు మూడెకరాల భూపంపిణీ, విద్యా వైద్యరంగాల్లో సమస్యలు, దళితులపై కులదురహంకార హత్యలు, ఇసుక మాఫియా, డ్రగ్స్ మాఫియా, ప్రభుత్వ అవినీతి వంటి సమస్యలపై ప్రజాసంఘాలు సమరశీలంగా ఉద్యమించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఆఫీసు బేరర్లు ఎస్ వీరయ్య, ఆర్ సుధాభాస్కర్, పి రాజారావు, పాలడుగు భాస్కర్, ఎస్ నర్సింహారెడ్డి, జె వెంకటేష్, ఎస్ రమ, పి జయలక్ష్మి, కె నిర్మల, జె మల్లికార్జున్, ఆర్ కోటంరాజు, భూపాల్, కళ్యాణం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికలకు ఉత్తమే కెప్టెన్

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ కుంతియా



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అధ్యక్షుడి మార్పుపై కాంగ్రెస్‌పార్టీలో జరుగుతున్న ఊహాగానాలకు ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ ఏఆర్ కుంతియా తెరదించారు. వచ్చే ఎన్నికల వరకూ ఎలాంటి మార్పులు ఉండవన్నారు. అధ్యక్షుడిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కొనసాగుతారని తెలిపారు. తాను కూడా తాత్కాలిక ఇన్‌చార్జీని కాదని, పూర్తిస్థాయి ఇన్‌చార్జీనని మరోసారి పునరుద్ఘాటించారు. సోమవారం నగరంలోని ఒక హోటల్‌లో విలేకరులతో ఆయన పిచ్చాపాటిగా మాట్లాడారు. ఈ ఏడాది ఆఖరులో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి మార్పు తథ్యమని కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహా పలువురు సీనియర్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అంశంపైనే మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా కుంతియా పై విధంగా స్పందించారు. ఉత్తమ్ పనితీరుపై ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ సంతృప్తిగానే ఉన్నారని తెలిపారు. పార్టీలో క్రమ శిక్షణను ఎవరు ఉల్లంఘించినా.. వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామని, ఇందులో భాగంగా అభ్యర్థులను కూడా ఆరు నెలల కంటే ముందే ప్రకటిస్తామని ఆయన చెప్పారు. పొత్తుల అంశంపై ప్రస్తావించగా..ఈ అంశం అధిష్ఠానం చూసుకుంటుందని తెలిపారు. అయితే ఏ పార్టీతో కలవాలో, ఎప్పుడు కలవాలన్న అంశంపై అధిష్ఠానమే తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. సంగారెడ్డిలో జరిగిన సభతో కాంగ్రెస్ వైపుకు ప్రజలు చూస్తున్నారని తేలిపోయిందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తమదే విజయమని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి పదవికి ముందస్తు ప్రకటన ఉండదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. టీఆర్ఎస్‌పార్టీపై తాము యుద్ధం ప్రకటించడం లేదన్నారు. తమ పార్టీలోని సంస్థాగత లోపాలను చక్కదిద్దుకునే ప్రయత్నంలో ఉన్నామన్నారు.

ఓడితే రాహుల్‌పై నెపం

రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతే దానికి రాహుల్‌గాంధీనే బాధ్యుడిగా చేస్తున్నారని కుంతియా తెలిపారు. కానీ గెలిచిన చోట మాత్రం రాహుల్‌కు ఆ ఘనత దక్కనీయడం లేదని చెప్పారు. పంజాబ్‌లో గెలుపునకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అమరీందర్‌సింగ్ కారణమంటూ వచ్చిన కథనాలను ప్రస్తావిస్తూ పై విధంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతలు తమ తీరు మార్చుకోవాలని ఆ పార్టీ ముఖ్యనేతలు జైరాం రమేశ్, మణిశంకర్ అయ్యర్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించగా అవి వారి వ్యక్తిగతమని తెలిపారు. ఈచిట్‌చాట్‌లో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే గీతారెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ తదితరులున్నారు.

మధ్యాహ్నభోజన పథకం కార్మికుల యూనియన్

నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక

- అధ్యక్షురాలుగా కె వరలక్ష్మి,

ప్రధాన కార్యదర్శిగా ఎస్ రమ



వరలక్ష్మి



రమ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ మధ్యాహ్నభోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికైంది. రాష్ట్ర అధ్యక్షురాలుగా కె వరలక్ష్మి(సూర్యాపేట), ప్రధాన కార్యదర్శిగా ఎస్ రమ(రాష్ట్రకేంద్రం), కోశాధికారిగా కె నిర్మల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన ఆ సంఘం రాష్ట్ర ప్రథమ మహాసభలో 43మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా టి చక్రపాణి (నిజామాబాద్), సిహెచ్ కుమారి(ఖమ్మం), జి గోపాలరెడ్డి(మేడ్చెల్), కవిత(రంగారెడ్డి), చిన్నన్న(ఆదిలాబాద్), కె నర్సమ్మ (మెదక్), స్వాతి (సంగారెడ్డి), కార్యదర్శులుగా మోనమ్మ(నిర్మల్), రూపా (కొమురంభీం), ఆదిలక్ష్మి(జనగామ), జి పద్మ(భద్రాద్రి), బి చక్రపాణి (భూపాలపల్లి), పి కృష్ణమచారి(మంచిర్యాల), హేమలత (సిద్దిపేట) ఎన్నికయ్యారు. కేంద్రీకృత వంటశాలల పేరుతో మధ్యాహ్నభోజన పథకాన్ని స్వచ్ఛంధ సంస్థలకు ఇవ్వాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలనీ, కార్మికులకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలనీ, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూచార్జీలను పెంచాలని మహాసభలో తీర్మానించారు.

ఆ విలీనం వద్దు..

'రెవెన్యూ వ్యవస్థ'పై సీపీఐ (ఎం)

- బలోపేతం చేయాలని విజ్ఞప్తి
- ఇందుకోసం తక్షణం అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రామ రెవెన్యూ వ్యవస్థను రద్దు చేసి, దాన్ని వ్యవసాయశాఖలో విలీనం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించటం అత్యంత శోచనీయమని సీపీఐ (ఎం) పేర్కొంది. సర్కారు యత్నాలను పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. వీటిని తక్షణం విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు వీలుగా వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని కోరారు. ఆ సమావేశంలో వచ్చిన సూచనలు, సలహాల ఆధారంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేసి సమస్యలను పరిష్కరించే బదులు.. ఆ శాఖను ఇప్పటికే అసమర్థంగా పనిచేస్తున్న వ్యవసాయశాఖలో విలీనం చేస్తామనటం సరికాదని పేర్కొన్నారు. ఇది తీవ్ర నష్టదాయకమని హెచ్చరించారు. వ్యవసాయశాఖ నిర్వహణ సక్రమంగా లేకనే రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులు తగ్గిపోతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో తన పనులనే సమర్థవంతంగా నిర్వహించలేని శాఖలోకి రెవెన్యూశాఖను విలీనం చేయటం తగదని తమ్మినేని హితవు పలికారు.

'సంగారెడ్డి ఘటన'పై సమగ్ర న్యాయ విచారణ...

సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం భూ వివాదంలో పోలీసులు జులుం ప్రదర్శించటాన్ని తమ్మినేని తీవ్రంగా ఖండించారు. భూ యజమానులను బెదిరించి, బలవంతంగా చెక్కులపై సంతకాలు చేయించుకుని బాధితులపైన్నే కేసులు నమోదు చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వం సంబంధిత పోలీసు అధికారులపై కేసులు నమోదు చేసిందని.. అయితే బాధితులకు న్యాయం జరగాలంటే కేసులొక్కటే సరిపోవని పేర్కొన్నారు. ఘటనకు బాధ్యులైన వారిని విధుల నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర న్యాయ విచారణకు ఆదేశించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే చర్యలు అవినీతి అధికారులకు ఓ హెచ్చరిక కావాలని సూచించారు. భూ హక్కుదారులకు ప్రభుత్వమే రక్షణ కల్పించాలని కోరారు. ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపైన, అందుకు తోడ్పాటునందిస్తున్న వారిపైనా చర్యలు తీసుకోవాలని తమ్మినేని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

16న జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు, ధర్నాలు

- తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మద్దతు ధరలు నిర్ణయించేందుకు పార్లమెంటులో చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.జంగారెడ్డి, టి.సాగర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అటవీ హక్కుల చట్టం అమలు చేయాలని, 60 ఏండ్లు దాటిన రైతులందరికీ రూ.5వేల చొప్పున పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ ధర్నాల్లో అధిక సంఖ్యలో రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ప్రొ కబడ్డీలో నేడు
బెంగాల్ X పుణెరి
రాత్రి 8 గంటలకు
గుజరాత్ X బెంగళూరు
రాత్రి 9 గంటలకు
వేదిక : అహ్మదాబాద్
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం

నవతెలంగాణ
12 హైదరాబాద్
మంగళవారం 15 ఆగస్టు 2017
ఆటలు

'రెగ్యులర్ ఆటగాళ్లు మెరిశారు. కానీ హార్దిక్ పాండ్య ప్రదర్శన భారత్‌కు అతిపెద్ద సానుకూలత. బంతితో పాండ్య ఆత్మవిశ్వాసం, బ్యాట్‌తో అతడి పరిణతి జట్టును సమతూకంగా ఉంచింది. ఇది యువ జట్టు. టెస్టు క్రికెట్లో మరింత ముందుకెళ్లాల్సి ఉంది. ఒక్కో టెస్టునే తీసుకుని ముందుకెళ్తాం'

\- విరాట్ కోహ్లి, భారత కెప్టెన్







మహ్మద్ షమి
15-6-32-3

విదేశీ గడ్డపై 3-0 స్వేచ్ఛా విజయం

శ్రీలంకలో టీమ్ ఇండియా తొట్టతొలి క్లీన్‌స్వీప్ సిరీస్

పల్లెకెల్‌లో ఇన్నింగ్స్ 171 పరుగులతో కోహ్లిసేన గెలుపు

విజృంభించిన అశ్విన్, షమి

మూడు రోజుల్లోనే ముగిసిన మూడో టెస్టు

నవతెలంగాణ-పల్లెకెల్

85 ఏండ్ల భారత టెస్టు క్రికెట్ చరిత్రలో మరే జట్టు సాధించలేని అరుదైన ఘనత కోహ్లిసేన సాధించేసింది. శ్రీలంకలో శ్రీలంకపై టెస్టు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసేసింది. మూడో టెస్టును ముచ్చటగా మూడోరోజుల్లోపే ముగించిన టీమ్ ఇండియా 3-0తో టెస్టు సిరీస్‌ను సొంతం చేసుకున్నది. 352 పరుగుల భారీ ఇన్నింగ్స్ ఆధిక్యంతో శ్రీలంకను ఫాలోఆన్ ఆడించిన కోహ్లిసేన... రెండో ఇన్నింగ్స్‌లో ఆజట్టును 181 పరుగులకే కుప్పకూల్చింది. కెప్టెన్ దినేశ్ చండిమాల్ (36, 89 బంతుల్లో 4 ఫోర్లు), నిరోశన్ డిక్‌వాలా (41, 52 బంతుల్లో 5 ఫోర్లు)లు గౌరవప్రదర వ్యక్తిగత స్కోరు చేయగలిగారే కానీ శ్రీలంకను ఆపద నుంచి కాపాడలేదు. స్టార్ స్పిన్నర్ అశ్విన్ (4/68), మహ్మద్ షమి (3/32) నిప్పులు చెరగటంతో శ్రీలంక తోకముడిచింది. ఉమేశ్ యాదవ్ (2/21) రాణించాడు. 86 బంతుల్లో విధ్వంసక శతకంతో మ్యాచ్ గతిని మలుపుతిప్పిన యువ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. సిరీస్‌లో రెండు శతకాలు సాధించిన శిఖర్ ధావన్ ' ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు. మూడు టెస్టుల సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకున్న టీమ్ ఇండియా టెస్టు సిరీస్ ట్రోఫీని అందుకున్నది.

అశ్వినే మొదలెట్టాడు, అతడే ముగించాడు : ఓవర్‌నైట్ స్కోరు 19/1తో మూడోరోజు ఫాలోఆన్‌లో ఆడిన శ్రీలంక.. ఓవర్ల విషయంలో మెరుగైన వికెట్ల పతనాన్ని నిలువరించలేక పోయింది. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ దిముత్ కరుణరత్నె (16, 48 బంతుల్లో 3 ఫోర్లు)ను ఉదయం సెషన్ ఆరంభంలోనే వెనక్కి పంపిన స్పిన్నర్ అశ్విన్.. వికెట్ల జాతరకు తెరదీశాడు. నైట్‌వాచ్‌మెన్ పుష్పకుమార (32 బంతుల్లో 1 పరుగు)ను మహ్మద్ షమి సాగనంపాడు. కుశాల్ మెండిస్ (12, 21 బంతుల్లో 2 ఫోర్లు)ను సైతం మహ్మద్ షమి ఎల్బీగా అవుట్ చేశాడు. దీంతో డ్రింక్స్‌లోపే శ్రీలంక మూడు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో కెప్టెన్ దినేశ్ చండిమాల్ (36, 89 బంతుల్లో 4 ఫోర్లు), ఎంజెలో మాథ్యూస్ (35, 96 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. లంచ్ బ్రేక్ వరకూ ఎలాగోలా కష్టపడి వికెట్ కాపాడుకోగలిగారు. లంచ్ విరామానికి శ్రీలంక 82/4తో నిలిచింది. ఐదో వికెట్‌కు సుమారు 30 ఓవర్ల పాటు క్రీజులో నిలిచిన చండిమాల్, మాథ్యూస్‌లు మ్యాచ్‌ను పొడగించేలా కనిపించారు. డిఫెన్స్‌తో వికెట్ నిరాకరించారు. కానీ ఈ జోడీని చైనామన్ కుల్‌దీప్ యాదవ్ విడదీశాడు. పుజారా క్యాచ్‌తో కెప్టెన్ చండిమాల్‌ను పెవిలియన్‌కు చేర్చాడు. కొద్దిసేపటికే మాథ్యూస్‌ను అశ్విన్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. దీంతో మళ్లీ వికెట్ల పతనం జోరందుకున్నది. 118/6తో మరెంతో సేపు శ్రీలంక నిలువలేదు అనిపించింది. కానీ ఈ దశలో నిరోశన్ డిక్‌వాలా (41, 52 బంతుల్లో 5 ఫోర్లు) ఇన్నింగ్స్‌ను మరో 20 ఓవర్ల పాటు పొడగించాడు. టెయిలెండర్లు దిల్‌రువన్ పెరీరా (8, 23 బంతుల్లో 1 ఫోర్), లక్షన్ సందకన్ (8, 24 బంతుల్లో 2 ఫోర్లు), విశ్వ ఫెర్నాండో (17 బంతుల్లో 4 పరుగులు)లతో కలిసి డిక్‌వాలా భారత్ విజయాన్ని ఆలస్యం చేశాడు. పెరీరాను అశ్విన్ అవుట్ చేయగా, సందకన్ సంగతి షమి చూసుకున్నాడు. అర్ధ సెంచరీకి చేరువైన డిక్‌వాలాను సాహా క్యాచ్‌తో ఉమేశ్ యాదవ్ బలిగొన్నాడు. ఇక అశ్విన్ క్యారమ్ బంతితో లహిరు కుమార (10) వికెట్లను గిరాటేయటంతో టీమ్ ఇండియా క్లీన్‌స్వీప్ విజయ సంబురాలు చేసుకున్నది.

కౌంటీల్లో అశ్విన్

టీమ్ ఇండియా స్టార్ స్పిన్నర్ అశ్విన్ ఈ నెలాఖర్లో కౌంటీ క్రికెట్లో ఆడనున్నాడు. శ్రీలంకతో వన్డే సిరీస్‌కు విశ్రాంతి లభించటంతో అశ్విన్ ఇంగ్లీష్ కౌంటీ క్రికెట్లో మెరవనున్నాడు. ప్రస్తుతం డివిజన్ టూలో ద్వితీయ స్థానంలో ఉన్న వర్సెస్టర్‌షైర్‌తో అశ్విన్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆగస్టు 28న జరగబోయే వర్సెస్టర్‌షైర్ తర్వాతి మ్యాచ్‌కు అశ్విన్ అందుబాటులో ఉండనున్నాడు. ఇక కౌంటీల్లో అశ్విన్ తన రెండో మ్యాచ్‌లోనే సహచర ఆటగాడు చటేశ్వర్ పుజారాతో పోటీపడనున్నాడు. నాటింగ్‌హామ్‌షైర్ తరపున ఆడుతున్న పుజారా ఈ సీజన్‌లో ఇంగ్లాండ్ వెళ్లనున్నాడు. లెఫ్టార్మ్ స్పిన్నర్ రవీంద్ర జడేజా సైతం కౌంటీల్లో అరంగేటానికి ఆసక్తి చూపుతున్నా.. ఇంకా ఏ జట్టుతో ఆడతాడనేది తేలాల్సి ఉన్నది!



గెలిచిన ఆనందంలో టీమ్ ఇండియా ఆటగాళ్లు

చరిత్ర సృష్టించటం కోహ్లిసేనకు సెంచరీ చేసినంత సులువైపోయింది. రికార్డులు బద్దలుకొట్టడం టీమ్ ఇండియాకు అలవాటైపోయింది. సిరీస్ విజయాల్లో కొత్త పుంతలు తొక్కుతున్న కోహ్లిసేన.. ద్వీపదేశంలో మరో చరిత్ర సృష్టించింది. 85 ఏండ్ల భారత టెస్టు క్రికెట్ చరిత్రలో తొలిసారి శ్రీలంకలో క్లీన్‌స్వీప్ విజయాన్ని సొంతం చేసుకున్నది. 3-0తో శ్రీలంకపై వరుసగా రెండో సిరీస్ విజయాన్ని సొంతం చేసుకున్నది.

కోహ్లిసేన దూకుడుకు శ్రీలంక ముచ్చటగా మూడో టెస్టులోనూ దాసోహం అనేసింది. తొలి రెండింటిలో నాల్గు రోజులు పోరాడినా.. మూడో టెస్టులో మూడు రోజుల్లోపే చేతులెత్తేసింది. స్పిన్నర అశ్విన్, సీమర్ మహ్మద్ షమి వికెట్ల జాతరలో శ్రీలంకకు మరో ఇన్నింగ్స్ ఓటమి తప్పలేదు. ఫాలోఆన్‌లో శ్రీలంక 181కే పరిమితమవగా.. ఇన్నింగ్స్ 171 పరుగులతో కోహ్లిసేన ఘన విజయం సాధించింది.

రెండేండ్ల క్రితం శ్రీలంకలో తొలుత భంగపడినా కోలుకుని 22 ఏండ్ల సుదీర్ఘ సిరీస్ నిరీక్షణకు తెరదించింది కోహ్లిసేన. ఇప్పుడు మరోసారి ద్వీపదేశంపై నిర్దయగా దండెత్తిన కోహ్లిగ్యాంగ్ వరుసగా రెండో సిరీస్‌ను సాధించింది. టెస్టుల్లో వరుసగా 8వ సిరీస్ విజయం సాధించిన విరాట్‌సేన తదుపరి లక్ష్యం సిరీస్ విజయాల్లో ప్రపంచ రికార్డే!.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ : 487/10

శ్రీలంక తొలి ఇన్నింగ్స్ : 135 ఆలౌట్

శ్రీలంక రెండో ఇన్నింగ్స్ : కరుణరత్నె (సి) రహానె (బి) అశ్విన్ 16, ఉపుల్ తరంగ (బి) ఉమేశ్ యాదవ్ 7, పుష్పకుమార (సి) సాహా (బి) మహ్మద్ షమి 1, కుశాల్ మెండిస్ (ఎల్బీ) మహ్మద్ షమి 12, దినేశ్ చండిమాల్ (సి) పుజారా (బి) కుల్‌దీప్ యాదవ్ 36, ఎంజెలో మాథ్యూస్ (ఎల్బీ) అశ్విన్ 35, నిరోశన్ డిక్‌వాలా (సి) రహానె (బి) ఉమేశ్ యాదవ్ 41, దిల్‌రువన్ పెరీరా (సి) పాండ్య (బి) అశ్విన్ 8, లక్షన్ సందకన్ (సి) సాహా (బి) మహ్మద్ షమి 8, విశ్వ ఫెర్నాండో నాటౌట్ 4, లహిరు కుమార (బి) అశ్విన్ 10, ఎక్స్‌ట్రాలు : 3, **మొత్తం : (74.3 ఓవర్లలో ఆలౌట్) 181.**

వికెట్ల పతనం : 1-15, 2-26, 3-34, 4-39, 5-104, 6-118, 7-138, 8-166, 9-168, 10-181.

బౌలింగ్ : షమి 15-6-32-3, అశ్విన్ 28.3-68-4, ఉమేశ్ యాదవ్ 13-5-21-2, కుల్‌దీప్ యాదవ్ 17-4-56-1, హార్దిక్ పాండ్య 1-0-2-0.

1 — విదేశీ గడ్డపై మూడు లేదా అంతకంటే ఎక్కువ టెస్టులున్న సిరీస్‌ను టీమ్ ఇండియా క్లీన్‌స్వీప్ చేయటం ఇదే ప్రథమం. విదేశాల్లో ఓ సిరీస్‌లో మూడు విజయాలు సాధించటం ఇది రెండోసారి మాత్రమే.

487 / 386 — ఈ టెస్టు సిరీస్‌లో టీమ్ ఇండియా అత్యల్ప ఇన్నింగ్స్ 487 పరుగులు. శ్రీలంక అత్యధిక ఇన్నింగ్స్ మొత్తం 386 పరుగులు.

5 — ఈ సిరీస్‌లో సెంచరీలు సాధించిన భారత బ్యాట్స్‌మెన్ ఐదుగురు. శిఖర్ ధావన్, చటేశ్వర్ పుజారా, విరాట్ కోహ్లి, అజింక్య రహానె సహా హార్దిక్ పాండ్య శతక్కొట్టాడు.



ఆడకుంటే ఆలోచిస్తాం!

ఎం.ఎస్ ధోనిపై ప్రసాద్ ఆసక్తికర వ్యాఖ్య

యువికి విశ్రాంతి ఇచ్చాం, వేటు కాదు



నవతెలంగాణ-పల్లెకెల్ : సాధారణంగా టీమ్ ఇండియా ఎంపిక అనగానే ఎలాంటి చర్చ లేకుండా ఎంపికయ్యే జాబితాలో మాజీ కెప్టెన్ ఎం.ఎస్ ధోని ముందుంటాడు. కానీ ధోని ఇక ఎంతమాత్రం సెలక్టర్ల ఆటోమెటిక్ చాయిస్ కాజాగలడని చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ పరోక్ష సంకేతాలిచ్చాడు. శ్రీలంకతో వన్డే సిరీస్‌కు ఆదివారం జట్టును ప్రకటించిన ప్రసాద్.. సోమవారం మీడియాతో మాట్లాడాడు. ఈ సందర్భంగా అతడు పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 2019 ప్రపంచకప్ సమీపిస్తున్న తరుణంలో సెలక్షన్ కమిటీ ఈ దిశగా స్పష్టమైన ప్రణాళికతో ఉందనే విషయం ప్రసాద్ చెప్పకనే చెప్పాడు. మహేంద్రసింగ్ ధోనిని ఆటోమెటిక్‌గా ఎంపిక చేస్తున్నారా అని అడుగగా.. ' ప్రస్తుతం నేను అండ్రీ ఆగస్సీ పుస్తకం చదువుతున్నాను. నిజానికి అతడి జీవితం 30 ఏండ్ల తరువాత మొదలైతుంది. అప్పటివరకూ అతడు రెండు, మూడు టైటిళ్లు మాత్రమే నెగ్గాడు. కానీ అతడి అసలు జీవితం అప్పుడు మెదలైతుంది. రిటైర్మెంట్ దగ్గరపడుతున్న వేళ మీడియా నుంచి ఒత్తిడి నెలకొని ఉంటుంది. కానీ అతడు 36 ఏండ్ల వయసు వరకూ ఆడాడు. ఎన్నో గ్రాండ్‌స్లామ్స్ సాధించాడు. కాబట్టి ఎప్పటికి చెప్పలేం. ఇది ఆటోమేటిక్ ఎంపిక అని చెప్పలేం, కానీ మీరు చూస్తారు. మనమంతా భారత జట్టు బాగా ఆడాలనే కోరుకుంటున్నాం. అతడు బాగా ఆడితే, ఆలోచించాల్సిన అవసరం ఏముంది? కానీ ఆడకుంటే అప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలిస్తాం' అని ఎమ్మెస్కే ప్రసాద్ అభిప్రాయపడ్డాడు. ధోని గురించి చర్చ జరిగిందా అని అడిగినప్పుడు.. ' అందరి పైనా చర్చలు జరుగుతాయి. అది కేవలం ఎం.ఎస్ ధోనికి మాత్రమే పరిమితం కాదు. జట్టును ఎంపిక చేసేటప్పుడు కాంబినేషన్లు గురించి మాట్లాడుతాం, అందరి గురించి చర్చిస్తాం. సరైన సమయంలో మీరు ఇది చూస్తారు. ఎం.ఎస్ ధోని దిగ్గజ ఆటగాడు. అతడిని తప్పించటమో, రోటేషన్‌లో ఆడించటమో చేయలేం. కానీ మాకు ఓ ప్రణాళిక ఉంది' అని ప్రసాద్ వెల్లడించాడు.

ఇక సీనియర్ ఆటగాడు యువరాజ్ సింగ్‌పై వేటు వేయలేదని, అతడికి కేవం విశ్రాంతి మాత్రమే ఇచ్చామని ప్రసాద్ తెలిపాడు. శ్రీలంక సిరీస్‌లో యువీ లేకపోవటంతో అతడి కెరీర్ ముగిసిందనే ప్రచారం సాగుతున్న విషయం తెలిసిందే. దీనిపై స్పందిస్తూ.. అందరికీ అవకాశం ఉంటుంది. ఏ ఆటగాడికి ఇక చోటు లేదని చెప్పలేం. అతడు నిలకడ సాధిస్తే మళ్లీ కచ్చితంగా జట్టులోకి వస్తాడు. ఇక యువ ఆటగాడు రిషబ్ పంత్ టీ20 ఫార్మాట్‌లోనే అతడిని నిరూపించుకున్నాడు.

ప్రస్తుతానికి రాహుల్ ద్రవిడ్ కోచింగ్ సారథ్యంలోని భారత్-ఎ జట్టుతో అతడి ప్రయాణం సాగుతోంది. కచ్చితంగా పంత్ భారత జట్టు భవిష్యత్ కెరటం. ఎ జట్టుతో అతడు మరింత పరిణతి సాధించగలడు. ఇక ఫిట్‌నెస్, నైపుణ్య స్థాయి విషయంలో మనకు సరైన ప్రమాణాలు లేవు. దీనిపై సెలక్షన్ కమిటీ దృష్టి సారించనున్నదని ప్రసాద్ తెలిపాడు.





కోస్టారికా ప్రజాజీవనం

కోస్టారికా మధ్య అమెరికా దేశాల్లో ఒకటి. ఎత్తయిన ఉన్నత భూములు, కోస్తా భూములు అని రెండు రకాలుగా ఈ దేశ భూభాగాన్ని విభజించవచ్చు. అధిక ఉష్ణోగ్రత, వర్షపాతం ఉన్న ఈ దేశంలో 30 లక్షల మంది ప్రజలు నివసిస్తున్నారు. 1502లో క్రిస్టాఫర్ కొలంబస్ ఈ దేశానికి వచ్చాడు. దీంతో కోస్టారికాలో అడుగు పెట్టిన మొదటి యూరోపియన్‌గా ఆయన రికార్డులకెక్కాడు. కొలంబస్ తన నాలుగో నౌకా యాత్రలో కోస్టారికాకు చేరుకున్నప్పుడు 'రిచ్ కోస్ట్' (సంపన్న తీరం) అని పేరు పెట్టాడు. కానీ నిజానికి ఇది అంత సంద్వంతమైనదేమీ కాదు. 1838లో ఇది స్వతంత్ర దేశం అయింది. ఆ సమయంలో కాఫీ పంట ఒక్కటే దేశానికి ఆదాయాన్ని సమకూర్చే ఏకైక ఎగుమతి అవుతున్న పంట. 1871లో ప్రవేశపెట్టిన అరటి పంట కూడా ఎగుమతి పంటగా మంచి ఆదాయ వనరుగా మారింది.

కొలంబస్ రాక వల్ల అక్కడ స్పెయిన్‌వారి ప్రభావం ఎక్కువ పడింది. ప్రధానంగా ఈ దేశంలో స్పానిష్ భాష మాట్లాడుతారు. ఆ తరువాతి స్థానం ఇంగ్లీషుది. అయితే కోస్టారికా స్పానిష్ భాష మెక్సికన్ టెలివిజన్ ప్రభావానికి లోనయింది.

నమ్మక వ్యవస్థ

కోస్టారికాలో ఉండే మూలవాసులను అమెరిండియన్స్ అంటారు. వీరు ప్రపంచాన్ని 'సిబూ' (దేవుడు) సృష్టించాడని, మంచిఆత్మలు, చెడు ఆత్మలు సృష్టిని కంట్రోల్ చేస్తాయని నమ్ముతారు. బ్రుజులు అనే సంప్రదాయక మంత్రగత్తెలు మూలికలు, మంత్రాలతో రోగాలను నయం చేస్తారని విశ్వసిస్తారు. ఇట్లా మంత్రగత్తెలుగా వ్యవహరించేవారికి కనీసం యాభయ్యేళ్ల వయసన్నా ఉండాలనేది ఒక నియమం.

క్రైస్తవ సన్యాసులు దేవునికి మనుషులకు మధ్య వారధిగా వ్యవహరిస్తారని ఇక్కడి ప్రజలు నమ్ముతారు. తమ ఇండ్లలో ఈ సన్యాసుల విగ్రహాలు, బొమ్మలు పెట్టుకుంటే అదృష్టం వరిస్తుందనేది మరో నమ్మకం.

తొంభయ్ శాతం మంది కేథలిక్ మతాన్ని అవలంభిస్తారు. ఇది ప్రభుత్వం గుర్తించిన ఏకైక మతం. కేథలిక్ మతాచారం ప్రకారం జరిగిన పెండ్లిని మాత్రమే ప్రభుత్వం గుర్తిస్తుంది. అయితే కోస్టారికా ప్రజలు మత విశ్వాసాల విషయంలో మరీ పట్టుదలగా ఉండరు.

నూతన శిశువు తల్లి దండ్రులు... బంధువులు, ఇరుగు పొరుగువారి నుండి బహుమతులు పొందుతారు. శిశువులను తల్లిదండ్రులు సంప్రదాయబద్ధంగా చర్చికి తీసుకువెళ్ళి బాప్టిజం ఇప్పిస్తారు. మొదటి జన్మదినం చాలా ముఖ్యమైనదిగా భావిస్తారు. ఏడేండ్ల వయసులో పిల్లలు స్కూల్లో ప్రవేశిస్తారు. మిడిల్, హైస్కూల్ చదువుతున్న అమ్మాయి 15వ ఏట ప్రవేశించడం కూడా ప్రత్యేకమైన సందర్భం (క్విన్స్)గా భావిస్తారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని పెద్ద విందు ఏర్పాటవుతుంది. భార్యాభర్తలు తమ 25వ, 50వ వివాహ దినోత్సవాలను జరుపుకోవడం ఆచారంగా వస్తున్నది. ఇక అంత్య క్రియల సంగతికొస్తే... చనిపోయిన 24 గంటల్లో అంత్యక్రియలు జరిపించాలి. ఎప్పుడు వీలుంటే అప్పుడు చర్చిలో ప్రార్థనలు నిర్వహించి మృత దేహాన్ని స్మశానానికి తరలిస్తారు.

మధ్య అమెరికా దేశాల్లో అత్యంత ఎక్కువ జీవన ప్రమాణం కలిగిన దేశాలు కోస్టారికా, పనామా. కోస్టారికాలో ఎక్కువమంది ప్రజలు దారువు (చెక్క), సిమెంట్ బ్లాక్స్‌తో నిర్మించిన ఇండ్లలో నివసిస్తారు. ఇండ్ల కప్పులు జింక్ లేక ఇనుప రేకులతో నిర్మితమవుతాయి. పట్టణాల్లోని ఇండ్లు జనంతో కిక్కిరిసి ఉంటాయి. ఎక్కువగా అద్దె గృహాలు, మురికి వాడల్లోనే పట్టణవాసులు ఉంటారు.

ఉమ్మడి కుటుంబం కోస్టారికా సమాజ ప్రాథమిక లక్షణంగా చెప్పవచ్చు. ఆదివారాల్లో బంధుజనం ఇండ్లను సందర్శించడం, ప్రత్యేక సందర్భాల్లో చుట్టాలను కలుసుకోవడం ఇక్కడి సంస్కృతిలో భాగం. ఒకప్పుడు పెద్దగా విడాకులు ఉండేవి కాదు కానీ మారిన పరిస్థితుల్లో విడిపోయే భార్యాభర్తలు ఎక్కువగా కనిపిస్తున్నారు. గృహ హింసకు గురయ్యే స్త్రీలు చాలామంది కనిపిస్తారు.

కోస్టారికా ప్రజలు తినే ఆహారంలో ఎక్కువగా అన్నం, బీన్స్, బ్రెడ్, స్ట్రాంగ్ బ్లాక్ కాఫీ ఉంటాయి. అక్కడి సంప్రదాయ వంటకం 'ఒల్ల డి కమే' బీఫ్, ఆలు, మొక్కజొన్న, అరటి, ఇతర కూరగాయల మిశ్రమంతో తయారవుతుంది. అట్లాగే స్పైసీగా ఉండే సీఫుడ్స్ కూడా ఎక్కువగా తింటారు.

-మౌక్తిక్





జానపద సాహిత్యాన్ని వెలుగులోకి తెచ్చి, జానపద విజ్ఞానానికి గౌరవం, విశ్వవిద్యాలయాల్లో దానికొక స్థానం కల్పించడంలో ఆచార్య బిరుదురాజు రామరాజు చేసిన కృషి చిరకాలం గుర్తుండిపోతుంది. అటువంటి మహావ్యక్తి గురించి తెలుసుకోవడం అంటే మన జానపద సంస్కృతిని తెలుసుకోవడమే. బిరుదురాజువారి గురించిన ఈ వ్యాసం ఎన్నో విశేషాలు మనముందు ఉంచుతున్నది.

తెలుగు సంస్కృతీ సౌరభాల గుబాళింపు

విద్యార్థిగా రజాకార్ల వ్యతిరేకోద్యమం, స్టేట్ కాంగ్రెస్ మొదలైన రాజకీయోద్యమాల్లో యువనాయకులైన కాళోజీ, హయగ్రీవాచారి, యం.ఎస్.రాజలింగం, మధుసూధన్, జమలాపురం కేశవరావు వంటివారి మార్గదర్శకత్వంలో చురుకుగా పాల్గొంటూ, విప్లవ వీరుడిగా ఖ్యాతి గాంచాలన్న రామరాజు ఉత్సాహపు పాలపొంగుపై నీళ్లు చిలుకరించారు సురవరం ప్రతాపరెడ్డి. యం.ఏ పట్టా తీసుకొన్నతరువాత వరంగల్ జిల్లా పంచాయితీ ఆఫీసర్‌గా శిక్షణ కూడా పూర్తి చేసుకొన్న వారి ఆలోచనను ఉపాధ్యాయ వృత్తి వైపు మరలించినవారు కూడా సురవరంవారే. అందుకే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో లెక్చరర్‌గా చేరారు.

ఖండవల్లి లక్ష్మీరంజనం రామరాజును పరిశోధనా మార్గంలో పయనింపచేశారు. రామరాజుకంటే ముందుగా నేదునూరి గంగాధరం, శ్రీపాద గోపాలకృష్ణమూర్తి వంటివారు జానపద సాహిత్య సేకరణ, ముద్రణ వంటివాటికి కృషి చేసినప్పటికి; పరిశోధనాత్మక దృష్టితో ఎంతో శ్రమపడి అడుగంటిపోతున్న జానపదుల భావచైతన్యాన్ని వెలికి తీసుకురావడమే కాకుండా ఎంతోమంది భావి పరిశోధకులకు ఆచార్య రామరాజు మార్గదర్శకులయ్యారు. ఈ పరిశోధనకు పూనుకున్న కాలంలో అమెరికాలో కూడా జానపద విజ్ఞానం బాగా అభివృద్ధి చెందలేదని డా.ఆర్వీయెస్ సుందరం అంటారు. జానపద సాహిత్యంపై మక్కువను చివరి వరకు కొనసాగించారాయన.



రామరాజు జానపద సాహిత్య ప్రత్యేకతను వివరిస్తూ అనేక రచనలు చేశారు. వాటిలో జానపద గేయ సాహిత్యానికి సంబంధించి తెలంగాణ జానపద సంపద, ఆంధ్ర జానపద గేయ వాగ్మయం, జానపద గేయ సాహిత్య ప్రశంస, ఆంధ్రదేశ జానపద గేయాలు, జాపద సాహిత్య ప్రత్యేకత, జానపద విజ్ఞానం; తెలుగు జానపద సాహిత్య భాండాగారాన్ని ఆంధ్రేతరులకు అందించాలనే ప్రయత్నంలో ఆంగ్లంలో కూడా కొన్ని గ్రంథాలు వెలువరించారు. ఇవి కాక ఆయన రాసిన అనేక వ్యాసాలు, ప్రయోగించిన మాండలికాలు జానపద భాషకు ప్రత్యేకతను సంతరించి పెట్టాయి.

జానపద సాహిత్యం గురించి, కళల గురించి మిగిలిన అనేక అంశాలకు సంబంధించి ఆచార్య రామరాజు వెలువరించిన రచనలు మూడువందల యాభైకి పైగా ఉన్నాయి. వాటిలో వీరగాథలు 2, జానపద రచనలు 70, గ్రామ సంస్మృతి రచనలు 5, పరిశోధనాత్మక వ్యాసాలు 20, జానపద కళలకు సంబంధించినవి 15, పద సాహిత్యం 5, కేవలం జానపద సంబంధమైనవి కాక విమర్శ ప్రక్రియలో 15 పీఠికలు, 16 వ్యాసాలు ఉన్నాయి. విమర్శకు, పరిశోధనకు మాత్రమే ఆచార్య రామరాజు పరిమితం కాలేదు. ప్రముఖులైన వ్యక్తులను గురించి 80కి పైగా వ్యాసాలు రాశారు. జాతీయతను, భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే ఎనిమిది సృజనాత్మక రచనలు రామరాజు సర్వతోముఖ సాహిత్య ప్రాభవానికి తార్కాణాలు. జానపద సాహిత్యాన్ని అభిమానించినప్పటికీ సంప్రదాయ సాహిత్యం పట్ల ఆయనకున్న మక్కువ తక్కువేమీ కాదు. 30 వరకు కావ్య ప్రబంధాలను ప్రవచించి, పరిష్కరించిన వీరు, క్షేత్రమహత్యానికి వస్తువైన పన్నెండు రచనలు చేశారు. రామరాజు వాక్పథాన్ని ప్రతిబింబించే పదహారు సాహిత్య విమర్శ వ్యాసాలు, పది భాషా సంబంధమైన వ్యాసాలు తదనంతరం తరాలకు కరదీపికలు కాగలవు.

స్థూలంగా జానపదగేయాలను లౌకిక గీతాలు, పారమార్థిక గీతాలు అనే విభాగాలుగా వివరించుతున్న కాలంలో అంతకంటే వివరంగా జానపద గేయాల స్వరూప స్వభావాల్లోని వైవిధ్యాన్ని తెలిపే విభజన 'తెలుగు జానపద గేయ సాహిత్యం'లో చేశారు.

ఇంతవరకు ఎవ్వరూ స్పృశించని కొత్త విషయాలు చెప్పాలనే తపనతో వెలువడ్డ చరితార్థక రచన 'చరిత్రకెక్కని చరితార్థులు'. ఈ గ్రంథంలో 34 మంది కవులను చరితార్థులను చేశారు. ఇందులో రెండు విభాగాలున్నాయి. ఇంతవరకు తెలుగు సాహిత్య లోకం గుర్తించని తెలుగు కవులు ఇరవై రెండు మంది గురించి, వారి కావ్యాలకు సంబంధించిన ముఖ్యాంశాలను స్పృశించారు. పన్నెండుమంది సంస్కృత కవులకు సంబంధించింది రెండవ భాగం. ఈ పరిశోధనా గ్రంథంలో తెలియజేసిన కవుల కావ్యాలన్నీ తాళపత్ర ప్రతులే. ఈ పుస్తకంలోని ఒకటి రెండు కావ్యాలు మాత్రం పూర్వకాలపు దళసరి కోరుట్ల కాగితంపై రెండువైపుల మహిపంకముతో రాశారు.

ప్రాచీన గ్రంథాల సేకరణ, పరిష్కరణ వీరికెంతో ఇష్టమైన పనులు. ఒక విధంగా ఆంధ్ర దేశంలోనే తాళపత్ర గ్రంథాల సేకరణ, పరిష్కరణలో ప్రముఖ వ్యక్తిగా పేర్కొనదగ్గవారు ఆచార్య రామరాజు. బొడ్డుచెర్ల తిమ్మయ్య - ప్రసన్న రాఘవ నాట్య ప్రబంధం, శ్రీనాధుని - శివరాత్రి మహత్యం, రఘునాథనాయకుని - వాల్మీకి చరిత్ర, కదిరిపతిరాజు - శుకసప్తతి, మడికి సింగన - పద్మపురాణం, సాయపనేని వెంకటాద్రి నాయకుని - సకల జీవ సంజీవనం వంటి గ్రంథాలను ప్రతిపాదన, నిర్ధారణ, పరిష్కరణ అన్న అంశాల దృక్కోణంతో పరిశీలించారు రామరాజు.ఆయన వ్యక్తిత్వం, ఆత్మ వ్యక్తీకరణ ఈ రచనల్లో ప్రతిఫలించాయి.

ఈయన పరిష్కరించిన సంస్కృత కావ్యాలు కాళహస్తి కవి సంస్కృతానువాదమైన వసుచరిత్ర, శ్రీకృష్ణదేవరాయల జాంబవతీపరిణయం, మధురవాణి రామాయణ సారతిలకం, అభినవ కాళిదాసు, శృంగార శేఖర బాణం, తిరుమల బుక్కపట్టణం, శ్రీనివాసాచార్య వెంకటార్య విజయవైజయన్తీ, అణ్ణయాచార్యుల రసోదాహరణ. ఈ సంస్కృత కావ్య రూపకాల పరిష్కరణలో, కవికాల నిర్ణయంలో, అనువాదం చేసిన తీరు, వాఖ్యానించడంలో చూపిన ప్రతిభాపాటవాలు ఉత్తేజపరుస్తాయి.

ఆచార్య రామరాజు సాహిత్య అనువాదాల్లో కూడా విశేషంగా కృషి చేశారు. గురుగోవింద్ సింగ్ రచనలు, ప్రేమ్‌చంద్ జాతక కథల హిందీ అనువాదం సొరకాయల స్వామి చరిత్ర, ఉర్దూ-తెలుగు నిఘంటు నిర్మాణంపై వీరి కృషి విశిష్టమైనది.

ఈ మహానుభావుని సాహిత్య కృషికి గుర్తింపుగా 1992లో బూర్గుల అవార్డు, 1994లో తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేటు లభించాయి. 1995లో జాతీయ పరిశోధనాచార్యులు (నేషనల్ ప్రొఫెసర్)గా భారత ప్రభుత్వంచే నియామకం పొందారు. 1999లో సురవరం ప్రతాపరెడ్డి అవార్డు, 2000లో తెలుగు ఆత్మగౌరవ పురస్కారం, 2001లో సిద్ధార్థ కళాపీఠం అవార్డును పొందారు. శివానంద ఉత్తమ పౌర పురస్కారాన్ని 2002లోను, రాజ్యలక్ష్మి ఫౌండేషన్ అవార్డును 2003లోను, తెలుగు ఫైన్ ఆర్ట్స్ సొసైటీ న్యూజెర్సీ (యె.ఎస్‌ఏ) అవార్డును, డా.జ్యోతిరావు, కె.వి.రావు అవార్డును 2003లో, అజో-విభో కందాళం ఫౌండేషన్ వారి ప్రతిభా వైజయంతి అవార్డును 2006లోను పొందారు.

మంచి వ్యక్తిత్వంతో సాహితీ సౌరభాలను వెదజల్లిన పరిపూర్ణ జీవితం ఆచార్య రామరాజుది.

-డా.కంచి విజయలక్ష్మి

మరణ శయ్యపై కొకొపా జాతి

అమాయకులైన ఆదివాసీలను ప్రభుత్వాలు ఎంత దగా చేస్తాయి, వారి జీవించే హక్కును సైతం కాలరాసి సంస్కృతిని ఎట్లా నాశనం చేస్తాయి అని చెప్పేందుకు ఇదొక ఉదాహరణ. స్థానిక జాతుల ప్రయోజనాలను ఫణంగా పెట్టి ఇతర అభివృద్ధి చెందిన ప్రజలను అందలాలెక్కించడం కేవలం ఇండియాలోనే కాదు. ప్రపంచమంతా కనిపిస్తుంది. ముఖ్యంగా ఎంతో అభివృద్ధి చెందామని చెప్పుకుంటున్న అమెరికా, ఆ పక్కనే ఉన్న వర్థమాన దేశం మెక్సికో కూడా ఈ దారుణానికి పాల్పడటం చూస్తుంటే..ప్రభుత్వాలన్నీ ఓ తానులో ముక్కలే అనిపిస్తుంది. ఈ రెండు ప్రభుత్వాలు కలిసి 'కొకొపా' అనే స్థానిక జాతిని ఎట్లా మరణశయ్యపైకి ఎక్కించాయో చెప్పే ప్రత్యేక వ్యాసం ఇది.




కొకొపా అనే స్థానిక జాతీయులు అమెరికా (అరిజోనా రాష్ట్రం), మెక్సికో (బజాకాలిఫోర్నియా, సొనొరా రాష్ట్రాలు) దేశాల్లో విస్తరించి ఉన్నారు. కొకొపా అంటే నదీ ప్రజలు అని అర్థం. వీరు దిగువ కొలరాడో నది డెల్టాలో ఐదు వందల ఏండ్లుగా వ్యవసాయం, చేపల వేటమీద ఆధారపడి బతుకుతున్నారు. అటువంటివారికి నదీ జలాలు అందకుండా చేసి వారి జీవనాధారాన్ని, సంస్కృతిని నాశనం చేశాయి రెండు దేశాల ప్రభుత్వాలు. ఒకప్పుడు 22 వేలమంది జనాభా ఉన్న ఈ తెగ వారు ప్రస్తుతం 13 వందలమందికి చేరుకొంది. అట్లాగే లిపి లేని వారి మాతృభాషను కేవలం పది మంది మాత్రమే ఇప్పుడు మాట్లాడుతున్నారు. దీన్ని బట్టి కొకొపా ప్రజలు ఎంత దీనావస్థలో మరణశయ్యపై అల్లాడుతున్నారో అర్థమవుతుంది.

ఏం జరిగింది?

మనిషి జీవించడానికి అతిముఖ్యమైనవి గాలి, నీరు, ఆహారం. ప్రకృతి సహజంగా లభించే ఈ మూడింటి మీద ఆధారపడే మనిషి తాను ఎక్కడ జీవించాలి అనే విషయాన్ని నిర్ణయించుకుంటాడు. గాలి సంగతి అట్లా వదిలేస్తే... నీరున్న ప్రాంతంలోనే మానవ నాగరికతలన్నీ విలసిల్లాయని అనేక ప్రాచీన నదీ నాగరికతలు నిరూపించాయి. ఇప్పటికీ ప్రపంచంలోని గొప్ప గొప్ప పట్టణాలు, నగరాలు అన్నీ నదుల ఒడ్డునే అభివృద్ధి చెందడం తెలిసిందే. నదులు ప్రవహించే ప్రాంతాల్లో జీవించడానికి అవసరమైన నీరు, తినడానికి అవసరమైన పంటలు పండుతాయి కాబట్టి డెల్టాలు, నదీలోయల్లో మానవ ఆవాసాలు ఏర్పాటుచేసుకుంటూ ఉంటారు. ఈ కారణాలతోనే అమెరికా, మెక్సికో దేశాల్లో ప్రవహిస్తున్న కొలరాడో నది దిగువ డెల్టాలో జీవిస్తూ వచ్చారు కొకొపా ప్రజలు. వారి జీవనం 500 ఏండ్లు సాఫీగానే సాగింది. కానీ 1922లో అమెరికా, మెక్సికో ప్రభుత్వాలు కొలరాడో నది నీటిప్రవాహాన్ని మళ్ళించి కొకొపా ప్రజలకు నీరు రాకుండా చేశారు. దీంతో 20 లక్షల ఎకరాల మాగాణి భూమి నీరు లేక ఎండి పోయింది. వ్యవసాయం, చేపల వేట మీద ఆధారపడి జీవించే వేలాదిమంది ప్రజలు ఆకలితో అలమటించిపోతూ వచ్చారు. కొందరు ఉద్యోగాలు, ఇతర బతుకుదెరువును వెదుక్కుంటూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళారు. అక్కడే ఉన్నవారు దుర్భరంగా జీవితాలను వెళ్లదీస్తున్నారు.



1980ల్లో ఎల్ నినో ప్రభావం వల్ల అమెరికాలో విపరీతమైన వర్షాలు కురిసి వాగులు వంకలు పొర్లాయి. కొలరాడో నదిపై కట్టిన డాం జలాశయం నిండి ప్రమాదఘంటికలు మోగించడంతో ప్రభుత్వం గేట్లను ఎత్తివేసి కొకొపా ప్రజలు నివసిస్తున్న ప్రాంతంవైపుకు నీళ్ల వదిలింది. దీంతో కొకొపా ప్రజల కొంపాగోడు





కొట్టుకుపోయాయి. తప్పనిసరి పరిస్థితుల్లో ఈ ప్రజలందరూ ఎల్ మేయర్ ప్రాంతానికి తమ నివాసాలను మార్చుకోవలసి వచ్చింది. కానీ అక్కడ నీటి సౌకర్యం కానీ, వ్యవసాయానికి అనువైన భూములు కాని లేవు. అయితే కొన్నేళ్ల క్రితం అమెరికా, మెక్సికో ప్రభుత్వాలు ఒక్కశాతం నీటినైనా వదిలి కొకొపా మాగాణి భూములు వట్టి పోకుండా కాపాడాలనే ఒప్పందం కుదిరింది. ఇది అమలవుతుండగానే మరో ముప్పు వచ్చిపడింది.

1993లో మెక్సికో ప్రభుత్వం కొకొపా ప్రజలు నివసించే ప్రాంతంలో ప్రవహిస్తున్న కొలరాడో నదిని బయోస్ఫియర్ రిజర్వ్‌గా ప్రకటించింది. ఫలితంగా నదిలో చేపలు పట్టడాన్ని నిషేధించారు. దీంతో కుదుటపడుతున్నాయనుకున్న కొద్ది మంది జీవితాలు కూడా మళ్లీ మోడువారాయి.

-భూపేంద్ర



లియంగ్మాయి

మంగోలాయిడ్ జాతి సమూహానికి చెందిన తెగల్లో ఒకటి లియంగ్మాయి. వీరు మాట్లాడే భాష పేరు కూడా వారి తెగపేరే. ఈ భాష టిబెట్-బర్మా (నాగా బోడో) కుటుంబానికి చెందినది. మణిపూర్‌లో ప్రభుత్వం గుర్తించిన 33 తెగల్లో ఈ తెగ ఒకటి. నాగాలాండ్‌లో వీరిని జెలియంగ్ అని వ్యవహరిస్తారు. మొత్తంమీద వారు మణిపూర్, నాగాలాండ్‌తో పాటు అస్సాం రాష్ట్రంలో కూడా నివసిస్తున్నారు. అయితే మణిపూర్‌లోనే వీరి జనాభా అధికం. వీరు ఆగ్నేయ చైనా ప్రాంతం నుండి వేల ఏండ్ల క్రితం వలస వచ్చారని చెబుతారు. కానీ ఈ వలసను నిర్ధారించే చారిత్రాత్మక రికార్డులు ఏమీ లేవు.

లియంగ్మాయి ప్రజలు ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి బతుకుతారు. అదికూడా పోడు వ్యవసాయమే. వీరి గ్రామాలు కొండలపై ఉంటాయి. సారవంతమైన భూములను వెదుక్కుంటూ వీరి ప్రాచీనుల భూములను వదిలి ప్రస్తుతం ఉన్న ప్రాంతాలకు చేరుకున్నారు.

చగ-న్గీ పండుగ

వీరు అనేక పండుగలు జరుపుకుంటారు. అందులో చగ-న్గీ పండుగ అతి పెద్దది. ఇది అక్టోబర్ మాసంలో వచ్చే పండుగ. అక్టోబర్ 30న ప్రతి ఏడాది జరుపుకునే ఈ పండుగ లియంగ్మాయి ప్రజల సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. తమీ, దిమాపూర్‌లలో ఈ పండుగ ప్రధాన వేదికలు ఉంటాయి. యుద్ధంలో గెలిచిన వీరులను గుర్తు చేసుకుంటూ వారిని గౌరవిస్తూ జరుపుకునే పండుగగా చరిత్రకారులు ఈ పండుగను పేర్కొంటారు. అట్లాగే చగ-న్గీ పండుగను స్వచ్ఛీకరణ-పవిత్రీకరణ చేసేపండుగగాను జరుపుకుంటారు. ఆధునిక కాలంలో లియంగ్మాయి ప్రజల సంస్కృతి కాలగర్భంలో కలిసిపోకుండా బతికించుకోవడం కోసం ప్రతి ఏడాది ఈ పండుగను జరుపుకుంటున్నారు. లియంగ్మాయి ప్రజలు వయసుతో నిమిత్తం లేకుండా సంప్రదాయక దుస్తులు ధరించి ఒకచోట కూడి జానపద గీతాలు పాడుతూ నృత్యం చేయడం చగ-న్గీ పండుగనాడు జరిగే తప్పనిసరి కార్యక్రమం.



ఎస్‌బీఐలో మొదలైన విలీన సెగ!

- 3 నెలల్లో 6622 ఉద్యోగులు ఇంటికి
- ఇక 10,000 మందికి స్థాన చలనం

ముంబయి: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ 'భారతీయ స్టేట్ బ్యాంక్' (ఎస్‌బీఐ) వ్యయ నియంత్రణ చర్యలను ముమ్మరం చేస్తున్నట్టుగా తెలుస్తోంది. సంస్థాగత పరంగా అనుబంధ బ్యాంకుల విలీనం పూర్తవడంతో.. బ్యాంకు ఇప్పుడు కిందిస్థాయిలో శాఖల విలీనాన్ని ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా స్వచ్ఛంద పదవీ విరమణ పథకం, పదవీ విరమణల రూపంలో దాదాపు 6622 మందికి పైగా ఉద్యోగులను ఇంటికి పంపించేసినట్టుగా సమాచారం. ఏప్రిల్ నెల ప్రారంభం నాటికి 2.80 లక్షలుగా ఉన్న ఎస్‌బీఐ ఉద్యోగుల సంఖ్య మూడు నెలలు గడిచి జూన్ ముగింపుకు చేరే సరికి.. 2.73 లక్షలకు పడిపోయింది. రానున్న కాలంలో ఈ తగ్గింపు మరింతగా ఉండనున్నట్టుగా తెలుస్తోంది. పదవీ విరమణలతో 2017-18 ఆర్థిక సంవత్సరంలో సుమారు 15,460 మంది ఉద్యోగులు తగ్గిపోనున్నారని అంచనాలు వెలువడుతున్నాయి. అంతేకాక డిజిటలైజేషన్‌తో పాటు తన అసోసియేట్ బ్యాంకులు తనలో విలీనమైన నేపథ్యంలో 10వేలకు మందికి పైగా ఉద్యోగులను కొత్త ప్రాంతానికి లేదా కొత్త పని విభాగాలకు కేటాయించేందుకు ఎస్‌బీఐ ప్రణాళికలు రచిస్తోంది. దాదాపు 594 బ్రాంచులు ఎస్‌బీఐలో విలీనమయ్యాయి.

అపోలో లాభం రూ.35 కోట్లు

హైదరాబాద్ : అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి రూ. 35.21 కోట్ల లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఏడాది ఇదే కాలంలో అపోలో లాభం రూ.72.17 కోట్లుగా ఉంది. ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో సంస్థ మొత్తం ఆదాయం 14.3 శాతం వృద్ధితో రూ.1,469.66 కోట్ల నుంచి రూ.1,680.71 కోట్లకు చేరింది. ఆదాయంలోంచి అధిక మొత్తంలో తరుగును తీసివేయడం, గత మూడేండ్లుగా ఏర్పాటు చేసిన కొత్త పడకలకు అవసరమైన నిధుల కోసం తీసుకొచ్చిన రుణాలపై వడ్డీ కారణంగా జూన్ త్రైమాసికంలో సంస్థ లాభాలు కుంగినట్టుగా తెలిపింది. ఈ సందర్భంగా అపోలో అధినేత ప్రతాప్ సి రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఆంకాలజీ, న్యూరోసైన్సెస్, ఆర్థోపెడిక్స్, అవయువాల మార్పిడి విభాగాల్లో విస్తరించనున్నట్టుగా తెలిపారు.

గాయత్రీ ఫలితాలు ఆకర్షణీయం

నవతెలంగాణ,హైదరాబాద్: గాయత్రీ ప్రాజెక్ట్స్ జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికి మెరుగైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న ఈ నిర్మాణ సంస్థ ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో సంస్థ స్టాండెలోన్ ప్రాతిపదికన రూ.45 కోట్ల మేర లాభాలను ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో సంస్థ లాభం రూ.16.14 కోట్లుగా నిలిచింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలంలో సంస్థ మొత్తం ఆదాయం రూ.439.86 కోట్ల నుంచి రూ.659.78 కోట్లకు చేరింది. అంతకు ముందు మార్చితో ముగిసిన 2016-17 ఆర్థిక సంవత్సరానికి సంస్థ రూ.2,128 కోట్ల ఆదాయంపై రూ. 74.53 కోట్ల లాభాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఐవీఆర్‌సీఎల్ నష్టం రూ.245 కోట్లు

నవతెలంగాణ, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న నిర్మాణ సంస్థ ఐవీఆర్‌సీఎల్ జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి నిరుత్సాహకర ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో సంస్థ నష్టం రూ.244.74 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో సంస్థ నష్టం రూ.153.58 కోట్లుగా ఉంది. జూన్ త్రైమాసికానికి సంస్థ ఆదాయం రూ.452.69 కోట్ల నుంచి రూ.522.6 కోట్లకు పెరగడం విశేషం. అంతకంతకు పెరుగుతున్న రుణ భారం, సకాలంలో నిర్మాణ పనులను పూర్తి చేయడంలో అవరోధాలు తదితర అంశాలు సంస్థ లాభాలను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి. సంస్థ వీటి నుంచి బయట పడేందుకు గాను వ్యూహాత్మక భాగస్వామిపై దృష్టి సారిస్తున్న విషయం తెలిసిందే.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.